తెలుగు వారి పిల్లలకు

# సమన్వయ భారతి వారి

# ప్రథమ బాల శిక్ష (1)

## తెలుగు సూక్తి సుధ



భారతీయ, మౌలిక భావాల పరిచయం

సాంస్కృతిక, నైతిక దృక్పథ నిర్మాణం,

(తేట తెలుగులో - వేమన సూక్తుల ద్వారా)

రచన: భాగవతుల శ్రీనివాసరావు

తెలుగు వారి పిల్లలకు

**సమన్వయ భారతి వారి**

# ప్రథమ బాల శిక్ష - I

## తెలుగు సూక్తి సుధ



**భారతీయ, మౌలిక భావాల పరిచయం**

**సాంస్కృతిక, నైతిక దృక్పథ నిర్మాణం**

( తేట తెలుగులో - వేమన సూక్తుల ఆధారంగా )

రచన:

**భాగవతుల శ్రీనివాస రావు**

సమన్వయ భారతి వారి

# **ప్రథమ బాల శిక్ష -1** ( తెలుగు సూక్తి సుధ )

ప్రథమ ముద్రణ : అక్టోబరు, 2012
కాపీ రైటు, అన్ని హక్కులూ రచయితవి. **(Vijayawada Jurisdiction)**
**వెల: రు. 40/-**

**ప్రాప్తి స్థానములు :**

(1) **శ్రీమతి భాగవతుల సామ్రాజ్యలక్ష్మి,**
'శ్రీ మణిద్వీపం', 23-23-52,
శివరావు వీధి, సత్యనారాయణపురం,
విజయవాడ-520011, **(A.P.)**
ఫోన్ : 0866-2539845, సెల్ : 9618165402
**E-mail : samanvaya.bharathi@gmail.com**

(2) 'సంకీర్తనా రత్న' **శ్రీ పప్పు సదాశివ శాస్త్రి,**
శ్రీ అన్నమయ్య సంకీర్తనా గాన ప్రచార భక్త బృందం,
'భాగవత మహల్', 23-6-13, కొమ్మువారి వీధి,
సత్యనారాయణపురం, విజయవాడ-520011.
ఫోన్ : 0866-2531187, సెల్ : 98665 25735
**E-mail: pappusadasivasastry@gmail.com**

(3) **శ్రీ శివకామేశ్వరీ గ్రంథమాల,**
కాంగ్రెస్ ఆఫీస్ రోడ్, గవర్నరుపేట,
విజయవాడ -520002.
ఫోన్: 0866-6661777

# విషయ సూచిక


| విషయం | పుట సంఖ్య |
|---|---|
| రచయిత గురించి | 5 |
| 'సమన్వయ భారతి' గురించి | 6 |
| తొలి పలుకులు | 8 |
| ఈ పుస్తకం గురించి | 11 |
| **రోజూ ఒక సూక్తి కార్యక్రమం** | **13** |
| **తల్లిదండ్రులకు సూచనలు** | **15** |
| **ఉపాధ్యాయులకు - విద్యాలయాలకు విన్నపం** | **19** |
| ఆంధ్ర ప్రదేశ్ - ప్రభుత్వాధికారులకు-విన్నపం | 23 |
| పిల్లలకు చక్కని దినచర్య | 27 |
| పిల్లలకు మంచి దృక్పథం | 29 |
| భారతీయతా ప్రతిజ్ఞ | 30 |
| తెలుగువారి ప్రతిజ్ఞ | 32 |
| 1-150 వేమన సూక్తి సుధ **(సూక్తుల పాఠం-కంఠస్థ యోగ్యం)** | **33** |
| 1-150 సూక్తి భావ సుధ **(సూక్తుల తాత్పర్య వివరణం)** | **40** |

| సూక్తి సంఖ్య | విషయం | పుట సంఖ్య |
|---|---|---|
| 1 | తల్లిదండ్రులు | 40 |
| 2 | విశ్వం | 40 |
| 3 | పూర్వీకులు | 40 |
| 4 | పెద్దలు | 40 |
| 5-6 | గురువులు | 41 |

| సూక్తి సంఖ్య | విషయం | పుట సంఖ్య |
|---|---|---|
| 7-13 | ఏకత్వం | 41 |
| 14-19 | ధర్మం | 42 |
| 20-27 | ధనం | 43 |
| 28-40 | ధైర్యం | 45 |
| 41-54 | ప్రయత్నం | 49 |
| 55-57 | సాధన | 53 |
| 58-61 | విలువ | 54 |
| 62 | విద్య | 55 |
| 63-64 | సజ్జనులు | 55 |
| 65 | దుర్జనులు | 56 |
| 66-71 | జనులు | 56 |
| 72-90 | వివేకం | 58 |
| 91-95 | అవివేకం | 65 |
| 96-103 | సుగుణం | 67 |
| 104-110 | దుర్గుణం | 70 |
| 111-113 | మనస్సు | 72 |
| 114 | పురుషులు | 73 |
| 115-119 | స్త్రీలు | 74 |
| 120-125 | మతం | 77 |
| 126-136 | దైవం | 79 |
| 137-143 | పరమాత్మ | 84 |
| 144-150 | మోక్షం | 85 |
| **1-54** | **వేమన పద్యాలు** | **89** |
| 55-108 | వేమన పద్యాలు | 96 |

## రచయిత గురించి :


| | | |
|---|---|---|
| పేరు | : | **భాగవతుల శ్రీనివాస రావు**<br>భాగవత మహల్, 23–6–13,<br>కొమ్ము వారి వీధి, సత్యనారాయణ పురం,<br>విజయవాడ –520011. |
| పుట్టిన తేది | : | **24–12–1943** |
| చదువు | : | **B.Sc., F. I . I . I .,** |
| ఉద్యోగం | : | **Retd. Manager, L .I .C. of India,** |
| ప్రవృత్తి | : | తెలుగు, సంస్కృత గ్రంథాల నుండి –<br>ముఖ్యముగా తెలుగు బాలబాలికలకు<br>ఉపయోగపడే – విషయ, సూక్తుల సేకరణ, వివరణ ! |
| అధ్యయనం | : | తెలుగు, ఇంగ్లీషు, సంస్కృతం (అభిజ్ఞ), హిందీ (విశారద ) |
| ఇతర వ్యాపకాలు | : | ఆది శంకర సేవా సమితి (విజయవాడ) లో<br>క్రియాశీల నిర్వహణ; భారతీయ సాంస్కృతిక,<br>ఆధ్యాత్మిక గ్రంథ పఠనం; |
| బ్లాగులు | : | సమన్వయ భారతి,<br>**samanvayabharathi.wordpress.com**<br>తెలుగు భారతి<br>**telugubharathi.wordpress.com**<br>కంఠస్థ భారతి<br>**kamthasthabharathi.wordpress.com** |
| సెల్ | : | 9618165402 |
| ఇ–మెయిల్ | : | **samanvaya.bharathi@gmail.com** |

## 'సమన్వయ భారతి' గురించి :

1. 'సమన్వయ భారతి' సంస్థ జనవరి, 2008 లో స్థాపించబడింది. ఇది ఒక 'స్వలాభాపేక్ష లేని, రాజకీయ పక్షపాతం లేని, స్వార్థరహిత భారతీయ–ఆంధ్ర జన సేవా సంస్థ' !

2. భారతీయ జన సామాన్యానికి కావలసిన విషయాలను స్పృశిస్తూ, వారి అవగాహనా స్థాయిని పెంచే ఉద్దేశంతో - ఆంగ్లంలో **samanvayabharathi.wordpress.com** అనే పేరిట ఒక బ్లాగు ప్రారంభించబడింది.

3. తెలుగువారి కుటుంబాలలో మాతృభాషకు లభిస్తున్న ఆదరం గమనించి, తెలుగువారి కోసం, తెలుగు భాష ద్వారా అవగాహనా సేవలు అందించాలనే తలంపుతో - **telugubharathi.wordpress.com** అనే పేరుతో రెండవ బ్లాగు ప్రారంభించబడింది.

4. ఇంగ్లీషు మీడియంలో చదువుకొని, క్షణం తీరిక లేని ఉద్యోగ వ్యాపారాలతో సతమతమవుతున్న నేటి తల్లిదండ్రుల యువతరం - భారతీయ విలువల పట్ల, సంస్కృతీ సాహిత్యాలపట్ల అవగాహన పెంచుకునే అవకాశం చాలా తక్కువగా ఉందనే విషయం గ్రహింపుకు వచ్చాక - దృష్టి నేటి చిన్న పిల్లల తరం మీదకు మళ్ళింది! వారే మన ఆశా కిరణాలు !

5. చిన్న పిల్లల శక్తియుక్తులను దృష్టిలో నుంచుకుని, వారికి తెలియవలసిన సాంస్కృతిక అంశాలను - సంగ్రహంగా, సారభూతంగా, కంఠస్థ యోగ్యంగా, సూక్తుల రూపంలో, ఒక క్రమంలో - అందించాలనే ఆకాంక్షతో, మూడవది అయిన

**kamthasthabharathi.wordpress.com** అనే బ్లాగును ప్రారంభించడం జరిగింది !

6. సూక్తులు నోటికి వస్తేనే చాలదు; వాటి భావం మనస్సుకి సంస్కార రూపంలో పట్టాలి ! పైగా, బ్లాగులు అనేవి - విషయం కావలసినవారు వెతుక్కుంటే దొరికేవి; విషయం అవసరమైన వారందరికీ అందజేయాలంటే - ఇప్పటికీ, పుస్తక ముద్రణే శరణ్యమనే కనువిప్పు కలిగాక, ఈ పుస్తకంలో - 150 సూక్తులను విశేష తాత్పర్య సహితంగా - కాదు; 150 విశేష తాత్పర్యాలను సూక్తి సహితంగా ఇచ్చి, 'అమ్మయ్య!' అనుకోవటం జరుగుతోంది.

7. ఇలాంటి, ఇంతకంటె ఎక్కువ తపన కలిగినవారు 'ఎందరో మహానుభావులు' ఉన్నారని మాకు తెలుసు. వారి భావ స్రవంతిని కూడ కొంచెం మా/మన పొలాల్లోకి వదిలిపెడితే, మనవారికి ఇంకా ఎక్కువ ఉపయోగంగా ఉంటుందని మా విన్నపం !

8. మీ మీ స్పందనలను, సూచనలను, విమర్శలను - అవకాశం ఉన్నవారు - **samanvaya.bharathi@gmail.com** నకు ఇ-మెయిల్ ద్వారాను, లేనివారు రచయిత చిరునామాకు లేఖ ద్వారాను పంపించగలరని సవినయంగా మనవి చేస్తున్నాం !

**భాగవతుల శ్రీనివాస రావు,**

**( 'సమన్వయ భారతి' వ్యవస్థాపకులు )**

**తొలి పలుకులు :**

మనం భారతీయులం! అందునా ఆంధ్రులం! సుందరమైన తెలుగు మన మాతృభాష!

మాతృదేశం, మాతృ సంస్కృతి, మాతృ మతం, మాతృభాష, జన్మభూమి – ఈ అయిదూ కూడా – కన్నతల్లితో సమానమైనవే ! తల్లిని వలెనే గౌరవించ దగినవీ, ఎన్నడూ వదిలిపెట్ట దగనివీనూ ! వారసత్వ సంపదగా భవిష్యత్ తరాలకు అందించి తీరవలసినవీనూ !

మన వంశాంకురాలకు – భౌతిక, ఆర్థిక, చారిత్రక – వారసత్వ సంపదను ఎలాగూ అందిస్తున్నాం ! మరి, సాంస్కృతిక వారసత్వం అందించే ప్రయత్నం చేస్తున్నామా ?

సముద్రంలో పడవలో వెళుతూంటే, చుట్టూరా నీరే. కాని త్రాగడానికి ఒక్క చుక్క కూడా పనికిరాదు, దాహం తీరదు ! అలాగే, మన చుట్టూరా – ప్రెస్, మీడియా, ఇంటర్‌నెట్, బుక్‌స్టాల్సు ద్వారా – ఎక్కడ చూసినా సమాచారమే, విజ్ఞానమే విచ్చలవిడిగా వెదజల్లబడి ఉంది ! **Computers, Personality Development, Communication Skills, Competitive Examinations,** ,నీతులు, సూక్తులు, ... – ఇలా ఏది చూసినా వందలకొద్దీ పుస్తకాలు – సూపర్ బజారులో కళ్ళు చెదిరేటట్లుగా కనిపించే వస్తువుల విస్తృత శ్రేణి వలె – విషయబాహుళ్యంతో ఉంటున్నాయి !

ఇంత విస్తారంలోంచి, మనకు అవసరమైనదానిని ఎంచుకుని, సారాన్ని సంగ్రహించటమే ఈనాటి అసలు సమస్య ! ఉన్నత విద్యార్థులు, ఉద్యోగార్థులు ఒకవేళ అలా చేయ గలిగినా, పరీక్షలలో మార్కులకు మాత్రమే ఉపయోగ పడతాయి గాని, వారి తత్త్వంలోకి మాత్రం ఇమడలేవు ! ఎందుకంటే – ఆ వయసు వచ్చేటప్పటికే వారి మనసులలో లేతదనం తగ్గి, దృఢత్వం ప్రవేశించి, సంస్కార్య యోగ్యత తగ్గి ఉంటుంది !

అందుకే, ఒక ప్రణాళిక ప్రకారం, పిల్లల దృక్పథ నిర్మాణానికి అవసరమైన – తమ సంస్కృతీ సంప్రదాయాల గురించిన కనీస అవగాహన కలిగేందుకు అవసరమైన – విషయాలను, చిన్న వయసులోనే, అంటే – చదువుయొక్క టెన్షన్సు మీద పడకముందే, అంటే 8వ తరగతి లోపే– ఆడుతూ పాడుతూ నేర్చుకునే వీలు కలిగించ లేమా? ఉద్యోగాలలో చేరిన మన పిల్లల తరం వారు – ఇప్పుడు మనం చెప్పబోయినా – విని, గ్రహించి, పాటించబోయే పరిస్థితులలో ఉన్నారా?! అందువల్లనే

**(Catch them Young)** అన్నట్లుగా – మన మనుమలు, మనుమరాళ్ళ తరం లోని ఇప్పటి చిన్న పిల్లలకు – నేర్పటం ఇప్పటి నుంచైనా మొదలు పెడదాం !

మన సమాజంలోని నలుగురూ మెచ్చుకునేటట్లుగా – నీతి నిజాయతీలు, మంచి శీలం నడవడికలు, ఉత్తమ వ్యక్తిత్వం మధుర వాక్కులు, సభ్యత సంస్కారాలు, – ఇవన్నీ, మన పిల్లలకు అలవడాలంటే – భారతీయ మహర్షుల (ఆర్ష) సాహిత్యమే ఆధారం ! అవి మౌలికంగా సంస్కృతంలోనే ఉన్నాయి. ఆ భావ జాలమే అన్ని భారతీయ భాషా సాహిత్యాలలోకి ప్రవహించింది !

అందుకనే ప్రతి భారతీయుడు తన మాతృభాష, సంస్కృత భాషల ద్వారా మాత్రమే, వీటిని సంపూర్ణంగా పొంది ఆనందించ గలడు ! విదేశీ భాషల ద్వారా – అసలైన స్ఫూర్తి **( True Spirit )** కలగదు ! ఉదా: ‘ ఆత్మ ’ అనే పదం వల్ల కలిగే విస్తృతమైన భావంలో శతాంశం కూడా – **(Self, Soul, Spirit)** వంటి పదాలవల్ల కలగదు !

అయితే, ఈ విషయాలన్నీ ప్రామాణికంగా, నిర్దుష్టంగా, సంక్షేపంగా ఎక్కడ దొరుకుతాయో తెలియక, తల్లి దండ్రులు ఊరకుండి పోతున్నా రనిపిస్తుంది! అలాంటి తెలుగు సోదర–సోదరీమణులకు కరదీపికగా ఉపయోగ పడాలనే తపనతోనే – సమన్వయ భారతి వారు ప్రాచీన ప్రామాణిక గ్రంథాలనుంచి సారాన్ని గ్రహించి, ఈ నాటి బాలబాలికలకు, విద్యార్థులకు తెలియటం అత్యవసరమైనంత మేరకు, వారికి ఉపయోగపడేలా గ్రంథసారాన్ని అందజేసే కృషి ప్రారంభించారు ! ఇవి చదివితే, ఇట్టి విషయాలకోసం ఇక్కడా అక్కడా వెదుకులాడ వలసిన అగత్యమే రాదు! అందులో భాగమే ఈ ప్రథమ బాలశిక్ష !

ఒక్క మాతృభాష ఆధారంగా – సాహిత్యాన్ని, మానసిక వికాసాన్ని సంతరించుకుంటే – ఇంగ్లీషే కాదు, ప్రపంచంలోని ఏ భాషలోనయినా –సాధికారత సంపాదించుకోవటం అత్యంత సులభం !

పూర్తి పద్యం కన్న, పద్యపాదం చిన్నదిగా, తేలికగా గురుతుండిపోయేదిగా ఉంటుంది. బాల–బాలికలకు, వారి శక్తి–యుక్తులకు తగినట్లుగా, తేలికగా వారి నోట్లో ఆడుతూ, బుద్ధిలో భావ–స్ఫురణం కలిగించే సూక్తులు ఈనాడు ఎంతో అవసరం ! వీటితో కనీస పరిచయం కలిగిస్తే – ఈ రోజులలో బాగా ఆదరణ పొందుతున్న – వ్యక్తిత్వ వికాసం, భావ ప్రకటనా నైపుణ్యాలు, భావోద్వేగ నియంత్రణ **( Personality**

**Development, Communication Skills, Emotional Quotient, etc.)** మొ.నవి - వారి వ్యక్తిత్వంలోనే సహజంగా ఇమిడి పోతాయి! అతికించుకున్నట్లు ఉండవు !

ఇవి నేర్చినవారు ప్రపంచంలో ఏ దేశానికి వెళ్ళినా, భారతీయ సాంస్కృతిక రాయబారులుగా ( **Cultural Ambassadors** ) గా, మన్నన లందగలుగుతారు! అన్నిటికన్న ముఖ్యంగా - మానసిక వికాసం ద్వారా - మానవ జీవన ఆనందాన్ని - శాంతియుత సహజీవనంతో, కళాత్మకంగా, సర్వాంగ సుందరంగా ఆస్వాదించ గలుగుతారు !

భవదీయుడు,

భాగవతుల శ్రీనివాసరావు.

ఇ-మెయిల్: samanvaya.bharathi@gmail.com

( విన్నపం: మీ స్పందనలను, సూచనలను ఇ-మెయిల్ కు గాని, లేఖ ద్వారా గాని పంప ప్రార్థన ! )

**కృతజ్ఞతలు :**

**శ్రీ సాంబ సదాశివ స్వామికి, జగన్మాతకు, భారత మాతకు, తెలుగు తల్లికి, గురు పరంపరకు, యోగి వేమనకు, నా జీవిత భాగస్వామికి, చక్కని సహకారం అందిస్తూన్న కుటుంబ సభ్యులకు, ప్రయోగశాలగా వర్తిస్తూన్న మా మనుమలూ మనుమరాళ్ళకు, ప్రోత్సహిస్తూన్న మిత్ర వర్గానికి, రేపటి తరం తెలుగు పౌరుల తల్లిదండ్రులకు, తాతా మామ్మలకు, అందరికన్న ముఖ్యంగా - పిల్లల భవిష్యత్తును తీర్చి దిద్దే ఉపాధ్యాయ వర్గానికీ, వారిని నడిపించే విద్యాలయాధిపతులకూ, సహానుభూతిపరులకు -**

**అందరికీ కృతజ్ఞతాభినందనలు !**

**ఈ పుస్తకం గురించి :**

ఈ పుస్తకం పేరు ‘ ప్రథమ బాల శిక్ష ’ ! తెలుగు వారి పిల్లల లేత మనస్సులలో ప్రప్రథమ సంస్కారాలుగా పడ దగిన విషయాల సంపుటి ! ఇది మొదటి భాగం !

తెలుగువారి పిల్లలకు మొట్ట మొదటగా – విశాల భారతీయ సంస్కృతీ భావజాలంతో బాటు, మాతృభాష కమ్మదనంతో కూడ అనుబంధం ఏర్పడాలంటే – వేమన పద్య సాహిత్యాన్ని మించినది లేదు ! వీటివల్ల, తేట తెలుగు మాటలతో పరిచయం, తెలుగు పలుకుబడిలోని తియ్యదనం, తెలుగు జాతీయాల గొప్పదనం, తెలుగు కవిత్వపు సౌందర్యం – అన్నీ ఒకే ప్రయత్నంలోనే తెలిసే వీలు ఉంది !

అందుకే, వేయికి పైగా వేమన పద్యాలను పరిశీలించి, పిల్లల కోసమే ఎంచి ఏర్చి కూర్చిన సూక్తుల మణిహారం, కంఠమాల యీ బాలబోధ ! ఇందులోని ప్రతి సూక్తి ఒక ఆణిముత్యమే !

పుస్తకం మొదటి భాగంలో – మొత్తం 150 సూక్తుల పాఠాన్ని వరుసగా యివ్వటం జరిగింది. ఉచ్చారణలో ఒక లయ రావడానికై – ఎక్కడ ఆపి చదివితే బాగుంటుందో సూచించటానికై – ప్రతి సూక్తి మధ్య భాగంలో ఎక్కువ స్థలం వదలటమైంది – ఈ సూక్తులను పిల్లలచే కంఠస్థం చేయించటం అనేది ప్రధాన ఉద్దేశం కాబట్టి !

రెండవ భాగంలో సూక్తితో బాటు తాత్పర్యం కూడా ఉన్నది. ఏది ఎందుకు చేయాలో, చేస్తే లాభ మేమిటో, చేయకపోతే నష్ట మేమిటో ( **Rationale**) ని – వివరించే ప్రయత్నం జరిగింది ! తాత్పర్యం ధారాళంగా చదవలేని, అర్థం చేసుకోలేని పిల్లలకు భావాన్ని వివరించటంలో – తల్లి దండ్రులకు, ఉపాధ్యాయులకు సహాయకారిగా ఉండేటట్లుగా – తాత్పర్యం ఇవ్వ బడ్డది. వేమన సూక్తులలోనే చాలా తేట తెలుగు పదాల పరిచయం కలుగుతుంది. తాత్పర్యంలో మరిన్ని తెలుగు, సంస్కృత పదాలను పరిచయం చేయటం జరిగింది !

మూడవ భాగంలో – అతి అందమైన వేమన పద్యాలను కొన్నిటిని అందిస్తున్నాము! ఈ పద్యాలన్నీ గూడా – తెలుగు లోని కమ్మని అందాలు, భావాల సుగంధాలు, వీనులకు విందుగా ఉండే పదాల పొందిక, మొ. లక్షణాలతో – చిన్నారుల (**Little Hearts** ) కి గూడా అనుభూతిని కలిగించేంత సుందరమైనవి ! (**Pre-School Nursery Rhymes** ) గా, జిలిబిలి పలుకుల తెలుగు చిన్నారులకు నేర్ప దగినవిన్నీ!

ఈ పుస్తకం, నవల వలె, వరుసగా చదవ దగినది కాదు. ఒక రోజుకు ఒక సూక్తిని, దాని భావాన్ని ఒంటబట్టించుకోటమే ముఖ్యం ! ఈ చిన్ని పుస్తకానికి పిల్లలే పాఠకులు ! సూక్తులను సులభంగా కంఠస్థం చేయించటమే ప్రథమ ధ్యేయం ! భావాన్ని స్థూలంగా అవగాహన చేసుకోవటం రెండవ లక్ష్యం !

రెండు మూడు చోట్ల మాత్రమే, ఒకటి రెండు పదాలను మార్చి, సూక్తిని ఇంకా అర్థవంతంగా, ఇంకా ప్రయోజనకరంగా మార్చటం జరిగింది. ఉదా: ' కొయ్య దుంగ దెచ్చి కొట్టితే గుణి యగునె?' అని ఉన్న దానిని – ' కొయ్య దుంగ దెచ్చి చెక్కితే గుణి యవదె?' అని యివ్వటం జరిగింది. మన బాలబాలికలకు వ్యంగ్యం ( **Satire** ) కు బదులు – సకారాత్మక సూచనలు ( **Positive Suggestions** ) అందించాలనే తపనతోనే ఇలా చేయటం జరిగిందని గ్రహించ మనవి.

ముఖ్య విషయం ! తాత్పర్యంలోని భావాల్ని ఇంకా విస్తారంగా చెప్పే వీలు ఉండి యుండ వచ్చు. కాని, చెప్పిన విషయాలు మాత్రం – భారతీయ సంస్కృతి లోని ప్రామాణిక అంశాలే ! ఈనాటి పరిస్థితులలో – పిల్లలకు నిరభ్యంతరంగా నేర్పదగిన **(Secular)** భావాలే ! జాతీయ సమైక్యతను, సర్వమత–సమానత్వ భావనను పెంచి పోషించేవే ! విశ్వ మానవ సౌభ్రాతృత్వాన్ని, శాంతియుత సహజీవనాన్ని నేర్పేవే !

అందుకని, ఈ పుస్తకం – ఇతర మతాలకు చెందినవారైనా గాని – తెలుగువారందరూ – చదవదగినది ! ' ప్రతిజ్ఞ ' అనే పేజీని గూడ ప్రత్యేకంగా అందరూ చదవాలి ! దీనివల్ల, భారతీయులందరం ఒకటే అనీ – ' హిందూ మతం ' అనేది – భారతీయ సనాతన జీవన విధానాన్ని సూచించేదేననీ – భావాలూ, సంప్రదాయాలలో భిన్నత్వాన్ని అనుమతించేదేననీ ( ప్రోత్సహించేదనీ) కూడా గ్రహించగలుగుతారు ! హిందూమతంవల్లనూ, దాన్ని పాటించే వారివల్లనూ – తాము అల్ప సంఖ్యాకులైనా గానీ, ఏమాత్రం భయపడ వలసిన పరిస్థితులు లేనేలేవనే విషయమూ గ్రహించ గలుగుతారు ! అభద్రతాభావం లేకపోవటమే–శాంతియుత సహజీవనానికి–మొదటి మెట్టూ, చివరి మెట్టూ గూడా !

చక్కగా పండిన చక్కెరకేళీ పండును, పెచ్చు వలిచి మీకు అందిస్తున్నాం ! ఇంక మీరు, పిల్లల నోటికి అందించటమే తరువాయి ! శుభమస్తు !

**( The main idea is to EMPOWER all the Parents and Teachers, to be able to clarify with confidence, the numerous DOUBTS of Children, in matters of Culture, God, Good Character, etc.)**

**‘ రోజూ ఒక సూక్తి ! ’ కార్యక్రమం. ( "A Quotation A Day " Programme)**
**– ‘ సమన్వయ భారతి ’ విధానం !**

తమ పిల్లల మానసిక వికాసం కోసం, వారి వ్యక్తిత్వ వికాసం కోసం – తల్లిదండ్రులు ఇద్దరిలో ఒకరు – రోజు మొత్తంలో కేవలం 5 నిమిషాలు వినియోగిస్తే చాలు ! అద్భుతమైన ఫలితాలు ఖాయం !

పోషకాహారం ఇవ్వటం ఎంత ముఖ్యమో, దాని రసాన్ని గ్రహించే శక్తిని కలిగించటం కూడ అంతే ముఖ్యం ! సరియైన ఔషధం ఎంత ముఖ్యమో, దాన్ని సేవించే విధానం కూడ అంతే ముఖ్యం ! అలాగే, అందించాల్సిన విషయం ఎంత ముఖ్యమో – అందించే విధానం కూడ అంతే ముఖ్యం !

పిల్లల (**Alround Development**) కి కావలసిన విషయాలన్నీ కూడా – పాఠ్యాంశాల ( **Syllabus** ) ద్వారా, స్కూలు ద్వారానే లభిస్తున్నాయా? లేక పోతే, ఎక్కడ దొరుకుతాయి ? పిల్లలకోసం ఇంట్లో కొని పడేసిన పుస్తకాలు ఎన్నో ఉంటాయి గదా? అవన్నీ పిల్లలు చదువుతున్నారా? అవి చదివితేనే చాలా? ఇట్లాంటి సవాలక్ష సందేహాలకి సమాధానంగా, ‘ సమన్వయ భారతి’ వారు సూచిస్తున్న విధానమే – ఈ ‘ రోజూ ఒక సూక్తి ’ కార్యక్రమం ! చేయటం చాలా తేలిక, ఫలితం చాలా ఎక్కువ !

<u>పిల్లల తల్లిదండ్రులలో ఒకరు – రోజు మొత్తంలో కేవలం 5 నిమిషాలు వినియోగిస్తే చాలు ! ఈ క్రింది చర్యలు చాలు !</u>

1. ఈ పుస్తకంలోంచి ఒక్కో రోజు ఒక్కో సూక్తిని (ఒక లైను మాత్రమే) పిల్లలకు కంఠస్థం చేయించాలి. 5,6 సార్లు అనిపిస్తే చాలు, వచ్చేస్తుంది.
2. దాని భావాన్ని ఒకసారి వివరించటం. సంభాషణా ధోరణిలో చేయవచ్చు. లేదా, ఈ పుస్తకంలో యిచ్చిన తాత్పర్యాన్ని చదివి వినిపిస్తూ, వివరించవచ్చు!
3. వారాంతంలో ఒకసారి, అప్పటి వరకు కంఠస్థంగా వచ్చిన సూక్తులను గుర్తు చేసుకోవటం. ఒకటి రెండింటికి భావాన్ని మాతృభాషలో వివరించే ప్రయత్నం చేయమని పిల్లలను అడగటం ! దీనివల్ల వారి భావ ప్రకటనా నైపుణ్యాలు కూడ మెరుగు పడతాయి !

4. ఒకవేళ, స్కూలువారే ఈ కార్యక్రమం నడిపిస్తూంటే గనుక, ఊరికే – 'ఇవాళ్టి సూక్తి ఏం చెప్పారు?' అని కనుక్కోవటం; అర్థం చెప్పమని పిల్లలను ప్రోత్సాహ పరుస్తూ, భావ సంపూరణం చేయటం ! అంతే !

5. తెలుగు లిపి చదవటం రాని పిల్లలకు – లిపి వచ్చినట్టి, వారి వారి పెద్దలే – చదివి వినిపించి, అనిపించి, వివరించి – నోటికి వచ్చేటట్లు చేయవచ్చు!

ప్రతి రోజూ కుదరక పోయినా, మొత్తం మీద ఒక విద్యా–సంవత్సరం పూర్తి అయ్యే లోపల, 150 సూక్తులు గల ఈ పుస్తకం తేలికగా పూర్తి అవుతుంది !

' తిన్న గాని తీపి తెలియరాదు ! ' అన్నాడు వేమన ! ఒక తరగతి పిల్లలకు, ఒక ఏడాదిలో, ఇది పూర్తి చేసిన తల్లిదండ్రులకే తెలుస్తుంది – దీని ప్రయోజన మేమిటో, వారి పిల్లలలో ఎంతటి గుణాత్మక పరివర్తన వచ్చిందో – అనే సంగతి !

తరువాతి సంవత్సరానికి, ఇటుపైన చెప్ప దగిన సాంస్కృతిక, నైతిక సూక్తుల రెండవ సంచికను అందించే ప్రయత్నం చేస్తాము ! ఇట్లా, ఒక పూర్ణ ప్రణాళిక ప్రకారం – చిన్న వయసులోనే ఒక అయిదు సంవత్సరాలు – ఆడుతూ పాడుతూ నేర్చుకునే ఈ సూక్తి–కార్యక్రమం వలన, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాలు కలగటం ఖాయం ! ఒంటబట్టి, తత్త్వంలో ఇమిడిపోయి సహజంగా నప్పుతాయి !

పెద్ద తరగతులలో చదువుల ఒత్తిడి పెరిగే సమయానికి, ( **Crash Courses)** వంటి పాక్షిక పుస్తకాలు, కార్యక్రమాల వెంట పరుగులు తీయవలసిన అవసరమే ఉండదు ! ఒక్కో నీటి చుక్కా కలిస్తే సముద్రమవుతుంది ! రోజుకో సూక్తి వలన 8వ తరగతి అయ్యేలోపు వందలకొద్దీ సూక్తులు, సద్భావాలు తమ వశంలో ఉంటాయి! ఒక ' నడిచే వివేక–ఆనంద మూర్తి' అవుతారు పిల్లలు!

## తల్లి దండ్రులకు సూచనలు !

భారతీయులైన తెలుగువారైన తల్లిదండ్రులు ఎక్కువమంది, సామాన్యంగా – తమ 'పిల్లలకు ఏమేం కావాలి ? ' అని – కోరుకుంటారో చూద్దామా?

1. ఆధునిక ఉన్నత విద్య, గొప్ప ఉద్యోగ వ్యాపార నైపుణ్యాలు, విదేశీ ఉద్యోగాలు, విదేశీ పౌరసత్వం (**Green Cards**), కొన్ని తరాలకు సరిపడే ఆస్తిపాస్తులు, వివాహం, పిల్లాపాపలు, మొ. ఇంకా వీలయితే, తమ పెద్ద వయసులో తమని (తల్లిదండ్రుల్ని) స్వయంగా కనిపెట్టి ఉండటం !

2. దీర్ఘాయురారోగ్యాలు, అనుకూల దాంపత్యం, సత్సంతానం, అష్ట ఐశ్వర్యాలు!

3. భావ ప్రకటనా నైపుణ్యం, సంభాషణా ఔచిత్యం, వ్యవహార దక్షత !

4. వ్యక్తిత్వ వికాసం, మానవీయ దృక్పథం, చక్కని శీల నిర్మాణం, నైతిక స్థాయి, బుద్ధి వివేకం, ఉచితానుచిత వివేకం, ఉద్వేగాల సమతౌల్యం, ఆత్మాభిమానం, ఆత్మ విశ్వాసం, ఆత్మ గౌరవం!

5. సత్కీర్తి, సర్వత్రా విజయ సిద్ధి, సాంప్రదాయ కళలు, జీవన ఆనంద ఆస్వాదన!

6. దేశభక్తి, సామాజిక స్పృహ, దేశ ప్రజల యోగక్షేమాలు, నాయకత్వ లక్షణాలు!

7. మాతృభాషతో అనుబంధం, తెలుగు సంస్కృతీ సంప్రదాయాల ఆచరణ !

8. భారతీయ సంస్కృతి అంటే? – అనే స్థూల అవగాహన, గౌరవం, ఆచరణ!

9. ధర్మార్థకామమోక్ష చతుర్విధ ఫల పురుషార్థములలో మొదటి మూడూ – పై అంశములను సాధిస్తే, అవి సిద్ధించినట్లే ! మానవ జీవిత సాఫల్యానికై, మిగిలినది, నాలుగవది అయిన మోక్షం కోసం – ఆధ్యాత్మిక సాధన చేయటం!

పైవన్నీ ఒకటొకటిగా సాధించాలంటే – విద్య అవసరం ! విద్య రెండు రకాలు – కళాశాల విద్య, భారతీయ సాంస్కృతిక విద్య ! కళాశాల విద్యల వల్ల – ముఖ్యంగా ఇంగ్లీషు భాషా నైపుణ్యాల వల్ల – పైన 1లో చెప్పిన లాభాలు కలుగుతాయి ! మరి పైన 2 నుంచి 9 వరకు చెప్పిన ప్రయోజనాలు సిద్ధించాలంటే మాత్రం – ఇంగ్లీషు భాష వల్ల, స్కూలు కాలేజీ విద్యలవల్ల – లాభం చాలా తక్కువ ! రెండవది అయిన భారతీయ సాంస్కృతిక విద్య ఉండి తీరాల్సిందే !

మన మాతృభాష తెలుగుతోను, తెలుగుకే మాతృభాష అయిన సంస్కృతం తోను, వాటి సూక్తి సాహిత్యాలతోను పరిచయం లేనిదే - ఈ గుణాత్మక పరివర్తనలు, అభ్యుదయాలు కలిగే అవకాశం చాలా తక్కువ ! ఈ సంస్కారాలు అలవడితేనే, ఎవరైనా గాని - గౌరవప్రదంగా, సుఖంగా, శాంతిగా, ఆనందంగా - తాము జీవిస్తూ, ఇతరులను కూడ జీవింప జేయగలరు !

అందుకే, పిల్లలకు చిన్న వయసులోనే రెండు రకాల సంస్కారాలూ అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుంది ! కాబట్టి, పిల్లలను ఇంగ్లీషు మీడియం స్కూల్లో చేర్పించవచ్చు, చేర్పించాలి కూడా ! కాని, తెలుగుతోను, సంస్కృతంతోను, భారతీయ సంస్క ృతితోను అనుబంధం తెగిపోయేటట్లుగా చేయగూడదు ! మీరు ఈ అభిప్రాయాన్ని స్కూలువారికి తెలియజేస్తూంటే, వారు కూడ తదనుగుణంగానే చేస్తూంటారు ! చెప్పక పోతే మటుకు - ' మీ పిల్లలకు మాతృభాషతో సంబంధం లేకపోవటమే మీకు యిష్టమేమో ' అనే అపోహలో పడతారు !

ఇంగ్లీషు భాష అవసరం స్కూలు తరగతులలో, ఏయే సబ్జెక్టులలో ఎంతవరకో అంతవరకే ! మొత్తం జీవితాన్ని, మానవ సంబంధాలని, సంభాషణలనీ, ఆలోచనలనీ - అన్నిటినీ శ్వాసించే స్థితికి, శాసించే స్థితికి ఇంగ్లీషును తెచ్చిపెట్టుకో గూడదు !

అలా చేయటం వల్ల, పిల్లల సర్వతోముఖ అభివృద్ధిలో పెద్ద భాగాన్ని - మనమే మనకు తెలియకుండానే కోత పెడుతున్నాం అన్నమాట ! శరీరం మాత్రమే భారతీయం - వేషభాషలు, వాక్కు, మనసు, హృదయం మాత్రం విదేశీయం - అనే పరిస్థితిని చేజేతులా తెచ్చుకోకూడదు ! నదీ జలాలు కలుషితమయ్యే విధంగానూ, భూగర్భంలో జలాలు ఇంకిపోయే విధంగానూ దశాబ్దాల తరబడి ప్రవర్తించి, ఇప్పుడు హాహాకారాలు చేస్తే, లాభం ఏమిటి? జ్ఞానోదయం ఒక జీవితకాలం లేటు - అన్న మాట ! ముందుగానే మేల్కొందాం !

మన పిల్లలకు, మాతృభాష తెలుగుతో అనుబంధం పెరగాలంటే - తెలుగు లిపిని ( వర్ణమాల, గుణింతాలు, ఒత్తులను ) వ్రాయటం నేర్పించటమే - మొట్టమొదటి మెట్టు, అన్నిటికన్నా ముఖ్యమైనదీను ! తెలుగు వర్ణమాల తెలియనిదే, కేవలం ఇంట్లో నాలుగు ముక్కలు పొడి పొడిగా మాట్లాడినంత మాత్రాన, ' మేం తెలుగువాళ్ళం !' అని సగర్వంగా ఎలా చెప్పుకోగలం ?! ప్రతి తెలుగు కుటుంబంలోనూ, తెలుగు భాష మాటలాడటం, వినటం, వ్రాయటం, చదవటం, సాహిత్యావలోకనం జరుగుతూండాలి !

**సారాంశంగా – తల్లిదండ్రులు ప్రధానంగా దృష్టి సారించాల్సిన అంశాలు ఇవీ ! –**

1. ఇంగ్లీషు మీడియం యొక్క ఉపయోగిత, పరిధులను గుర్తించటం ! ('అతి సర్వత్ర వర్జయేత్ !')

2. బోధనా తరగతులకు బయట – స్కూల్లైనా, ఇల్లైనా, సమాజంలోనైనా గాని – హాయిగా మాతృభాషలో సహజంగా అనాయాసంగా స్వేచ్ఛగా మాట్లాడనివ్వటం ! ( మనసు విశాలంగా ఎదగటానికి ! )

3. తెలుగు లిపిని వ్రాయటం, చదవటం తప్పనిసరిగా నేర్పించటం ! (తెలుగువారం అయినందుకు కనీస బాధ్యత ! )

4. సంస్కృత భాషతో, సూక్తులతో కనీస పరిచయం కలిగించటం ! వ్యవహార నీతి ( **Cultured Behaviour** ) చేతనవటానికి; భారతీయ సంస్కృతితో అనుబంధం ఏర్పడటానికి ! ( **for Good Personality Development** )

5. ఆంగ్లంతో సహా ఇతర భాషలన్నిటినీ – **Who is Who ? What is What?** అనే విషయ సేకరణకంటే గూడా ముఖ్యంగా – వాక్య నిర్మాణ రీతులు, వ్యాకరణ యుక్తంగా నేర్పించటం ! ( ఒక ఆలోచన మనసులో తట్టటం ఆలస్యం, ఏ భాషలోనైనా వ్యక్తీకరించే కౌశలం కోసం ! ) ( **for Superior Communication Skills** )

6. చిన్న తరగతులలో ( 8వ తరగతి వరకు ) – మార్కులు, ర్యాంకులు మొ. బాదరబందీ కన్నా, పునాదులు గట్టి చేయటం ( **Real Standard Building**) పైనే దృష్టి ఎక్కువగా పెట్టటం !

7. పిల్లల బాధలను అర్థం చేసుకుంటూ, వారి స్కూలు బ్యాగు బరువునీ, సిలబస్ బరువునీ, ప్రాజెక్టుల బరువునీ – ఇంతెందుకు, అన్ని రకాల బరువు బాధలనీ – తగ్గించేందుకు ప్రయత్నాలను కొనసాగిస్తూండాలి ! ( **to make Learning a Pleasant Experience !** )

8. ఈ పుస్తకంలోని ప్రతి అంశమూ కూడ, పిల్లల అభివృద్ధికై ఉద్దేశించబడిందే ! వారి బాగును తల్లిదండ్రుల కంటె ఎక్కువగా ఎవరు కోరుకుంటారు ?! కాబట్టి, ఇందులోని అన్ని అంశాలను మీరు ఒకసారి వివరంగా చదివితే, పిల్లలకు కలిగే చాలా సందేహాలకు శాస్త్రీయమైన వివరణలివ్వ గలిగే స్థితిలో మీరు ఉంటారు !

9. ఈ పుస్తకంలోనే - ఉపాధ్యాయులకు, స్కూలు మేనేజిమెంటులకు, ప్రభుత్వ శాఖలకు చేసిన విన్నపాల్ని కూడ పరిశీలించి, ఆ ప్రయోజనాలు కూడా మీ పిల్లలకు దక్కే విధంగా కృషి చేస్తూనే ఉండటం ! ( **irrespective of what the Govt. policies are, and what the School Management provides !** )

10. ' రోజూ ఒక సూక్తి ' కార్యక్రమంలో వివరించిన విధంగా, మీ పిల్లలతో రోజూ ఒక 5 నిమిషాలు గడపటం ! ( వారి సర్వతోముఖాభివృద్ధికై ) !

11. ' ప్రతిజ్ఞ ' పేజీని తరచుగా చదివించటం ! ( ఉత్తమ వ్యక్తిత్వ, దృఢ దృక్పథ నిర్మాణానికై ! )

శుభస్య శీఘ్రమ్ ! శుభం భూయాత్ !

**ఈ పుస్తకం యొక్క పూర్తి ప్రయోజనం పొందాలంటే - అతి ముఖ్యమైనవి :**

1. **రోజూ ఒక 5 నిమిషాలు పిల్లల మానసిక వికాసం కోసం వినియోగించటం !**
2. **తాత్పర్యాలలో (పేజీలు 40-88) చెప్పిన భావాలను రోజుకొక విషయం వివరించటం !**
3. **ఆ విషయానికి సంబంధించిన సూక్తిని నోటికి వచ్చేటట్లు చెప్పటం!**
4. **అప్పుడప్పుడు ప్రతిజ్ఞలను ( పేజీలు 30-32 ), దినచర్యా దృక్పథ గేయాలను ( పేజీలు 27-29 ), వేమన శతక పద్యాలను ( పేజీలు 89-104 ) వినిపించటం, అనిపించటం !**

**ఉపాధ్యాయులకు, విద్యాలయాధిపతులకు ( School Management ) లకు విన్నపం !**

దేశాభ్యుదయానికి – ప్రకృతి వనరులు, మానవ వనరులు రెండూ – రెండు కళ్ళు!

భవిష్యత్ తరమునకై మానవ వనరుల్ని తీర్చి దిద్దటంలో – మీ పాత్ర అమోఘ మైనది ! తల్లి దండ్రుల పాత్ర కంటె, ప్రభుత్వ పాత్ర కంటే కూడా ప్రధాన మైనది! అయితే, మీకున్న సమయం, శ్రమ మొ. పరిమితుల దృష్ట్యా, **మీమీద భారం పడకుండానే – విద్యార్థుల మానసిక, నైతిక, సాంస్కృతిక స్థాయిని – గణనీయంగా పెంచే సువర్ణావకాశం** మీ చేతులలోనే ఉన్నది. అందుకే ఈ విన్నపం !

(1) **' రోజూ ఒక సూక్తి ' కార్యక్రమం !** ( **A Quotation A Day Programme**)!

దీనిని విద్యాలయాల్లో అమలుచేసేందుకు అతి తేలిక పద్ధతి యిదీ ! ఇలా చేయటం వల్ల, విద్యార్థులందరికీ, తరతమ భేదం లేకుండా, మన సంస్కృతీ విజ్ఞానం అందుతుంది !

**తెలుగు లిపిని చదవగలిగిన ఏ సబ్జెక్టు ఉపాధ్యాయుడైనా సరే** – ఈ విధానం ద్వారా సత్ఫలితాలు తప్పక సాధించగలరు ! తెలుగువారుగా పుట్టిన విద్యార్థులకు – వారు ఏ మీడియంలో చదువుతున్నా గానీ – భాషగా తెలుగుకు బదులు హిందీ వంటి భాషలను ఎంచుకున్నా గానీ – ఈ ప్రణాళిక దివ్యంగా పని చేస్తుంది !

ఒక స్కూలులో ఉన్న మొత్తం సెక్షన్లను, ఇలాంటి ఔత్సాహిక ఉపాధ్యాయుల బృందంలోని ఒక్కొక్కరు ఒకటి లేదా ఎక్కువ సెక్షన్లను దత్తత తీసుకోవచ్చును. రోజు మొత్తం మీద, తాము ఏ సెక్షను నైతే దత్తత తీసుకోవటం జరిగిందో – ఆ ఒక్క సెక్షనుకి వెళ్ళినపుడు మాత్రమే, ఆ ఒక్క పీరియడ్ టైమ్ లోంచే – ఒక్క 5 నిమిషాలు వినియోగిస్తే చాలు !

స్కూలు పని చేసే దినాలలో – ప్రతి రోజూ ఒక క్రొత్త సూక్తిని – విద్యార్థులచే 5,6 సార్లు చెప్పించటం. ఆ రోజు సూక్తిని (ఒక్క లైను ) మాత్రం – క్లాస్ రూం బోర్డు మీద వ్రాసి – స్కూలు డైరీ వెనక వ్రాసుకోమని చెప్పి, బట్టీ పట్టమని హోంవర్కు గా యివ్వటం ! వెంటనే తాత్పర్యాన్ని ఒకసారి వివరించటం, లేదా ఈ పుస్తకంలోంచి చదివి వినిపిస్తూ తెలియజెప్పటం. అంతే – **5 నిమిషాలు చాలు !** ( తెలుగు చదవలేని పిల్లలకైతే – సూక్తిని మాత్రం నోటికి వచ్చేటట్లు చెప్ప వచ్చును ! ) ఏ

శుక్రవారమో శనివారమో, ఆ వారంలో చెప్పిన నాలుగయిదు సూక్తులు కంఠస్థం గట్టి చేయిస్తే చాలు ! నెలకు ఒకసారి మనం అడిగిన కొన్ని సూక్తులకు భావం – పిల్లలతో వారి మాతృభాషలో చెప్పిస్తూ, మధ్యలో అందిస్తూంటే, భావమూ గట్టి పడుతూ ఉంటుంది; పిల్లల భావ ప్రకటనా నైపుణ్యాలూ మెరుగు పడతాయి !

ఇట్లా చేస్తే, ఒక ఏడాదిలోనే – ముఖ్యమైన అంశాలలో – గట్టి పునాది ఏర్పడటం ఖాయం ! ఆ తరువాత, పిల్లల నైతిక స్థాయిలో – గణనీయమైన పెరుగుదల వచ్చే అవకాశాలు ఎంతో మెరుగు పడతాయి ! ఇట్లా 4 నుంచి 8వ తరగతి వరకు ( పంచ వర్ష ప్రణాళికతో ) ' రోజుకో సూక్తి 'ని నేర్పిస్తే, వాటి భావం తెలిసేటట్లు చేస్తే – ఆ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సమాజము, దేశము కూడ – మీ నిర్మాణాత్మక కృషికి కృతజ్ఞులై ఉంటారు !

**(2) ఇంగ్లీషు మీడియం :**

ఒక శాస్త్రం ఏ భాషలో పుట్టిందో, ఏ భాషలో విస్తృతంగా అభివృద్ధి చెందిందో, ఆ శాస్త్రాన్ని ఆధ్యయనం చేయటానికి – ఆ భాషా మాధ్యమమే అత్యుత్తమం గదా ! ఈ సూత్రం ఆధారంగా, ( **Modern Subjects like Mathematics, Science and Technology** ) వంటి ఆధునిక ఔద్యోగిక చదువుల కోసం కావలసిన సబ్జెక్టులన్నీ, ఇంగ్లీషులోనే చదువుకోవటం అత్యవసరమే !

కాని, ఇతర భాషలను నేర్చుకోవటంలో– ఇంగ్లీషు అంత అవసరమా, అవరోధమా? ఉదా: హిందీకి ఇంగ్లీషులోను, సంస్కృతానికి హిందీలోను అర్థాలు ఇవ్వటం వల్ల, మనవారికి తెలుగుతో పరిచయం ఇంకా తగ్గిపోతోంది. అన్ని భాషా పుస్తకాలలోనూ కూడ, మాతృభాషలో అర్థాలను యివ్వటం అనేది కనీస కర్తవ్యం ! పిల్లలకు లిపి చదవటం రాకపోయినా గాని, కనీసం వినిపించవచ్చు గదా !

కొన్ని స్కూళ్ళలో – స్కూలు ఆవరణలో పలకరింపులకు కూడ ఇంగ్లీషు తప్ప ఇంకేమీ వాడకూడదనే ఆంక్షలవల్ల – పిల్లలు స్వీయ సంస్కృతికి దూరం అవటమే జరుగుతోంది! మన సమాజంలో – ఎంతమంది ఇంగ్లీషువారితో వ్యవహరించాల్సిన అవసరం వస్తుందనే దృష్టితో – మనం (**English Culture**) ని అందించటం అనే ఈ విధానం పాటిస్తున్నాం ?!

కనీసం భాషా విషయాలు, సాంస్కృతిక విషయాలు, సామాజిక విషయాలలో నయినా, భావం వివరించటానికి మాతృభాషను వినియోగిస్తే, వారి అవగాహనా

స్థాయి బాగా పెరుగుతుంది గదా ! ఉదా: ఒక ఇంగ్లీషు మీడియం స్కూల్లో – ' ఆరోగ్యానికై ఆహారం – ఆయుర్వేద పద్ధతి ' అనే విషయంపై వక్తృత్వ పోటీలు (**Elocution Contest or Paper Presentation** ) జరుగుతున్నాయనుకుందాము ! శ్రోతలుగా బడి పిల్లలే గాక, పేరెంట్సో, తాతా–మామ్మలో కూడా వచ్చారనుకుందాము ! సాధారణంగా అది ఇంగ్లీషు మీడియం స్కూలు కాబట్టి, ఈ విషయం ఇంగ్లీషులోనే మాట్లాడమంటారు ! ఇంగ్లీషులో మాట్లాడుతుంటే, స్కూలు పిల్లలలోనే 80 శాతం మంది శ్రద్ధగా వినరు ! కాని, విషయ ప్రయోజనాన్ని దృష్టిలోనుంచుకుని ఏ స్కూలైనా – తెలుగులో వక్తృత్వ పోటీలు నిర్వహిస్తే – ఎంత ఎక్కువ మందికి ఎంత అవగాహన పెరుగుతుంది ! సమాజానికి ఎంత ఎక్కువ లాభం!

ఈ విషయంలోని లాభాలాభాలు గ్రహించే శక్తి మీకే ఎక్కువ ! కాబట్టి – ఇంగ్లీషు మీడియం గరిష్ఠ పరిధి ఎంతవరకు, మాతృభాషతో కనీస అనుబంధం ఎంతవరకు ఉంటే, పిల్లలకు అత్యధిక ప్రయోజనం కలుగుతుంది – అనే విషయంపై స్పష్టమైన దృక్పథం లేని పేరెంట్సుకి అవగాహన కలిగించవలసిన బాధ్యత కూడ మీ భుజస్కంధాలపైనే ఉన్నది ! పిల్లల మేలుకోసం, మీరు మంచిదనుకున్న విధానాన్ని, తల్లిదండ్రులను ఒప్పించి మరీ చేయటానికి గట్టి ప్రయత్నం చేయటం అవసరం కదా !

**(3) పిల్లల మీద భారం తగ్గించటం :**

స్కూలు బ్యాగులోని నోట్సుల బరువు తగ్గించటం మీ చేతులలోనే ఉన్నది. రఫ్ నోట్సు బుక్ లో వ్రాసుకుని, ఇంట్లో విడి విడి నోట్సులలోకి ఎక్కించుకునే అవకాశం – పేరెంట్సు కోరికపై – అనుమతించటం ! ఇంకా మీకు తోచిన ఇతర విధాల కూడా సహాయపడ వచ్చును !

ప్రాజెక్టుల పని – పిల్లల సమయం మీద పెను భారం మోపుతోంది ! (**Basic Skills** ) ని పెంచే అతి కొద్ది ప్రాజెక్టులు మాత్రం చాలు ! విషయ సేకరణకు ప్రాధాన్యం ఉన్న ప్రాజెక్టులు ( **Data Collection** ) ఇప్పుడే అంత అవసరం లేదు! ఎప్పుడు పడితే అప్పుడే తాజా విషయాన్ని ( **Latest Information** ) ని సేకరించుకోగలిగిన సౌకర్యాలు ఈ రోజులలో ఉన్నాయి గదా !

**(4) సాంస్కృతిక చిహ్నాల ధారణకు అనుమతించటం :**

పిల్లలకు - తమ తమ స్వధర్మానుసారంగా - కట్టు బొట్టు మొ. అనుమతించటం, ప్రోత్సహించటం ! ఇది వారిలో తమ సంప్రదాయం పట్ల ఆత్మగౌరవాన్ని పెంచుతుంది! భిన్నత్వంలో ఏకత్వ దర్శనానికి ఉపయోగ పడుతుంది ! **The follower of ANY Religion contributes MUCH MORE to SOCIAL HARMONY, than an Irreligious Person !**

' స్వార్థరతుడౌ మతరహితు కన్న -

స్వమతమును పాటించు విమతస్థుడైన మేలు ! '

అన్న భావాన్ని వ్యాప్తి చేయటమే ముఖ్యం ! ఉదా: ఆడ పిల్లలకు, గాజుల ధ్వనులవల్ల ఇబ్బంది ( **Disturbance** ) కలుతుందని భావిస్తే, చప్పుడు చేయని రకపు గాజు ఒక్కొక్కటి వేసుకోవటానికి అనుమతించ వచ్చు గదా !

**(5) భారతదేశ భవిష్య ముఖచిత్ర సౌందర్యం మీ చేతులలోనే !**

వర్తమాన భారతంలో, ఏ రంగంలో చూసినా - స్వార్థపరత్వమే, విలువల పతనమే - సమాజ వృక్షానికి వేరుపురుగు లాగా పట్టింది ! దీనికి కారణం - ఇంతవరకు విద్యాభ్యాసంలో - నైతిక, సాంస్కృతిక విలువలకు తగిన ప్రాధాన్యం ఈయక పోవటమే ! మీ చొరవ వలన, ఇప్పుడైనా ప్రారంభిస్తే, రాబోయే తరంలో నైతికత, ఆత్మగౌరవం కలిగిన వ్యక్తులతో అన్ని రంగాలూ నిండిపోతే - భారతదేశ ప్రతిష్ఠకు పూర్వ వైభవం మళ్ళీ వచ్చి తీరుతుంది !

ఈ విధంగా, మాతృదేశ ఋణం కొంతైనా తీర్చుకునే అవకాశం - విద్యారంగం లోని మనబోటి వారికి - అధికంగా లభిస్తుంది ! దేశానికి, పిల్లల భవిష్యత్తుకు ఇంత గొప్ప ప్రయోజనకరమైన, ముఖ్యమైన చిన్న పనిని చేయటానికి - విద్యాలయాలు, ఉపాధ్యాయులు ముందుకి వస్తారని ఆశిస్తున్నాం !

**( The main idea is to EMPOWER all the Teachers, ( not only Telugu / Language Teachers ) to be able to clarify with confidence, the numerous DOUBTS of Children, in matters of Culture, Religion, God, Good Character and Conduct, etc.)**

**ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రాథమికవిద్యా శాఖ, తెలుగు భాషాభివృద్ధి శాఖ, మొ.సంబంధిత శాఖల – అధిపతులకు, అధికారులకు – విన్నపం !**

తెలుగు కుటుంబాలలోని విద్యార్థుల సర్వాంగీణ వికాసానికీ, వారి శోభను పెంచటానికీ – క్షేత్రస్థాయిలో వారి క్షోభను తగ్గించటానికీ – ప్రభుత్వపరంగా తీసుకొన దగిన ప్రాథమిక చర్యలను – మంచి ఫలితాలిస్తాయని మాకు నమ్మకం ఉన్నవాటిని – సూచిస్తున్నాము ! దయతో పరిశీలించ మనవి !

**(1) పుస్తకాల బరువు తగ్గించటం :**

ప్రతి సబ్జెక్టులోని పాఠ్యపుస్తకాలను 2 భాగాలుగా ముద్రించటం – (**Half- Yearly Syllabus** ) వరకు ఒక వాల్యూమ్, తరవాత రెండవ వాల్యూమ్ ! ఈ ఒక్క చర్య వల్ల, సంవత్సరంలో ఎప్పుడు చూసినా, టెక్టు బుక్సు బరువులో సగం మాత్రమే పిల్లలు మోయవలసి ఉంటుంది !

**(2) సిలబస్ బరువు తగ్గించటం :**

ప్రస్తుత సిలబస్‌ని తగ్గించవలసిన అవసరం చాలా ఉంది. చదువులో ( **Quality of Study** ) పెరగాలంటే, ( **Quantity and Load** ) తగ్గించాలి ! బట్టీ పట్టే అవసరం తగ్గించాలి; ఆలోచించేందుకు ఎక్కువ సమయం ఇవ్వాలి ! సైన్సు లాంటి సబ్జెక్టులలో విషయాన్ని తగ్గించలేము. కాని, భాషల విషయానికి వస్తే – వాటిద్వారా ఎక్కువ చారిత్రక (**Historical, General Knowledge**) విషయాలను అందించటం కంటె – భాషా నైపుణ్యాలను పెంచేవి, సాంస్కృతిక నైతిక విలువల్ని (**Grammatical, Cultural, Character-building** ) పెంచేవి ఎక్కువగా ఇస్తూంటే – భారం తక్కువ, ప్రయోజనం ఎక్కువ గదా !

**(3) ప్రథమ భాషగా తెలుగును తప్పనిసరి చేయటం:**

తెలుగు మాతృభాషగా కలిగినవారందరికీ, 8వ తరగతి వరకు, తెలుగును ప్రథమ భాషగా తప్పనిసరి చేయటం ! తెలుగు మాతృభాష కానివారికి, వారి మాతృభాషను చదువుకునే అవకాశం యివ్వటం ! పాఠ్య వాచకాలు మొ., వారి భాషా రాష్ట్రాలనుంచి తెప్పించుకునే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు వారు చేసుకోవచ్చు; లేదా, వారికి హిందీని అనుమతించటం. పరీక్షా ప్రశ్న పత్రాలు మాత్రం, ఆయా భాషలు తెలిసిన ప్రభుత్వోద్యోగులచే ఇప్పించవచ్చు. ఈ పద్ధతి 8వ తరగతి వరకే కాబట్టి, ఇక్కడ

ప్రమాణాలకంటే – మాతృభాషతో పరిచయం పెరగటమే ముఖ్యం ! దీనితో ప్రతి వారికీ తమ మాతృభాషలో గట్టి పునాది ఏర్పడుతుంది ! ఆ తరువాత, 9, 10 తరగతులలో మాత్రం – తెలుగువారికైనా కూడ – ప్రథమ భాషగా ఏ భారతీయ భాష అయినా పరవాలేదు, వారి వారి యిష్టం ! అన్ని భాషా పుస్తకాలలోనూ – అర్థాలను మాతృభాషలో కూడ ముద్రించటం అనేది కనీస కర్తవ్యం !

ఎందుకంటే – ఆంధ్రప్రదేశ్ రాజధాని అయిన హైదరాబాదులోని స్కూళ్ళలోనే – తెలుగు మాతృభాషగా కలిగినవారు కూడ – **Optional** గా, తెలుగుకు బదులుగా హిందీని తీసుకుంటున్న సందర్భాలే ఎక్కువ ! అట్టి విద్యార్థులు తెలుగు వ్రాయలేరు, చదవలేరు ! చదివి వినిపించైనా గాని, అట్లాంటి వారికి అవగాహనను పెంచాలి. కనీసం 8వ తరగతి వరకైనా – తెలుగు మాతృభాషగా కలిగినవారికైనా, తెలుగును తప్పనిసరి భాషగా చేయకపోతే – ఇక తెలుగు జాతి ప్రభుత్వానికి అర్థం ఏముంటుంది?!

**(4) ద్వంద్వ మాధ్యమ విధానం :**

భాషా విషయాలు, సాంస్కృతిక విషయాలు, సామాజిక విషయాలు – ఇవి భావ ప్రధానాలు ! **Technical Terminalogy** తో పని అంతగా ఉండదు! కాబట్టి, ఈ మూడు రకాల విషయాలలోనయినా, మాతృభాషను మాధ్యమంగా వినియోగిస్తే, వారి అవగాహన పెరగటం ద్వారా – వ్యక్తిత్వ వికాసానికి, సహజ ప్రవర్తనకి దోహదం చేసినట్లు అవుతుంది గదా ! కాబట్టి, సైన్సు, టెక్నికల్ సబ్జెక్టులలో ఇంగ్లీషు మీడియం తప్పనిసరి గాను – మానవీయ శాస్త్రాలలో ( **Languages and Arts and Humanities Subjects** ) మాతృభాషను మాధ్యమంగా (**Medium**) గాను – ఎంచుకునే అవకాశం కలిగించటం ఆలోచించదగిన ప్రతిపాదన! మార్కు లిస్టులలో ఆయా సబ్జెక్టుల కెదురుగా మీడియమును కూడ పేర్కొనవచ్చును.

ఈ ద్వంద్వ మాధ్యమ పద్ధతి ( **Dual Medium System** ) ని పాటిస్తే, ఎన్ని లక్షలమంది విద్యార్థులకు – **Standard** ఎంత పెరుగుతుంది ! ఎంత మానసిక శ్రమ, ఒత్తిడి తగ్గుతుంది ! ఎంత ఆనందకరం !

**(5) సర్వమత సామరస్య భావన, నైతికతా స్థాయి పెంపొందించటం :**

మన దేశ సౌభాగ్యానికి కావలసినవి – సర్వమత సామరస్య దృష్టి , శాంతియుత సహజీవన దృక్పథం ! అందువల్ల, ఈ అహింసాది ఉదార భావాలను నేర్పే వచనాలను,

అన్ని మతాల ప్రమాణ గ్రంథాలనుంచి సేకరించి, **Source Reference** తో సహా, పాఠ్యగ్రంథాలలో నిక్షిప్తం చేయటం వల్ల, అన్ని మతాలూ దాదాపు ఒకే విధమైన నీతి సూత్రాలను బోధిస్తున్నాయనే సత్యం పిల్లలకు హృదయంగమం అవుతుంది గదా !

**Secular** అంటే నిఘంటు అర్థం – **Not Religious or Spiritual** అని ఉంది. కాని, ప్రతి మతగ్రంథం ( **Religious Text** ) లోను, ఈ రెండే కాక – నైతిక, సామాజిక ప్రవర్తనా విధి నిషేధాలు, త్యాగం, దానం, దయ, సేవ వంటి ఎన్నో సుగుణాలు – చెప్పబడి ఉంటాయి. ఒక్కో నీతి విషయమై ఏ మతం వారు ఏం చెప్పారు అని, వారి వారి సాంప్రదాయిక కథలను, సూక్తులను – పాఠ్యాంశాలలో ప్రక్క ప్రక్కన ఒక దగ్గర చేరిస్తే, అందరికీ అన్నీ తెలుస్తాయి ! ఆ భావం రూఢి అవుతుంది ! ఎవరికీ అభ్యంతరం ఉండదు గదా !

అవునన్నా, కాదన్నా – అత్యధిక సంఖ్యాకులు తమ తమ మతాల ఆదేశాల పట్ల భక్తి కలిగి ఉంటారు. ఏ మతాన్నీ పాటించనివారిలో అత్యధిక సంఖ్యాకులు – సమాజ హితాన్నీ పట్టించుకునే అవకాశాలు తక్కువే ! కాబట్టి, భిన్న భిన్నములుగా కనిపించే – దైవారాధనా పద్ధతులు, లోకాతీత విషయాలను మాత్రం ఆయా మత బోధకులకే వదిలిపెట్టి – ప్రాకృతిక, మానవీయ అంశాలను గూర్చిన మతగ్రంథ సూక్తులను – ప్రముఖంగా సిలబస్‌లో చేర్చటం వల్ల, ఎంతో సత్ప్రయోజనం కలుగుతుంది గదా!

**(6) సూక్తులు, సుభాషితాలు, పద్యాలు, నీతికథలు :**

ఒక్కో తరగతిలో ప్రస్తుతం ఇస్తున్న అయిదారు సుభాషిత పద్యాలు యాదృచ్ఛిక ( **Random, Haphazard, Half-hearted and Inadequate** ) సూక్తులుగానే ఉంటున్నాయి ! పిల్లలకు నేర్పదగిన సాంస్కృతిక, నైతిక, శీలనిర్మాణయోగ్యమైన సూక్తులన్నిటినీ ప్రాధాన్యతా క్రమంలో ఒక పట్టిక తయారు చేసుకుని, అ మొత్తం విషయం ( **Content** ) ను – 5 విభాగాలుగా చేసి, ఏడాదికొక భాగం చొప్పున అయిదు సంవత్సరాలలో, (4వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ) ( **Five Year Plan** ) అన్ని భాషా పాఠములలోను చేరిస్తే–ప్రభుత్వపరంగా, క్రొత్త తరం యువతకు స్వీయ సంస్కృతిని నేర్పటమనే – పవిత్ర బాధ్యతను నిర్వర్తించినట్లవుతుంది గదా !

**(7) సాంస్కృతిక ఉప వాచకము :**

పై విషయాలన్నిటినీ సిలబస్‌లో చేర్చటం కష్టం అనుకుంటే – పై విధమైన సాంస్కృతిక,

నైతిక విషయాలను, తెలుగుభాషలో ' సాంస్కృతిక ఉప వాచకం'గా ప్రవేశ పెట్టటం సాధ్యమేగదా ! ఇట్లా, ఉపవాచకం లాంటిది ప్రవేశ పెడితే గనుక, ఇతర సిలబస్ బరువు తగ్గించటం కూడ ఇంకా ప్రయోజనకరం !

దీనికై ఈ పుస్తకం ప్రథమ సోపానంగా పనికి వస్తుందేమో గూడా పరిశీలించ మనవి ! ఈ పుస్తకంలోని అంశాలలో – మత సామరస్యానికి భంగకరమైన అంశం, విభిన్న వర్గాల మధ్య శాంతియుత సహజీవనానికి విఘాతకరమైన అంశం – ఒక్కటి కూడా లేదు ! అన్నీ విశాల, ఉదార భావాలను నేర్పేవే ! కాబట్టి, ఈ పుస్తకం – ప్రభుత్వంతో సహా, అందరికీ – ఆమోదయోగ్యం అవుతుందని ఆశిస్తున్నాం !

**(8) ప్రసార మాధ్యమాలలో తెలుగుభాష వికృతీకరణను నియంత్రించటం:**

ఇతర భాషా చిత్రాలు, సీరియళ్ళు మొ వాటిని తెలుగులోకి అనువదించి (**Dubbing**) ప్రసారం చేస్తున్న టి.వి.ఛానెళ్ళు ఎన్నో ఉన్నాయి. వాటిలోని తెలుగు ఉచ్చారణ చాలా భ్రష్టంగా ఉంటోంది ! ' బారతదేశం, బగవంతుడు, బక్తి, బయం ' వంటి ఒత్తులు లేని ఉచ్చారణ వింటూంటే – తెలుగుభాషకు జరుగుతూన్న అపచారాన్ని చూస్తూంటే – గుండె తరుక్కు పోతుంది ! తెలుగును సరిగా పలకటంలో శిక్షణ అయినా తీసుకోమనాలి; లేదా అట్లా సరిగా ఉచ్చరించ గలిగినవారినైనా నియమించుకోమనాలి ! మన భాష పట్ల మనకున్న నిబద్ధతను చాటుకోవటానికైనా, ఇట్టి ప్రసార మాధ్యమ సంస్థలకు ఆదేశాలో, మార్గదర్శక సూచనలో యివ్వగలమేమో ఎందుకు చూడ కూడదు ?! గమనిక, నియంత్రణ ఉన్నాయని తెలిస్తే – ఆ పరిస్థితే వేరు గదా ! పొరుగున ఉన్న రాష్ట్రాలలోని భాషాభిమానం మనకు ఆదర్శం కావాలి!

**(9) తెలుగువారు తెలుగును అలక్ష్యం చేస్తుంటే, సరిదిద్దటం :**

సరియైన అవగాహన లేకపోవటంవల్ల ఎక్కువ మంది ప్రజలు ఇష్టం చూపించలేక పోతున్నాసరే – ప్రజాహితం కోసం, భవిష్యత్ తరాల తెలుగుజాతి నిర్మాణం కోసం – వారి అవగాహనా స్థాయిని పెంచుతూ, కొన్ని బాధ్యతలను ప్రభుత్వం చేపట్టటం భావ్యమే గదా !

తెలుగు జాతి యొక్క ప్రతిభ, ప్రతిష్ఠ, గౌరవాలను ఇనుమడింప జేసే పవిత్ర బాధ్యత, శక్తియుక్తులు – మన ప్రభుత్వం కంటే ఎక్కువగా ఇంకెవరికి ఉంటాయి ?!

**బాల బాలికల దినచర్యా గేయం :**

**(1) ఇంటి వద్ద దినచర్య :**

సూర్యోదయానికి ముందుగనే – నిద్దుర నుండీ లేచెదను !
ఉదక పానమూ చేసెదను – కాలకృత్యాలు తీర్చెదను !

యోగాసనములు వేసెదను – స్నానం ధ్యానం చేసెదను !
దేవుని ప్రార్థన చేసెదను – తెలుగూ సంస్కృతం చదివెదను !

బ్యాగును ముందే సర్దుకొనెదను – చల్ది యన్నమే తినియెదను !
యూనిఫాం నీటుగ వేసెదను – వేళకు బడికీ వెళ్ళెదను !

బడి నుండి యింటికే వచ్చెదను – చక్కగ తయారు అయ్యెదను !
అల్పాహారం చేసెదను – హోంవర్కును చేసెదను !

నేనూ మిత్రులు కలిసెదము – సూర్యరశ్మిలో ఆడెదము !
సంధ్యా ప్రార్థన చేసెదను – నోట్సులు చక్కగ వ్రాసెదను !

భోజనం అందరం చేసెదము – టెక్స్టులు బాగా చదివెదను !
బట్టీ పట్టుట మానెదను – అర్థమగునట్లు చదివెదను !

చదువులొ విరామం కోసమే – టి.వి., నెట్టూ చూసెదను !
పదికి నిద్ర పోయెదను – ఐదుకి నిద్ర లేచెదను !

నూనె నలుగుతొ తలంటి స్నానం – వారం వారం చేసెదను !
ఆయుర్వేదం చెప్పిన మాదిరి – ఆరోగ్య రక్షణ చేసుకొనెదను !

**బాల బాలికల దినచర్యా గేయం :**

**(2) బడి వద్ద దినచర్య :**

స్కూలుకు వేళకు వెళ్ళెదను - శ్రద్ధగ ప్రేయరు చేసెదను !
'ఈ రోజు సూక్తి'ని చదివెదను - దాని భావమును వినియెదను !

టీచరు వంకనె చూసెదను - టీచరు మాటలె వినియెదను !
అర్థం కానివి అడిగెదను - ప్రశ్నకు జవాబు చెప్పెదను !

ప్రక్క పిల్లలతొ ఆటలు మాటలు - క్లాసు టైములో మానెదను !
ముఖ్యమైన పాయింట్లన్నిటినీ - నా నోట్సులొ నేనే వ్రాసుకొనెదను !

పరీక్షలందు జవాబులు - స్వంతముగానే వ్రాసెదను !
సబ్జెక్టు లన్నిటి యందు - ఆల్ కరక్టే నా లక్ష్యం !

చేతులు బాగా కడిగెదము - ఎవరి లంచ్ వారే తినియెదము !
అదియే సంపూర్ణారోగ్యానికి - నమ్మకమైన మంచి మార్గము !

ఆటల పాటల పోటీల్లో - ఆసక్తిగ నే పాల్గొంటాను !
గెలుపోటములు ముఖ్యం కాదు-స్పోర్ట్సుమన్ స్పిరిటే ముఖ్యం నాకు !

మాటల రాతల పోటీల్లో - అన్నిటికీ నే ముందుంటా !
అంతర స్కూళ్ళ పోటీల్లో - చురుకుగ నేను పాల్గొంటా !

గ్రంథాలయమును సందర్శిస్తా - మంచి పుస్తకాలు చదివేస్తా !
పెద్దల మాటలు పాటిస్తా - మంచి పేరును గడియిస్తా !

మా బడియే మా దేవాలయం - భారత సంస్కృతి మందిరం !
భారత సంస్కృతి వారసులం - అందుకు ఎంతో గర్విద్దాం !

**బాల బాలికల దృక్పథం :**

పెద్దల మాటలు వినటం – ఒక్కటె చాలును క్షేమం !
ఊరకె వినటం చాలదు – ఆచరించుటే ముఖ్యము !
ఇష్టమైనా కష్టమైనా – మంచి యన్నదె ఆచరించెద !

వివాహితలైన మహిళలందరూ – నా కన్నతల్లితో సమానలే !
జ్ఞానదాయక గురువులందరూ – నా కన్నతండ్రితో సమానులే !

కరెంటు, పెట్రోలు, డబ్బు, సమయం–తిండి వస్తువులు, మంచినీరు
స్టడీ మెటీరియల్సు ఏవైనా గాని – వీటిలో వేటిని వృథా చేయను !

ధనమూ, పదవీ అన్నిటికన్నా – ఆత్మాభిమానం చాలా గొప్పది !
ధనమూ పరువూ పోనున్నా – ధర్మ మార్గమును తప్పను నేను !

ఆహారం ఆరోగ్యం విద్య వైద్యం – సేవలే కాని వ్యాపారం కావు !
విదేశీయ, వ్యాపార విష వాయువులు – సోకనట్లుగా జాగ్రత పడతా !

బీదసాదల సుఖజీవనమే – ప్రభుత్వాల ప్రప్రథమ కర్తవ్యం !
భారత ప్రభుత్వపు ప్రజాధనాన్ని – ధర్మకర్త వలె వినియోగిస్తా !

ప్రభుత్వమిచ్చే ప్రయోజనాలను – ప్రజలకు చేర్చుట నా కర్తవ్యం !
ఈ కర్తవ్యమును పాలించుటలో – స్వలాభాపేక్ష చూపను నేను !

న్యాయ స్ఫూర్తిని పాటిస్తాను – చట్టపు లొసుగులు వాడను నేను !
ఎంతటి ప్రలోభాలు ఎదురైనా – కర్తవ్య భంగం చేయను నేను !

భారతీయ సంస్కృతీ భావజాలానికి – వేద, పురాణాలే పట్టుగొమ్మలు !
భౌతిక సుఖ సాధనముల కన్న – ఆధ్యాత్మిక సంపదయే మిన్న !

❀ ❀ ❀ ❀ ❀

## భారతీయతా ప్రతిజ్ఞ :

నా తల్లిదండ్రుల యాన ! ఇష్ట దైవము ఆన !
భారత దేశము నా మాతృభూమి ! భారతీయులే నా సహోదరులు !

మొట్ట మొదట నే భారత వ్యక్తిని ! తరువాతే నా మతపు మనిషిని !
కుల,మత భాషా,సంప్రదాయములు - ఇవి యన్నీ ఉప అంశములే !

నా మతపు పేరులో ముందుగనే - భారత నామము చేర్చెదను !
భారత-ముస్లిం, భారత-క్రైస్తవ, భారత-బౌద్ధ, భారత-హిందూ !

ఇన్ని రకాల జనుల పూర్వులూ - మహర్షుల జాతికి చెందిన వారే !
ఆదికవి రామాయణ కర్త - వాల్మీకి, విశ్వామిత్రులె గుర్తు !

చరిత్ర సంస్కృతి మూలాలు - మనకందరికీ ఒకటే గనుక -
భారత వృక్షపు బహు శాఖలలో - మన మతమూ ఒక ముఖ్య శాఖయే !

మామిడి చెట్టు అన్ని అంగముల - మామిడితనమే నిండియుండును !
మన దేశంలోని మతములన్నిటను - భారతీయతే నిండ వలె గదా !

'స్వధర్మమందే ఉండుట శ్రేయం' - అని చాటునది మన ఒక్క సంస్కృతియె!
భారత జాతీయుల కంటె - పరమత సహనం ఎవరికి ఎక్కువ ?

భారతీయులే పొరుగున ఉండగ - ఎవరికి మాత్రం ఎందుకు భయము ?
అభద్రతా భావం లేకుంటే - సహజీవన శాంతికి భంగ మెక్కడ ?

దేశ ప్రతిష్ఠకు ప్రయోజనాలకు – ఎట్టి భంగమూ కలిగించను నేను !
కలిగించు శక్తుల కట్టడికై – శాయశక్తులా నే కృషి చేస్తా !

దేశమాతను, సోదర ప్రజలను – యథాశక్తి నే సేవించెదను !
సింహం లాగా బ్రతికెద గాక ! ఎట్టి గడ్డినీ కరవను నేను !

ప్రకృతిలోని సంపద అంతా – నే సృష్టించినది కానే కాదు !
దేవుడు చేసిన సంపదకు – ధర్మకర్తగా నేనుంటా !

విదేశాలలో ఆర్జించినను – స్వదేశమునకే తెచ్చెదను !
సోదర ప్రజల స్థితి గతులు – బాగా మెరుగు పడే లాగ !

షష్టిపూర్తి వయసవగానే – మాతృభూమికే వచ్చెదను !
భారతదేశపు పౌరసత్వాన్ని – వారసులకు నే కొనసాగించెదను !

అయోమయంపు వార్తల గూర్చి – అవగాహన జనులకు పెంచెదను !
అపురూపమైన మన సంస్కృతినీ – భావి తరాలకు పంచెదను !

పునర్జన్మ లేకుండాలనియే – దేవుని నేను ప్రార్థించెదను !
మళ్ళీ జన్మంటూ ఉంటే – భారతీయుడుగనె పుట్టెదను !

నిత్యం దీపారాధన వలెనే – సూక్తి రత్నమును తలచెదము !
వారం వారం ప్రతినలు చదివీ – పునరంకితము అయ్యెదము !

**భారత సంస్కృతి వారసులం – అందుకు యెంతో గర్విద్దాం !**
**భారతమాతే మనలను చూసి – గర్వపడేలా జీవిద్దాం !**

## తెలుగు వారి ప్రతిజ్ఞ :

పనస తొనల కన్న పంచదారల కన్న
జుంటి తేనె కన్న జున్ను కన్న
చెరకు రసము కన్న మన తెలుగు తీపిరా
విశ్వదాభిరామ వినుర వేమ !

నేను పుట్టినది తెలుగు జాతిలో – తెలుగు పలుకులను ఆస్వాదించెద !
నా మాతృభాషా మాధుర్యం – నాకు గాక ఇంకెవరికి స్వంతం !

మా తాత ముత్తాత పలికినదీ – తేనె లొలికే తెలుగు పలుకులే !
వాడుచుండెదను ప్రతిచోటా – గర్వముగా నా మాతృభాషనే !

తెలుగు అర్థమగు వారందరితో – తెలుగులోనె మాట్లాడెదను !
తెలుగు సంగీత సాహిత్యాలను – ప్రతిరోజూ వినుచుండెదము !

తెలుగు లిపిలో వ్రాయుట చదువుట – తెలుగు వ్యక్తిగా నా కర్తవ్యం !
వేమనాది శతకాల పద్యములు – కంఠస్థము చేసెద కొన్నైనా !

మంచి కథలూ మంచి నవలలూ – వారం వారం చదివెదను !
ఆత్మీయులకూ నా భావజాలమును – లేఖల ద్వారా పంచెదను !

పుట్టినరోజు పండగను – సంప్రదాయముగ జరిపెదము !
మన కట్టూ బొట్టూ సంబరాలను – కుటుంబాలలో పాటించెదము !

నా మాతృభాషా మాధుర్యమును – పంచేంద్రియములా గ్రోలెదను !
నా తెలుగుతల్లికి నే సేవ జేయుట – నా ఋణభారము తీర్చుట కొరకే !

## వేమన సూక్తి సుధ (కంఠస్థ యోగ్యం)

**తల్లిదండ్రులు**

(1) తల్లి గౌరి తనకు   తండ్రియే శంభుండు !

**విశ్వం**

(2) విశ్వమును నడిపెడి   విశ్వేశ్వరుండు !

**పూర్వీకులు**

(3) దగ్ధులైన వారు   తమకంటె తక్కువా ?!

**పెద్దలు**

(4) పెద్ద ' లుసురు ' మంటె   పెనుమంట లెగయవా ?!

**గురువు**

(5) గురువు లేక విద్య   గురుతుగా దొరకదు !

(6) మంచి చెడ్డ జెప్పు   గురువులె గురువులు !

**ఏకత్వం**

(7) పసుల వన్నె వేరు   పాలేక వర్ణమౌ !

(8) అరయ తిండ్లు వేరు   యాకలి యొక్కటి !

(9) పని తొడవులు వేరు   బంగార మొక్కటి !

(10) పరమ ఋషులు వేరు   భావ్యుండు యొక్కడు !

(11) దర్శనంబు వేరు   దైవంబు యొక్కటి !

(12) ఘటము లెన్ని యైన   గగనంబు యేకమే !

(13) భాష లింతె వేరు   పరతత్త్వ మొక్కటి !

**ధర్మం**

(14) తనువు లస్థిరములు   ధర్మంబు నిత్యము !

(15) ఇహము నందు బాధ   లెన్నైన బడవచ్చు –

(16) పరము బాధ లేక   బ్రతుకుడీ నరులార !

(17) చిత్తశుద్ధి గల్గి   చేసిన పుణ్యంబు –

(18) కొంచెమైన నదియు   కొదువ గాదు !

(19) ధనము యెవరి సొమ్ము ధర్మమే తన సొమ్ము !

**ధనం**

(20) కలిమి లేమి రెండు గల వెంత వారికి !

(21) సాగి పారని తరి సమకూడ దొక్కటి -

(22) ధనము యెంత యున్న ధరను వేమ !

(23) ఎంత సంపదొనరు నంత కష్టపు చింత !

(24) అప్పు లేని వాడె యధిక బలుడు !

(25) పరుల మోసపుచ్చి ధర ధన మార్జించి -

(26) కడుపు నింపుకొనుట కాని పద్దు !

(27) ధనము లెచటి కేగు దా నేగు నెచటికి ?

**ధైర్యం**

(28) శివుడు భర్త కర్త చింతింప నేలరా ?

(29) చక్రి భర్త కర్త చింతింప నేలరా ?

(30) కల్ల నిజము రెండు కరకంఠు డెరుగును !

(31) సత్యమాడు వాని సామి యెరుగు !

(32) నిలువైన చిత్తము నిర్భీతి నొందించు !

(33) ఏమి పాట్లు పడుదు రీ దేహమున కిల !

(34) ప్రాప్తము గల చోట ఫలమేల దప్పునో !

(35) కుండ పగిలెనేని కొత్తది కొనవచ్చు !

(36) కడుపు కెట్లయైన గలుగును భుక్తి రా !

(37) పరగ రాతి గుండు పగుల గొట్టగ వచ్చు -

(38) కొండలన్ని పిండి గొట్ట వచ్చు !

(39) ఉల్ల మందు వగవ - కుండుట యోగ్యంబు !

(40) మేలిమిగా బ్రతుక వచ్చు మేదిని వేమా !

**ప్రయత్నం**

(41) చెలగు దివ్వె లేక చీకటి వాయునా ?

(42) చెట్టు బెట్ట ఫలము చేకూర కుండునా ?!
(43) విత్తనంబు మఱ్ఱి వృక్షంబునకు నెంత !
(44) నీరు జొరక లోతు నిజముగా దెలియదు !
(45) తిన్న గాని తీపి తెలియ రాదు !
(46) నీరు పల్ల మెరుగు నిజము గాను !
(47) తామసించి సేయ తగదెట్టి కార్యంబు –
(48) వేగిరింప నదియు విషమ మగును !
(49) మొదల విడిచి గోడ తుది బెట్ట గలుగునా !
(50) పుట్ట మీద గొట్ట భుజగంబు చచ్చునా !
(51) వ్రాత వెంట గాని వర మీడు దైవంబు –
(52) సేత కొలది గాని వ్రాత గాదు –
(53) వ్రాత కజుడు కర్త సేతకు దా కర్త !
(54) ఏమి లేని నరున కే గతి లేదురా !

**సాధన**

(55) కరగ కరగ బుట్టు కనకంబునకు వన్నె !
(56) తరువ తరువ బుట్టు దధిని ఘృతము !
(57) సాధనమున బనులు సమకూరు ధరలోన !

**విలువ**

(58) నిక్కమైన మంచి నీల మొక్కటి చాలు –
(59) తళుకు బెళుకు రాళ్ళు తట్టెడేల ?!
(60) గంగి గోవు పాలు గంటెడైనను చాలు –
(61) కడివెడైన నేమి ఖరము పాలు ?!

**విద్య**

(62) పుష్పమందు తావి పొసగినట్లగు విద్య !

**సజ్జనులు**

(63) కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా ?!

(64) కొండ యద్దమందు కొంచెమై యుండదా ?!

**దుర్జనులు**

(65) ఒప్పు దుర్జనములు తప్పుగ నెంతురు ! (17-18.5 -0)

**జనులు**

(66) ఎట్టి వారు మెత్తు రట్టి వారి !

(67) పదుగు రాడు మాట పాటియై ధర జెల్లు !

(68) కుక్క వంటి యాశ కూర్చుండ నివ్వదు -

(69) తిక్క బట్టి నరుడు తిరుగుచుండు !

(70) దండ సాధ్యులైరి ధర్మ సాధ్యులు గాక !

(71) ఉత్తమ పురుషుండు యొక్కడె జాలడా !

**వివేకం**

(72) చెట్టు ముదరనిచ్చి చిదిమిన బోవునా ?!

(73) వెనుక వంతుననుట వెర్రి తనము !

(74) పాల నీరు క్రమము పరమ హంస యెరుంగు !

(75) భక్తి గలుగు కూడు పట్టెడైనను చాలు !

(76) గుణ యుతునకు మేలు గోరంత జేసిన -

(77) కొండ యౌను వాని గుణము చేత !

(78) నేల నున్న రాయి నెత్తి కెత్తిన యట్లు !

(79) నిజము లాడ రాదు నీచుతోను !

(80) అనువు గాని చోట నధికుల మనరాదు !

(81) బలిమి లేని వేళ పంతంబు సెల్లదు !

(82) నిలువ దగని చోట నిలువ నిందలు వచ్చు !

(83) నెలవు దప్పు చోట నేర్పరి కొర గాడు !

(84) ఎగరవేయు పండు ఎందాక నిల్చురా !

(85) చేతగాని పనుల జేయ రాదు !

(86) సొమ్ము లేని చోట శోధ యేల ?!

(87) భాండ శుద్ధి లేని పాక మేల !

(88) విడువ వలయు నూరు విశ్రాంతి గాకున్న !

(89) కొయ్య దుంగ దెచ్చి చెక్కితే గుణి యవదె ?!

(90) పచ్చి కాయ దెచ్చి పడవేయ ఫలమౌనె ?!

**అవివేకం**

(91) భానుడుండ దివ్వె బట్టి వెదకు రీతి !

(92) వెన్న చేతబట్టి వివరంబు దెలియక –

(93) ఘృతము గోరునట్టి యతని భంగి !

(94) ముక్కు వంక జూచి ముకురంబు దూరుట !

(95) పంట చేను విడిచి పరిగె యేరిన యట్లు !

**సుగుణం**

(96) పరు లెన్నగ బ్రతుకువాడు ప్రాజ్ఞుడు వేమా !

(97) పరుల కుపకరించి ప్రబలు వేమ !

(98) దాన మీని వాడు ధన్యుండు కాడయా !

(99) ఇందు నీని వాని కెందును గలుగదు !

(100) మరువంగా వలదు మేలు మహిలో వేమా !

(101) జ్ఞాన మమరి యుండ సత్య ముండు !

(102) దాన ధర్మములును దయయు సత్యము నీతి !

(103) కులము కన్న మిగుల గుణమె ప్రధానంబు !

**దుర్గుణం**

(104) కానివాని తోటి కలసి వర్తించెనా –

(105) హాని వచ్చు నెంత వాని కైన !

(106) ఇరుగు పొరుగువారి కెనయు సంపద జూచి –

(107) తమకు లేదటన్న ధర్మ మేమి ?!

(108) మచ్చరమే తన్ను జెరుచు మహిలో వేమా !

(109) ఆడి తప్పువార లభిమాన హీనులు !

(110) పరు నిందం జేయువాడు భ్రష్టుడు వేమా !

**మనస్సు**

(111) తన మది కపటము విడచిన -

(112) తన కెవ్వడు కపటి లేడు ధరలో వేమా !

(113) శాంత బుద్ధి నుండ సమకూరు సుఖంబు !

**పురుషులు**

(114) పురుష డబలుడైన బుత్రు లబలులురా !

**స్త్రీలు**

(115) గుణవతి యగు యువతి గృహము చక్కగ నుండు !

(116) ఇక్కడ తగు గాక నక్కడ తగ దిట్లు !

(117) పరమ సాధ్వి చూడ పరుల నంటదు సుమీ !

(118) ఆనుకూల్యము గల యంగన గలిగిన -

(119) సతికి పతికి పరమ సౌఖ్య మమురు !

**మతం**

(120) మతము లెన్ని యైన సతముగా నుండవు -

(121) సతముగాను యుండు జగతి నొకటి !

(122) తమకు భేదమయిన తత్త్వంబు భేదమా !

(123) వాద మేల? దైవ భేద మేల ? !

(124) మొదల తన మతము వదలక -

(125) తుద నెవ్వరి మతమునైన దూషింపకయున్ !

**దైవం**

(126) సర్వ సురల కన్న సర్వేశ్వరుడు మేలు !

(127) దేవుడొక్క డనుచు దెలియ లేరు !

(128) తన్ను దిప్పువాని తానేల కానడో !

(129) తామెందులోన దిరిగిన -

(130) దేవుడు తోడగుచు వచ్చు వెంటనె వేమా !

(131) మంట లోహమందు మాకుల శిలలందు –

(132) పటము గోడలందు ప్రతిమలందు –

(133) తన్ను దెలుసు కొరకు తగలదా పరమాత్మ !

(134) అందు గలుగు దేవు డిందు లేడె –

(135) యిందు నందు గలడు హృదయంబు లెస్సైన !

(136) భక్తి లేని పూజ ఫలము లేదు !

**పరమాత్మ**

(137) మరియు దధిని ఘృతము, మానులం దనలంబు –

(138) చారు సుమము లందు సౌరభంబు –

(139) తిలల తైలమట్ల తేజరిల్లు చిదాత్మ !

(140) వెదుక వెదుక దొరుకు వేదాంత వేద్యుండు !

(141) హృదయ మందు నున్న యీశుని దెలియరో !

(142) సకలాకారు డనంతుడు –

(143) సకలాత్మల యందు సర్వ సాక్షియు దానై !

**మోక్షం**

(144) అఖిల జనుల కెల్ల నానందమే సాక్షి !

(145) దుఃఖ స్పర్శ లేని సుఖమన్న మోక్షమే !

(146) ఆశ విడక గాని పాశ ముక్తుడు గాడు !

(147) నిర్మలునకు గలుగు ముక్తి నిజముగ వేమా !

(148) కప్పురంబు జ్యోతి గలసి నట్లగు ముక్తి !

(149) ఏకత్వంబని యెరిగిన –

(150) శోకములే కల్ల ! ముక్తి సులభము వేమా !

# సూక్తి భావ సుధ

**(1) తల్లి గౌరి తనకు తండ్రియే శంభుండు !**

నా తల్లిదండ్రులు, ఆది దంపతులైన - పార్వతీ పరమేశ్వరుల, లక్ష్మీ నారాయణుల, ప్రకృతి పురుషుల - ప్రతి రూపాలే !

అమ్మా-నాన్నల యందు పూజ్యభావంతో ఉంటే, దేవీ-దేవులను పూజించి నట్లే ! పూజ్యభావంతో ఉండటం అంటే - గౌరవం, భయభక్తులు కలిగి ఉండటము, వారు చెప్పిన మాటలను పాటించటమున్నూ !

**(2) విశ్వమును నడిపెడి విశ్వేశ్వరుండు !**

ఈ విశ్వమును నడుపుతూ, విశ్వేశ్వరుడు ఉన్నాడు !

విశ్వం అంటే - ఈ భూగోళము, సౌర కుటుంబమే కాదు; మొత్తం నక్షత్ర మండలాలు అన్నీ కూడాను. ఇవన్నీ కూడ కోట్ల సంవత్సరాలుగా ఒక క్రమంలో తిరుగుతూ ఉండటం ఎంత ఆశ్చర్యం ! పరమేశ్వరుని మహా శక్తియే వీటిని ఇలా నడిపిస్తోంది !

**(3) దగ్ధులైన వారు తమకంటె తక్కువా ?!**

మరణించిన మన పూర్వీకులు, ఇప్పుడు జీవించియున్న వారికంటె తక్కువ వారు కారు. వారు ధర్మపరులుగా ఉండటం వల్లనే, ఇప్పటివారి కంటె - జీవితాన్ని సర్వాంగ సుందరంగా, శాంతియుతంగా ఆనందించ గలిగారు. కాబట్టి వారు గొప్పవారే !

**(4) పెద్ద లుసురు మంటె పెనుమంట లెగయవా ?!**

పెద్దవారు 'ఉసూరు' మనేటట్లుగా మనం ప్రవర్తిస్తే -అంటే పెద్దవారి మనస్సుకు కష్టం కలిగిస్తే - దాని చెడు ప్రభావం ఇంట్లో అందరిమీదా పడుతుంది !

అమ్మా-నాన్నలు, తాతా-మామ్మలు, ఇంకా ఇతర పెద్దలు - మన మేలు కోరి - ఎన్నెన్నో సలహాలు, సూచనలు ఇస్తూంటారు. వాటిని పాటిస్తే మనకే లాభం. చెప్పిన మాట వింటేనే, పాటిస్తేనే పెద్దలకు ఆనందం ! వినకపోతే బాధ పడ తారు ! పెద్దలకు బాధ కలిగిస్తే, మనకే నష్టం !

### (5) గురువు లేక విద్య  గురుతుగా దొరకదు !

గురువు లేకుండా స్వంతంగానే నేర్చుకోవాలనుకుంటే, ఏ విద్య కూడ సరిగా రాదు.

ఒక తరగతిలో క్రొత్తగా చేరిన విద్యార్థి, పాఠ్య పుస్తకాలను తానే చదువుకుంటే, బాగా అర్థమవుతాయా ? ఆ విద్య ఒంట బడుతుందా ? వాటిని అర్థమయ్యేటట్లుగా వివరించి చెప్పి, సందేహాలను తీర్చే పెద్దలు కావాలి గదా. అట్లా చేసేవారే గురువులు ! ఆ గురువుల అనుగ్రహం ఉంటేనే, చక్కటి విద్య లభిస్తుంది.

### (6) మంచి చెడ్డ జెప్పు  గురువులె గురువులు !

గురువులైన వారు పాఠములలోని అంశములే కాకుండా, విద్యార్థుల యోగక్షేమాలను కూడ కనుక్కుంటూ, మంచీ-చెడ్డా తెలియ చెబుతూ, వారి భవిష్యత్తును తీర్చి దిద్దే ప్రయత్నం చేస్తుంటారు !

### (7) పసుల వన్నె వేరు  పాలేక వర్ణమౌ !

ఆవులు మొ. పశువుల రంగులు వేరు వేరుగా ఉన్నా గానీ, వాటి పాలు మాత్రం ఒకే రంగులో తెల్లగా ఉంటాయి !

### (8) అరయ తిండ్లు వేరు  ఆకలి యొక్కటి !

వేరు వేరు జాతుల జంతువులు తినే ఆహారాలు వేరు వేరు అయినా, లోకం లోని ప్రాణు లన్నిటికీ ఆకలి ( జఠరాగ్ని ) స్వరూపం ఒక్కటే !

### (9) పని తొడవులు వేరు  బంగార మొక్కటి !

నగలు ఎన్ని రకాలైనా, వాటిలో ఉండే బంగారం ఒక్కటే !

ఆడ పిల్లలకు – చెవులు, ముక్కు, కంఠం, చేతులు మొ. వాటికి – అలంకారంగా ఉండే ఆభరణాలు ఎన్నో ఆకారాలతో, ఎన్నో పేర్లతో ఉంటాయి. కాని అవన్నీ ఒకే బంగారంతో తయారవుతాయి. ఉన్న తేడా అంతా – కేవలం వాటి పేర్లూ, ఆకారాల లోనే !

### (10) పరమ ఋషులు వేరు   భావ్యుండు యొక్కడు !

మహర్షులు ఎంతో మంది ఉన్నా గానీ, వారు భావించిన పరమాత్మ ఒక్కడే !

### (11) దర్శనంబు వేరు   దైవంబు యొక్కటి !

ఎందరెందరో మహాత్ములు, మహా ప్రవక్తలు ఆ దైవ తత్త్వాన్ని దర్శించారు. తమ తమ దేశ కాలాలకు అనుగుణంగా, తమ తమ ప్రజల స్థాయిని బట్టి బోధనలు చేశారు. ఆ బోధనలే వివిధ మతాలుగా వ్యాప్తి చెందాయి ! కానీ దైవం మాత్రం ఒకటే !

### (12) ఘటము లెన్ని యైన   గగనంబు యేకమే !

కుండలు ఎన్ని ఉన్నా - వాటి అన్నిటికీ లోపలా బయటా కూడా ఉన్న ఆకాశం మాత్రం ఒక్కటే ! ఆ కుండల రంగు, ఆకారం, పేర్లు వేరు వేరైనా, వాటి లోపలి ఆకాశంలో మటుకు ఏమీ తేడా లేదు !

అలాగే - ప్రాణులు, జంతువులు, మనుష్యులు ఎన్ని రకాలుగా ఉన్నా, వారందరిలో నున్న ఆత్మ-చైతన్యం ఒక్కటే !

### (13) భాష లింతె వేరు   పరతత్త్వ మొక్కటి !

దేవుని స్తుతించే భాషలు మాత్రమే వేరు; దైవతత్త్వం మాత్రం ఒక్కటే !

మన భూగోళవాసు లందరికీ ప్రత్యక్ష దైవమైన సూర్యుణ్ణి - సంస్కృతంలో ' సూర్యః ' అనీ - హిందీలో ' సూరజ్ ' అనీ - ఇంగ్లీషులో ' సన్ ' అనీ - ఇట్లా ఎవరి భాషలో వారు ప్రార్థించుకుంటూ ఉన్నప్పటికీ - అందరు నమస్కరిస్తున్నదీ ఆ ఒకే ఒక సూర్యునికే గదా !

భూగోళం మీద వేర్వేరు ప్రదేశాలలో - వాతావరణ పరిస్థితులు, భౌగోళిక పరిస్థితులు - వేరు వేరుగా ఉంటాయి. అందువలన, ఆయా దేశ-కాల-వాతావరణ పరిస్థితులకు తగినట్లుగా - వారి వారి వేషభాషలు, మతాలు, ఆచారాలు కూడా వేర్వేరుగా ఉంటాయి. ఉండి తీరాలి కూడ !

అయినా - భూగోళాన్ని మాత్రమే గాక, సమస్త బ్రహ్మాండాన్నీ గూడ నియమ బద్ధంగా నడిపించే భగవంతుడు మాత్రం ఒక్కడే !

### (14) తనువు లస్థిరములు   ధర్మంబు నిత్యము !

మనుష్యుల శరీరాలు శాశ్వతం కావు; మనం చేసే ధర్మమే శాశ్వతం ! ఈ

దేహం ఈ జన్మ వరకే ఉపయోగం ! నిత్యంగా, శాశ్వతంగా, ఎన్ని జన్మలకైనా – తన వెంట వచ్చేవి ధర్మాధర్మములే ( పుణ్య-పాపములే ) !

ఇక ధర్మం అంటే – మన మహర్షులు బోధించిన వేద– శాస్త్ర– పురాణ– ఇతిహాసముల లోని కర్తవ్యాకర్తవ్యములు ! తన స్థితిగతులకు తగిన – తన ఆశ్రమాదులకు ఉచితమైన – విధి నిషేధాలు ( **Do's & Don'ts** ) పాటించటము. స్వార్థరహితంగా – పరోపకార బుద్ధి, మానవతా దృక్పథం కలిగి యుండటమే – అన్నిటి కన్న గొప్ప ధర్మం !

**(15) ఇహము నందు బాధ లెన్నైన బడవచ్చు –**
**(16) పరము బాధ లేక బ్రతుకుడీ నరులార !**

ఈ జన్మ యందు, తెలిసి ఉన్న బాధలు ఎన్నైనా పడటం అంత కష్టం కాదు. కాని మరణం తరువాత – పరలోకంలో గాని, మరు జన్మలలో గాని – తెలియని బాధలు పడవలసి రావటం చాలా చాలా కష్టం. అట్టి బాధలు కలగని రీతిలో – అంటే ధర్మబద్ధంగా – జీవించండి !

**(17) చిత్తశుద్ధి గల్గి చేసిన పుణ్యంబు –**
**(18) కొంచెమైన నదియు కొదువ గాదు !**

పరోపకార బుద్ధియే చిత్త–శుద్ధి; స్వార్థ బుద్ధియే చిత్త–మాలిన్యం ! తన శక్తికి తగినట్లుగా ( యథాశక్తిగా ) పరోపకార బుద్ధితో చేసే మంచి పని ( పుణ్య కార్యం ) – ఎంత చిన్నదైనా సరే – దాని ఫలితం మాత్రం గొప్పగా ఉంటుంది!

**(19) ధనము యెవరి సొమ్ము ధర్మమే తన సొమ్ము !**

మనం సంపాదించిన ధనాన్ని ‘ ఇది నా సొమ్ము ’ అని నమ్మకంగా చెప్పుకోలేము. కాని, తాను చేసిన ధర్మాన్ని మాత్రం ‘ ఇది నా సొమ్ము ’ అని నమ్మకంగా చెప్పుకోవచ్చు ! ఎందుకంటే – భగవంతుడు నిర్వహించే ఈ బ్యాంకులో – ఒకరి పుణ్యాన్ని ఒకరు కాజేయ లేరు !

**(20) కలిమి లేమి రెండు గల వెంత వారికి !**

ఎంతటి వారికైనా, జీవితంలో – ఒకప్పుడు ధనం కలిగి యున్న స్థితి – మరి యొకప్పుడు ధనం లేని స్థితి – అనేవి రెండూ సంభవిస్తూనే ఉంటాయి !

అందుకే అన్నారు – ‘ కలిమి లేములు కావడి కుండలు ! ’ అని. కాబట్టి, ధనం పెరిగినప్పుడు గర్వ పడ కూడదు; ధనం తగ్గినప్పుడు క్రుంగి పోనూ కూడదు. అదంతా ఈశ్వర ప్రసాదంగా భావించి, మన కృషి మనం చేస్తూంటే – తప్పకుండా అభివృద్ధి లోనికి వస్తాము.

సుఖ శాంతులతో జీవించడానికి – సరిపడినంత డబ్బు సంపాదించటం కూడ – అవసరమే గదా !

**(21) సాగి పారని తరి సమకూడ దొక్కటి –**
**(22) ధనము యెంత యున్న ధరను వేమ !**

ఎంత ధనమున్నా సరే, లోకంలో ఒక్కోసారి ఏమీ కలిసి రావు !

డబ్బు సౌకర్యాలను ఇవ్వ గలదే కాని, మంచి ఫలితాలను తనంతట తానే ఇవ్వ లేదు ! డబ్బు మంచి పరుపులను కొనివ్వ గలదు గానీ, మంచి నిద్ర పట్టేటట్లు చేయలేదు. మంచి పుస్తకాలను కొనివ్వ గలదు – మంచి ఖరీదైన స్కూళ్ళలో చేర్పించ గలదు – కానీ, మంచి చదువు వచ్చేటట్లు చేయలేదు !

దానికి శ్రద్ధ, కృషి, గురువుల ఆజ్ఞాపాలనం మొ. ఎన్నో మానసిక, వ్యక్తిత్వ–వికాసపు లక్షణాలు ఉండాలి. ఈ మంచి గుణాలు రావాలంటే – పెద్దల మాటలు వింటూ పాటిస్తూండటం, మంచి పుస్తకాలు చదువుతూండటం – చాలా ముఖ్యం !

**(23) ఎంత సంపదొనరు నంత కష్టపు చింత !**

ఒక స్థాయి దాటి, ఎంత ఎక్కువ డబ్బు ఉంటే, అంత ఎక్కువ అశాంతి !

ధనం తక్కువగానే ఉన్నప్పటికీ – సంపాదించే విషయంలోనూ, ఖర్చు పెట్టే విషయంలోనూ – ధర్మ మార్గంలో ఉంటే – వారికి కలిగే సంతృప్తి, నిశ్చింత, జీవిత–ఆనందం ఎన్నో రెట్లు ఎక్కువ !

**(24) అప్పు లేని వాడె యధిక బలుడు !**

సంపాదన ఎక్కువ ఉండీ, అప్పులలోనున్న వానికంటె – సంపాదన తక్కువయైనా, అప్పు లేనివాడే – ఎక్కువ బలవంతుడు !

ఆదాయం ఎక్కువ ఉన్నవారి కంటె, నిలవ ఎక్కువ చేసేవారే – త్వరగా ధనవంతు లవుతారు గదా ! ( **A Rupee SAVED is a Rupee EARNED !** )

**(25) పరుల మోసపుచ్చి ధర ధన మార్జించి -**
**(26) కడుపు నింపుకొనుట కాని పద్దు !**

ఇతరులను మోసం చేయటం, పరుల ధనాన్ని కాజేయటం మొ. పనులు ఎన్నడూ చేయరాదు. తన తిండి కోసమైనా సరే, ఇతరులను మోసగించటం చాల నీచమైన పని !

**(27) ధనము లెచటి కేగు దా నేగు నెచటికి ?**

తాను ఎక్కడికి పోతాడు ? ధనములు ఎక్కడికి పోతాయి ? - అనే విషయం అర్థం చేసుకోవాలి.

మనిషి ఆయుష్షు తీరినపుడు - ఈ సంపద లన్నిటినీ ఇక్కడే వదిలిపెట్టి - పరలోకాలకు వెళ్ళిపోతాడు. పోనీ, తాను బ్రతికి యున్న సమయంలోనైనా - ధనం స్థిరంగా తన దగ్గరే ఉంటుందా ? అంటే, అదీ లేదు ! దొంగలు దోచుకోవచ్చు; సైబర్ నేరగాళ్ళు మోసం చేయవచ్చు ! భూకంపాలు, వరదలలో కొట్టుకు పోవచ్చు ! ఏమైనా జరగవచ్చు !

లక్ష్మి చంచల మైనది. సంపదలు చేతులు మారుతూ ఉంటాయి ! అధర్మంగా సంపాదించిన డబ్బు అయితే, మరీ అర్థాంతరంగానే వెళ్ళిపోతుంది కూడా ! ఇట్లా - శాశ్వతంగా తనతో కలిసి ఉండని ధనాన్ని సంపాదించటానికే - జీవిత కాలమంతా వెచ్చించటం - ఎంత అవివేకం ?!

**(28) శివుడు భర్త కర్త చింతింప నేలరా ?**
**(29) చక్రి భర్త కర్త చింతింప నేలరా ?**

అన్నిటినీ చేసేవాడు, చేయించేవాడు, నిర్వహించేవాడు, భరించేవాడు - అయిన శివుడు లేదా విష్ణువు ఉండగా - విచారించటం ఎందుకు ?!

పార్వతీ-పరమేశ్వరులు, లక్ష్మీ-నారాయణులు, సీతా-రాములు, శ్రీకృష్ణుడు, ఆంజనేయ స్వామి, గణపతి, కుమార స్వామి, సరస్వతీ దేవి, సూర్య భగవానుడు మొ. - ప్రధాన దైవ రూపములలో ఒకరిని - నా యిష్ట దైవంగా భావించి, వారినే శరణు వేడతాను ! నా యిష్ట దైవం నా యోగ-క్షేమాలను ( బాగు-ఓగులను ) చూసుకుంటూ ఉండగా - నాకేల యితర చింతలు ?!

**(30) కల్ల నిజము రెండు కరకంఠు డెరుగును !**
**(31) సత్యమాడు వాని సామి యెరుగు !**

నిజమేదో అబద్ధమేదో దేవునికి తెలుసును. నిజాయతీగా ఉండేవారిని స్వామి కనిపెట్టి కాపాడుతూ ఉంటాడు !

మనస్సులో ఒకరకం ఉద్దేశం ఉంచుకుని, నోటి మాటతో వేరే ఉద్దేశాన్ని ప్రకటిస్తే – ఎదుటి వారికి తెలియక పోవచ్చేమో గాని – అందరి హృదయాలలో వెలుగుతున్న ఆ భగవంతునికి తెలియకుండా ఉంటుందా ?! ఆయనకు అందరి సంగతులూ తెలుసును. ఎవరికి ఎప్పుడు ఏమి ఇవ్వాలో కూడా బాగా తెలుసును. నేను నిజాయతీగానే ఉంటాను – కాబట్టి దేవుడు కనిపెట్టే ఉంటాడు – ఇంక నాకేం భయం !

**(32) నిలువైన చిత్తము నిర్భీతి నొందించు !**

కపటం లేని, నిర్మలమైన మనస్సు – భయమును కలగనివ్వదు !

మన మనస్సులో మంచి సంస్కారాలు, విలువలు, నిజాయతీ ఉంటే – ఏ విషయంలోనూ భయం వెయ్యదు. ఆత్మగౌరవంతో, తల ఎత్తుకుని, నిర్భయంగా – అందరితోనూ వ్యవహరించ గలుగుతాము !

**(33) ఏమి పాట్లు పడుదు రీ దేహమున కిల !**

ఈ లోకంలో జనులు – ఈ ఒంటి కోసం – ఎన్నెన్ని తిప్పలు పడుతున్నారో గదా !

దేహ పోషణ కోసం, ఇన్ని రకాల సౌందర్య సాధనాలు, కెమికల్సు, సింథటిక్సు, కాస్మెటిక్సు, డ్రగ్సు, మందులు మొ. వాడ నవసరమే లేదు ! పైగా, ఇట్లాంటివి తరచుగా వాడటం వల్లనే – ఈ రోగాలు, రొప్పులు, తిప్పలు అన్నీని !

దేహం లోపలా, బయటా ఉన్న మలినాల్ని విసర్జించుకుంటూ – ఆకలికి, తన శరీర తత్త్వానికి తగినట్లుగా ఆహారం తీసుకుంటూ – మితంగా వ్యాయామం చేసుకుంటూ – మిత్రులతో కలిసి ఆడుతూ, పాడుతూ, చదువుకుంటూ – మనస్సును స్వచ్ఛంగా ఉంచుకుంటూ – ఉంటే చాలు ! సంపూర్ణ ఆయురారోగ్యాలు అవే కలుగుతాయి !

### (34) ప్రాప్తము గల చోట  ఫలమేల దప్పునో !

పొందేందుకు అర్హత ఉన్న చోట – ఫలితం రాకుండా పోదు !

యోగ్యత లేకుండా, ఏమీ చేయకుండా – ఆశ పడినంత మాత్రాన, మేలు జరగదు ! ఎవరికి అందాల్సిన ఫలాల్ని వారికే యివ్వటం అనేది – భగవంతుని నియమాలలో ముఖ్యమైనది ! మంచి పనులను చేసి, మంచి ఫలితాలకు అర్హతను – మనం ముందుగా సంపాదించుకుని ఉంటే – మంచి ఫలితం అదే వస్తుంది. అనుమానమే అక్కర లేదు !

### (35) కుండ పగిలెనేని  కొత్తది కొనవచ్చు !

ఒక కుండ పగిలిపోతే – ఇంకొక క్రొత్త కుండను కొనుక్కో వచ్చును !

ఒక వస్తువు చెడిపోతే మటుకు, ఏం కొంప మునుగుతుంది ? దాన్ని బాగు చేయించుకోవచ్చు, లేదా క్రొత్తది అయినా కొనుక్కో వచ్చు. ఆ ఇబ్బంది తాత్కాలికమే. అంతా అయిపోయినట్లుగా – బాధ పడుతూ కూర్చో నవసరమే లేదు !

కాని, ఎవరి మనసు నయినా విరిగేటట్లు చేస్తే – బాగు చెయ్యటం చాలా కష్టం! ఎంతో శ్రమ, సమయం పడుతుంది. క్రొత్త మనసుని అసలే కొనలేం! కాబట్టి, ఎవరి మనసునూ నొప్పించ కూడదు – అంటే, ఎవరి మనసుకూ కష్టం కలిగేటట్లు ప్రవర్తించ కూడదు !

### (36) కడుపు కెట్లయైన  గలుగును భుక్తి రా !

పొట్ట నింపుకోవటానికైతే, ఏదో విధంగా తిండి దొరుకుతుంది !

ఆకలి తీర్చుకోవడానికి ఎన్నో మార్గాలు ఉన్నాయి. పొట్ట నింపడానికి – పంచ భక్ష్య పరమాన్నాలే అక్కరలేదు – మామూలు అన్నం, ఆధరువులే చాలు ! చదువుకున్నవారు – ఏ పని చేసుకునైనా – తిండిని సంపాదించుకో గలరు; బ్రతక గలరు ! మనకే గనక – ఆశయంలో దీక్ష, కృషిలో పట్టుదల ఉంటే – ఎంత ఎత్తులకైనా ఎదగగలం !

ఎంత డబ్బున్న కోటీశ్వరులైనా గానీ – అన్నము, ఉప్పు కలిసిన ఆహారాన్నే తినగలరు గానీ – బంగారం ముద్దలు మ్రింగ గలరా ?! అసహజమైన, అతి

ఖరీదైన పదార్థాలు ఆహారంగా తీసుకుంటే – నష్టమే గాని, లాభం ఏమాత్రం లేదు. ఉదా: అతిగా స్వీట్సు తింటూ ఉంటే – అటు తరువాత జీవితాంతం – తీపిని అసలే తినకూడని షుగరు వ్యాధి వచ్చే అవకాశాలే ఎక్కువ గదా !

**(37) పరగ రాతి గుండు పగుల గొట్టగ వచ్చు –**
**(38) కొండలన్ని పిండి గొట్ట వచ్చు !**

పెద్ద పెద్ద రాతి బండలనైనా పగలగొట్టి, వాటి క్రిందనున్న నిధులను పొంద వచ్చు ! కొండలను పిండి పిండి చేసి అయినాగాని, అమూల్యమైన, ఉపయోగకరమైన నిక్షేపాలను సాధించ వచ్చు ! మనకు ఉన్న పనులు ఇంతకంటె కష్టమైనవా – ఎందుకు చేయలేము ?!

అడ్డంకులు ఎదురైనా గానీ – ధైర్యం కోల్పోకుండా ఉంటే చాలు; పట్టు వదలకుండా ఉంటే చాలు – కష్టసాధ్యమైన కార్యాలు కూడా చక్క బడతాయి!

**(39) ఉల్ల మందు వగవ – కుండుట యోగ్యంబు !**

మనస్సులో చింత లేకుండా ఉండటం మంచిది. 'చింత ' అంటే – దిగులు, విచారం, ఆదుర్దా, ఆందోళన, అనుమానం, భయం మొ. – 'న'కారాత్మక భావాలు ( **Negative Feelings**) !

మనకు కష్ట–నష్టాలు కలిగినపుడు, పైన చెప్పిన భావాలు కలగకుండా ఎలా ఉంటాయి ?! మనలో దైవభక్తి ఉంటే, నిజాయతీ ఉంటే – ' దేవుడు మనకి కొండంత అండగా ఉన్నాడు ! ' అనే గ్రహింపు ఉంటే – మన మనస్సులో ధైర్యలక్ష్మి నాట్యం చేస్తుంది ! ధైర్యం ఒక్కటి ఉంటే – దైవం మీద భారం వేసి కృషిని కొనసాగిస్తే – మిగతావన్నీ ఎన్నైనా సాధించుకోవచ్చు !

**(40) మేలిమిగా బ్రతుక వచ్చు మేదిని వేమా !**

ఈ భూమి మీద మనం – మేలిమి బంగారం లాగా – ఎంతో ఉత్తమ విలువలతో – ఎంతో ఉన్నత స్థాయిలో బ్రతుకవచ్చు !

మన మహర్షులు అందించిన భారతీయ సంస్కృతీ సాహిత్యం ఆధారంగా – మనకు ఏది మంచో, ఏది చెడో తెలుసుకోవాలి. చెడు విషయాలను వదిలి పెట్టాలి. మంచిని ఆచరణలో పెట్టాలి. సంపూర్ణంగా కృషి చేయాలి. తన కృషికి ప్రతిఫలంగా లభించిన దానితో సంతృప్తి చెందాలి. సంగీత–సాహిత్యాది

ఉత్తమ కళలను ఆస్వాదించ గలగాలి. పరులకు మేలు జేసే తత్త్వం అలవరచుకోవాలి. నలుగురూ మెచ్చేటట్లుగా జీవించాలి. ఆధ్యాత్మిక సాధన చేయాలి. భారతీయులకు – ' మేలిమిగా బ్రతకటం ' అంటే ఇదే !

పాశ్చాత్యుల దృష్టిలో అయితే – భౌతిక సుఖసాధనాలను ( **Luxurious Material Items** ) ఎంత ఎక్కువగా పోగుచేసుకుంటే – వారి సమాజంలో అంత గొప్ప ! – వాటి వల్ల సుఖం పొందగలిగినా, లేకపోయినా గూడ !

### (41) చెలగు దివ్వె లేక చీకటి వాయునా ?

దీపం, కాగడా ( **Torch** ) వెలిగించనిదే – చీకటి పోతుందా ? వస్తువులు ఏమైనా కనిపిస్తాయా ?!

మన చుట్టు ప్రక్కల – మనకు అవసర మైనంత మేరకు – వెలుతురు ప్రసరించేలాగా – దీపమో, కాగడానో వెలిగించుకుంటే చాలు ! మన దారి బాగా కనబడటానికి, మన ప్రయాణం సాగటానికి – మన చేతిలోని టార్చి లైటు మనకు చాలు గదా ! అవతల ఎంత చిమ్మచీకటి ( గాఢాంధకారం ) ఉంటే మటుకు మనకే భయం ?!

వెలుగు నిచ్చే విద్యను సంపాదిస్తే – జ్ఞాన దీపాన్ని వెలిగించుకుంటే – చీకటి వంటి అజ్ఞానం తొలగి పోతుంది గదా !

### (42) చెట్టు బెట్ట ఫలము చేకూర కుండునా ?!

ఒక మొక్కని నాటి, దాని పోషణ, రక్షణ చేస్తూంటే – ఆ చెట్టు పెరగకుండా ఉంటుందా ! – పూలు, పళ్ళు ఇవ్వకుండా ఉంటుందా !

అలాగే, పిల్లలు కూడ, విద్య అనే మొక్కను చక్కగా పెంచుకుంటే – వారికి జీవితాంతం – విజయం, ధనం, గౌరవం, ఆనందం మొ. మధుర ఫలాలు లభిస్తాయి !

తమ మనుమలు, మనుమరాళ్ళు పెద్దవారయ్యేటప్పటికి, వారికి అంది వస్తాయి గదా అనే ఉద్దేశంతో – పెద్ద వయసులో కూడ – తాతయ్యలు, మామ్మలు – మామిడి మొ. మొక్కలు పెడుతూనే ఉంటారు ! అలాగే, వారి విజ్ఞానం, అనుభవం, వివేకములనే చెట్లయొక్క విత్తనాలను – పిల్లల మనస్సులనే తోటలలో – మొలకలెత్తించాలని ప్రయత్నిస్తూంటారు ! ఆ విషయం గ్రహించి, మనం

వారికి అనుకూలంగా నడచుకుంటే చాలు – ఫలాలు, లాభాలు అన్నీ మనకే గదా !

## (43) విత్తనంబు మఱ్ఱి వృక్షంబునకు నెంత !

మఱ్ఱి చెట్టు చాలా పెద్దది. మఱ్ఱి విత్తనమేమో అతి చిన్నది. అంత చిన్న విత్తు – అంత పెద్ద చెట్టుగా ఎదగటం – ఎంత ఆశ్చర్యం ! భగవత్ సృష్టిలోని ప్రతిదీ ఒక అద్భుతమే !

అలాగే – చిత్తశుద్ధితో, స్వార్థం లేకుండా – ఇతరులకు చిన్న సాయం చేసినా గాని – దాని ఫలితం మాత్రం గొప్పగా ఉంటుంది !

పిల్లల మనస్సులు స్వచ్ఛంగా ఉంటాయి. వాటిలో నాటిన ' సూక్తులు ' అనే చిన్న చిన్న విత్తనాలే – విజ్ఞానం, వివేకం, ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం అనే మహా వృక్షాలుగా ఎదిగి– అందరికీ చల్లని నీడను, తియ్యని పళ్ళను అందిస్తూనే ఉంటాయి!

## (44) నీరు జొరక లోతు నిజముగా దెలియదు !

నీళ్ళ లోనికి దిగనిదే – ఎంత లోతు ఉన్నదో ఎట్లా తెలుస్తుంది ? తీరా దిగిన తరువాత, తాను కొట్టుకొని పోతున్నప్పుడు – ' లోతు ఎక్కువగా ఉన్నది ' అని తెలిస్తే మటుకు – ఏం ప్రయోజనం ? కాబట్టి, తనకు పరిచయం లేని జలాశయాలకు పోరాదు. పెద్దవారి తోడు లేకుండా – పిల్లలు మాత్రమే వెళ్ళరాదు.

ఒక పనిలోకి దిగితేనే గాని దాని పూర్తి సాధక బాధకాలు తెలియవు ! అవి తెలియకుండా, ఊరికే ఒడ్డున కూర్చుని, విమర్శలు చేయటం తగదు ! అలాగే, ఏ పెద్ద పని మొదలు పెట్టాలన్నా, దాని లోతు–పాతులు, సాధక–బాధకాలు, లాభ–నష్టాలు మొ. బాగా ఆలోచించిన తరువాతే, మొదలు పెట్టాలి !

## (45) తిన్న గాని తీపి తెలియ రాదు !

నోట్లో వేసుకుంటేనే, పండు ఎంత తియ్యగా ఉన్నదో తెలుస్తుంది. చెవితో వింటేనే, సంగీతం ఎంత కమ్మగా ఉన్నదో తెలుస్తుంది. మనసు పెట్టి చదివితేనే, వింటేనే – సాహిత్యం ఎంతటి అమృతమో అర్థమవుతుంది ! తినేవరకు,

వినేవరకు గూడా, ఎవరు ఎంతగా వర్ణించి చెప్పినాగాని, అర్థం కాదు, విలువ తెలియదు !

కాబట్టి, మన మేలు కోరేవారు, గురువులు, సాటివారు, మిత్రులు గనుక – వారు సారం గ్రహించి, ‘ ఈ విషయం బాగుంది; నీవు కూడ చదువు; చాలా ఉపయోగం.’ అని చెప్పిన వాటిని ముందుగా చదువుతూ ఉంటే – తక్కువ సమయంలోనే ఎక్కువ ఫలితం, అభివృద్ధి పొందగలం గదా !

అయితే – అన్నిటినీ మనమే రుచి చూసి, తెలుసుకోవాలని ప్రయత్నిస్తే – సమయం సరిపోదు. చాలా సార్లు చేదు కూడ తగలవచ్చు. అందుకే, ఇతరుల అనుభవాల నుంచి, మంచి – చెడు నేర్చుకునేవారే బుద్ధిమంతులు, వివేకవంతులు !

### (46) నీరు పల్ల మెరుగు నిజము గాను !

నీటిని స్వేచ్ఛగా వదిలిపెడితే – పల్లం ఎటు ఉందో చూసుకుని – అటు పల్లానికే ప్రవహిస్తుంది !

నదులకు ఏ కొండలో, గుట్టలో అడ్డం వచ్చినా గాని – త్రోవ చేసుకుని మరీ – సముద్రం అనే గమ్యాన్ని చేరాలనే చూస్తాయి ! అలాగే, విఘ్నాలు ఎదురైనా గాని, వాటిని అధిగమించి – లక్ష్యం సాధించటానికై – ప్రయత్నం కొన సాగించే వారే ఘనులు !

మనసును స్వేచ్ఛగా వదిలి పెడితే – అది కూడ, నీటి వలెనే సహజంగానే– తక్కువ స్థాయి విషయాల వైపే ప్రవహిస్తుంది. చెడు అలవాట్లు త్వరగా అబ్బుతాయి. మంచి అలవాట్లు మాత్రం – పెద్దల మాట పాటించాలనే పట్టుదల, స్వయం క్రమశిక్షణ – ఉంటేనే అలవడతాయి !

### (47) తామసించి సేయ తగదెట్టి కార్యంబు –
### (48) వేగిరింప నదియు విషమ మగును !

ఏ పనిని కూడ ఆలస్యంగా చేయరాదు. అలా అని, అతి తొందర పడితే – ఆ పని చెడి పోతుంది, వికటిస్తుంది.

' రేపు చేయాల్సిన పనిని ఈ రోజే చెయ్యి ! ఈ రోజు చేయాల్సిన పనిని ఇప్పుడే చేసెయ్యి ! ' అని సూక్తి ! అయితే, ఏ పని చేసే ముందయినా – ప్రయోజనం, మంచి చెడ్డలు, లాభ నష్టాలు, విధి విధానాలు తెలుసుకుని – అనుకున్న సమయానికి పూర్తి అయ్యేటట్లుగా – తగిన వేగంతో పని చేయాలి!

**(49) మొదల విడిచి గోడ తుది బెట్ట గలుగునా !**

గోడ కట్టాలంటే – నేల లోంచీ, పునాది నుంచీ – మొదలు పెట్టాలి. పునాది ఎంత బలంగా ఉంటే – పైన కట్టిన భవనం అంత బలంగా, చాలా కాలం నిలుస్తుంది.

విద్య కూడ అంతే ! ప్రాథమిక విద్యా స్థాయిలో ( 8వ తరగతి వరకు ) చదువులో గట్టి పునాది ( **Solid Foundation** ) పడితే, ఆ పైన ఎంత ఎత్తులకైనా ' విద్యా హర్మ్యాలు ' ( **Sky Scrapers** ) నిర్మించుకుంటూ పోవచ్చు !

**(50) పుట్ట మీద గొట్ట భుజగంబు చచ్చునా !**

పుట్ట పైభాగాన ఎంతగా కొట్టినా, పుట్ట లోని పాముకి దెబ్బ తగులుతుందా? పాము చస్తుందా?! దెబ్బ సరాసరి పాముకి, అదీ దాని తలకే తగలాలి గాని!

అలాగే, లోతైన సమస్యలకు – పరిష్కారం కూడ లోతుగానే ఉండాలి. కీళ్ళ నొప్పుల వంటి వ్యాధి ఉన్నప్పుడు – పై పూతలవల్ల, తాత్కాలిక ఉపశమనమే గాని – గాఢమైన మందులు వాడనిదే, వ్యాధి పూర్తిగా నయం కాదు; మళ్ళీ మళ్ళీ బాధిస్తూనే ఉంటుంది !

చదివింది అర్థం కాకపోవటం అనే సమస్యకు పరిష్కారం – విషయాన్ని అడిగి లోతుగా, వివరంగా, అర్థం అయ్యేటట్లుగా చెప్పించుకోవటమే గాని – పైపైన బట్టీ పట్టటం కాదు గదా !

**(51) వ్రాత వెంట గాని వర మీడు దైవంబు –**
**(52) సేత కొలది గాని వ్రాత గాదు –**
**(53) వ్రాత కజుడు కర్త సేతకు దా కర్త !**

బ్రహ్మరాతకు అనుగుణంగానే దేవుడు వరమిస్తాడు. మనం చేసుకున్న దానిని బట్టే బ్రహ్మ వ్రాస్తాడు ! కాబట్టి, బ్రహ్మ చేత మంచిగా వ్రాయించుకోవడం అనేది – మన చేతులలోనే, మన చేతలలోనే ఉన్నది !

ముందు మనం చేస్తే – ఆ తరువాత బ్రహ్మ వ్రాస్తే – అప్పుడు ఆ ఫలితం మనకు అందుతుంది. ఈ మధ్యలో – మనం ఊరికే కూర్చోకుండా – ఇంకా ఇంకా మంచి చేసుకుంటూ పోవటమే ! ఎప్పుడెప్పుడు ఏయే ఫలితాలు ఇవ్వాలో – ఆ విషయాలన్నీ – దేవుడే చూసుకుంటాడు !

## (54) ఏమి లేని నరున కే గతి లేదురా !

ఏమీ చేయని వారికి, యేమీ దక్కదు ! వ్యవసాయం ( కృషి ) చేసిన వారికే, పంట చేతికి వచ్చేది. నలుగురికి అన్నం పెట్టిన వారికే, అన్నం పుట్టేది ! ఇతరులకు సహాయం చేసినవారికే, సహాయం అందేది ! మంచి పనులు చేసిన వారికే – మంచి సుఖాలు, ఆనందాలు లభించేది !

వేద–శాస్త్ర–పురాణ–ఇతిహాసాలు, మహర్షులు, గురువులు – ఏమి చేస్తే మంచిదో మనకు చెబుతూనే ఉన్నారు. మనం చేస్తేనే గదా,ఆ లాభం మనకు కలిగేది! ఏ ఔషధం వాడాలో వైద్యుడు చెబుతాడు. కాని ఆ మందును చెప్పిన విధంగా వాడితేనే గదా వ్యాధి తగ్గేది ! కాబట్టి, ఏ ఫలితం కావాలన్నా– కృషి తప్పనిసరి!

## (55) కరగ కరగ బుట్టు కనకంబునకు వన్నె !

కరిగించగా కరిగించగా – బంగారం శుద్ధి అవుతుంది. శుద్ధి అవుతున్న కొద్దీ, దాని వర్ణం, రంగు పెరుగుతుంది !

మనస్సు ఏదైనా ఒక మంచి లక్ష్యం కోసం తపించగా తపించగా – తపోశక్తి కలుగుతుంది; కార్యసిద్ధి కలుగుతుంది !

ఏదైనా సరే, మొదలు పెట్టినంత మాత్రాన పూర్తి కాదు. ప్రణాళికా బద్ధమైన కృషి, పట్టు వదలని దీక్ష, దైవ ప్రార్థన – ఈ మూడూ ఉంటే, తప్పక విజయం వరిస్తుంది !

## (56) తరువ తరువ బుట్టు దధిని ఘృతము !

పెరుగును చిలకగా చిలకగా, నెయ్యి లభిస్తుంది. క్షీర–సారమైన నెయ్యి కావాలంటే ఎంతో కృషి చేయాలి. పాలను కాచి, తోడు పెట్టి, ఆ వచ్చిన పెరుగును మథించాలి ( చిలకాలి ) ! అప్పుడు వచ్చే వెన్నను కరగ బెట్టాలి. అప్పుడు లభిస్తుంది నెయ్యి !

చదువు అయినా అంతే ! పాఠ్య పుస్తకాలు ( **Text Books** ) చదవాలి; భావాన్ని మాతృభాషలో అర్థం చేసుకోవాలి; సారమైన సూత్రాలను కంఠస్థం చేయాలి; ప్రశ్నలకు స్వంతంగా జవాబులు వ్రాయాలి ! క్రమం తప్పకుండా – సాధన, పునశ్చరణ ( **Practice and Revision** ) చేస్తుంటేనే – ‘ ప్రతిభ గల విద్యార్థులు ’ ( **Merit Students** ) అవుతారు !

**(57) సాధనమున బనులు సమకూరు ధరలోన !**

లోకంలో ఏ పనులైనా సాధన వల్లనే చక్కగా పూర్తి అవుతాయి; మంచి ఫలితాలను ఇస్తాయి !

నిత్యమూ సాధన చేసేవారి సంగీతం ఎంత అద్భుతంగా ఉంటుంది ! రోజూ ప్రాక్టీసు చేసే క్రీడాకారుల ( **Athletes** ) యొక్క క్రీడా నైపుణ్యాలు ఎంత గొప్పగా ఉంటాయో – ఒలింపిక్సు ( **Olympics Games** ) చూస్తే తెలుస్తుంది. ఏ విద్య అయినా కూడ, సాధన ( **Dedication and Practice** ) ఉంటేనే రాణిస్తుంది !

**(58) నిక్కమైన మంచి నీల మొక్కటి చాలు –**
**(59) తళుకు బెళుకు రాళ్ళు తట్టెడేల ?!**

విలువైన, ఉపయోగపడే – నవ రత్నాల జాతి రాయి ఒక్కటి చాలదా – భాగ్యవంతులను చేయటానికి ?! సహజమైన విలువ లేకుండా – ఊరికే తళుకు బెళుకులు కలిగిన – రాళ్ళను, తట్టెడు సేకరిస్తే మటుకు ఏం లాభం?!

అలాగే – సారం లేని, ఉబుసుపోక పుస్తకాలు బోలెడు చదివితే ఏమి లాభం? విలువైన, ఉపయోగపడే మంచి పుస్తకం, మంచి పద్యం, లేదా సూక్తి ఒక్కటి నేర్చుకున్నా, జీవితంలో ఎంతో ఉపయోగ పడుతుంది గదా !

మంచి పుస్తకం అంటే – దీర్ఘకాలం ఉపయోగపడే విషయాలను – ప్రామాణికంగా, సంక్షేపంగా, కంఠస్థ యోగ్యంగా – వీలైతే లయబద్ధంగా, (పద్య, గేయ, సూక్తి రూపంగా ) – ఆయా శాస్త్రాలకు సారభూతంగా చెప్పే పుస్తకం !

ఉదా: ఆరోగ్య రక్షణం పై, తెలుగులోకి అనువదించబడి ఉన్న – ఒక చిన్న మంచి ఆయుర్వేదం పుస్తకం చదివితే – ఇక ఆ తరువాత, పత్రికలలో

(**Magazines**) లో – నిత్యం, వారం వారం – కుప్పలు తెప్పలుగా వచ్చే (**Ever- changing Modern Health Tips**) లాంటి వాటిని – చదవాల్సిన అవసరమే ఉండదు ! అయోమయం, తికమకలు (**Confusion** ) ఉండనే ఉండవు !

**(60) గంగి గోవు పాలు   గంటెడైనను చాలు –**

**(61) కడివెడైన నేమి   ఖరము పాలు ?!**

పవిత్రమైన, ఆరోగ్యకరమైన, అభిషేకానికి పనికివచ్చే – ఆవు పాలు ఒక గరిటెడు అయినా చాలు. మనుష్యులకు ఉపయోగించే సుగుణాలేమీ లేని – గాడిద పాలు, బిందెడు ఊరికేనే లభిస్తే మటుకు ఏం లాభం ?!

**(62) పుష్పమందు తావి   పొసగినట్లగు విద్య !**

పూవులందు సువాసన ఉంటే ఎంత శోభగా ఉంటాయో, మనుష్యులు కూడ ఎంత చదువు, విద్య ఉంటే, అంతగా రాణిస్తారు !

‘ పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది ’ అనే మాట నిజమే అయినా – మొగ్గగా

ఉన్నప్పటి కన్న – పూవు వికసించేటప్పుడు సువాసన అధికంగా ఉంటుంది. సువాసన ఉన్న పూవులే జనులందరకూ ప్రియమైనవి, దేవుని పూజకూ పనికి వచ్చేవి !

అలాగే – సుగుణవంతులైన పిల్లలు, విద్యావంతులైన పిల్లలు – సువాసన గల పూవుల వలె – అందరి హృదయాన్ని చూరగొంటారు !

**(63) కంచు మ్రోగునట్లు   కనకంబు మ్రోగునా ?!**

కంచు వస్తువులు చేసేటి ధ్వనిని,  బంగారు వస్తువులు చేస్తాయా ?!

అలాగే – అల్పబుద్ధి గలవారి మాటలు – కంచు ఘంట ధ్వని వలె – గణగణా, బిగ్గరగా, హడావిడిగా, ఆడంబరంగా ఉంటాయి !  సజ్జనుల పలుకులైతే – బంగారు నగల సవ్వడి వలె – హితంగా, మృదువుగా, చల్లగా, హాయిగా ఉంటాయి !

ఇంకొక రకంగా చూస్తే – దేవాలయాలలో మంచి ఘంటానాదం వినిపించాలంటే – కంచు గంటయే పనికివస్తుంది. బంగారంతో చేసిన గంట

పనికిరాదు ! కాబట్టి, గ్రహించ వలసిన దేమంటే – దేని విలువ దానిది ! దేని గుణాలు, ఉపయోగాలు దానివి ! ఒక ప్రయోజనం ఆశించినపుడు – దానికి సరిగా పనికివచ్చే వస్తువునే ఎంచుకోవాలి గాని, ఖరీదును బట్టి కాదు ! ఉదా: విపత్కర పరిస్థితిలో, సూది అవసరపడినప్పుడు, బంగారపు గుండు దొరికితే మటుకు ఏం లాభం ?!

## (64) కొండ యద్దమందు కొంచెమై యుండదా ?!

కొండల వంటి పెద్ద వస్తువులు కూడ – ఒక చిన్న అద్దంలో ఇమిడి కనిపిస్తాయి!

సందర్భాన్ని బట్టి, తగ్గి ఉండటం అనేది ఒక సుగుణం. అది వినయాన్ని, నిగర్వాన్ని సూచిస్తుంది. క్షేమాన్ని, విజయాన్ని కలిగిస్తుంది. ఉదా: ఈదురు గాలులు వీచినపుడు – తల వంచిన గడ్డి పోచ క్షేమంగా బయట పడుతుంది. కాని ఎదురు నిలిచిన వృక్షాలు మాత్రం కూలిపోతాయి !

నిర్మలమైన అద్దం ( **Mirror, Lens** ) కొండలనే కాదు – విశాల ఆకాశంలోని సుదూర తీరాల గ్రహ నక్షత్రాలను కూడ చూపగలదు ! అలాగే, నిర్మలమైన అంతఃకరణము ( మనస్సు, బుద్ధి ), పరమాత్మ దర్శనమును కూడ చేయించ గలదు !

## (65) ఒప్పు దుర్జనములు తప్పుగ నెంతురు !

చెడ్డవారు – ఒప్పుని గూడ తప్పుగ, మంచిని గూడ చెడుగ – భావిస్తారు ! చెడు విషయములనే మంచిగా భావిస్తారు ! మంచి అని చెప్పినా చేయలేరు – చెడు అని చెప్పినా మానలేరు !

చెడ్డ వారితో స్నేహం చేస్తే – మంచి పిల్లలు కూడ చెడిపోతారు ! చెడ్డ పేరు వస్తుంది. భవిష్యత్తులో ఉన్నత స్థానంలోకి రాలేరు. అందుకే, సహాధ్యాయుల ( **Class- mates** ) యొక్క మంచి గుణాలని చూసి మాత్రమే స్నేహం చేయాలి !

## (66) ఎట్టి వారు మెత్తు రట్టి వారి !

ఎలాంటి వారు అలాంటి వారినే మెచ్చుకుంటారు. మంచివారు మంచివారినే మెచ్చుకుంటారు.

అందరిలోనూ, చెడ్డవారి మనస్సులలో కూడ – చెడ్డవాళ్ళంటే – ఒక అగౌరవ భావం, ఒక అమిత్రతా భావం, ఒక అభద్రతా భావం కలుగుతూంటుంది ! ఒకరి నొకరు నమ్మలేరు ! కాని, పైకి మాత్రం, చెడ్డవారు చెడ్డవారినే మెచ్చుకుంటారు ! తోడు దొంగలు కాబట్టి ! అంత మాత్రాన, మంచివారు బాధ పడ నవసరం లేదు ! జాగ్రత్త పడితే చాలు !

### (67) పదుగు రాడు మాట పాటియై ధర జెల్లు !

ఈ లోకంలో సామాన్యంగా – పదిమందీ ఏ మాట చెబితే – ఆ మాటే నిజంలాగా చలామణి అయిపోతూ ఉంటుంది !

మన భారతీయ ప్రాచీన సాహిత్యం కొంతైనా చదివితే – ఇది మంచి, ఇది చెడు – ఇది చెయ్యవచ్చు, ఇది చెయ్యకూడదు – ఇది న్యాయం, ఇది అన్యాయం – ఇది ధర్మం, ఇది అధర్మం – అనే విషయాలు తెలుస్తాయి ! లేదా, అవి చదివినవారి దగ్గర విన్నా కూడ తెలుస్తాయి !

అప్పుడు, పదిమంది చెప్పినది గనుక – అనుచితం, అన్యాయం, అధర్మం అని తెలిసినట్లైతే – అధిక సంఖ్యాక ( **Majority** ) జనులు చెప్పినా – వారి మాటలు పాటించ నక్కర లేదు ! ఎందుకంటే – ‘ రాశి కన్న వాసి మిన్న ! ’ అని సూక్తి ! **( Quality is more important than Quantity ! )**

### (68) కుక్క వంటి యాశ కూర్చుండ నివ్వదు –

### (69) తిక్క బట్టి నరుడు తిరుగుచుండు !

కుక్కకి ఆశ ఎక్కువ – ఎప్పుడూ రొప్పుతూ, రోజుతూ తిరుగుతూ ఉంటుంది!

అలాగే – అత్యాశ మనిషిని శాంతిగా ఉండనివ్వదు ! తనకు ఉన్న దానిని చూసి సంతోష పడనివ్వదు. తనకు లేని దానిని పెద్దది చేసి చూపి, ఆరాటాన్ని, అశాంతిని కలిగిస్తుంది ! ఎక్కడా నిలవలేక, అటూ ఇటూ పరుగులు పెడుతూ ఉంటారు !

ఆశ మానవులకు సహజ గుణం. ఆశ – పరిమితులలో ( **within Limits** ) ఉన్నంతవరకు, పరులకు హాని చేయనంతవరకు – మంచిదే ! ఆశ పడుతున్న విషయం మంచిదైతే, మరీ మంచిది – అభివృద్ధిలోకి వస్తారు !

చెడ్డ విషయంపై ఆశ పడితే మటుకు, చెడిపోతారు ! ఆశ పరిమితి దాటితే – దురాశ, పేరాశ అంటారు ! ' దురాశ దుఃఖము చేటు ' అని సామెత !

### (70) దండ సాధ్యులైరి ధర్మ సాధ్యులు గాక !

ఈ రోజులలో జనులు – ధర్మ ప్రీతి, పాప భీతి వలన గాకుండా – దండ భయం ( శిక్ష అంటే భయం ) వలననే, ఎక్కువగా అదుపులో ఉంటున్నారు !

పూర్వకాలంలో జనులు – ధార్మిక, నైతిక, సామాజిక జీవన విధానంలో ఉండేవారు. ధర్మ ప్రీతితో, ఉత్తమ విలువలతో, స్వయం–క్రమశిక్షణతో, ఆత్మ–గౌరవంతో ( **with Self-Discipline & Self-Dignity** ) జీవించే వారు!

ఈనాడు జనులు, పాశ్చాత్య దృష్టి ప్రభావం వలన, వ్యక్తి–స్వేచ్ఛ ప్రధానంగా – స్వార్థ ప్రధాన జీవితం, సామాజిక స్పృహ లేని జీవితం– గడుపుతున్నారు! హేయ కార్యాలు చేశారనే ఆరోపణలు మీడియా లో ప్రసారమైనా కూడ ఎవరూ అభిమాన పడటం లేదు ! ' దొరికితేనే దొంగలు ! ' అన్న చందాన ఉంటున్నారు ! అందుకే, వీరిని ' దండ సాధ్యులు ' అన్నాడు వేమన ! అన్నిటికన్న విచిత్రం, దయనీయం ఏమిటంటే – ' ఈ రంగంలో ఇదంతా మామూలేలే!' అనే ఉపేక్షా భావం జనులలో వ్యాపించటం !

### (71) ఉత్తమ పురుషుండు యొక్కడె జాలడా !

ఉత్తములు అంటే – ఉత్తమ విలువలతో జీవించేవారు ! అలాంటి వ్యక్తి ఒక్కరు ఉన్నా, ఆ ప్రాంత, దేశ ప్రజలందరు – ' నిత్య కళ్యాణం–పచ్చ తోరణం ! 'గా జీవిస్తారు !

' స్వంత లాభం కొంత మానుకు – పొరుగు వాడికి తోడు పడవోయ్ ! ' అన్నాడు గురజాడ మహాకవి ! అలాంటి సంస్కారం కలిగిన నేటి విద్యార్థులు – రేపు పెద్దయ్యాక – వివిధ రంగాలలో అధికారంలోకి వస్తే – భారత దేశ ముఖచిత్రం ఎంత శోభాయమానంగా ఉంటుంది ! ' భారత మాతే మనలను చూసీ – గర్వ పడేలా జీవిద్దాం ! ' – (తాతయ్య సూక్తులు )

### (72) చెట్టు ముదరనిచ్చి చిదిమిన బోవునా ?!
### (73) వెనుక వంతుననుట వెర్రి తనము !

' గోటితో పోయే దానికి గొడ్డలి దాకా ఎందుకు ?'! ఒక పనికిరాని పిచ్చి మొక్కను – అది లేత మొక్కగా ఉండగా, పీకివేయటం చాలా తేలిక – గోటితో గిల్లినా పోతుంది ! అదే మొక్క ముదిరి, చెట్టుగా పెరగనిస్తే – దానిని తీసివెయ్యటానికి ఏ గొడ్డలో కావాల్సిందే !

ఆ మొక్క మంచిదే అయినా, ఏ వంకర లేకుండా తిన్నగా పెరగాలంటే – చిన్న మొక్కగా ఉన్నప్పుడే, కర్ర పోటీ పెట్టి, నిటారుగా పెరిగేటట్లు చేయగలం!

అలాగే, దుర్గుణాలను, చెడ్డ అలవాట్లను – మొగ్గలోనే త్రుంచి వేయాలి ! లేకపోతే, అలవాట్లు బలపడుతున్న కొద్దీ, వాటి నుంచి బయట పడటం ఎంతో కష్టం అవుతుంది !

**(74) పాల నీరు క్రమము పరమ హంస యెరుంగు !**

పాలూ నీళ్ళూ – ఒక దానితో ఒకటి – చాలా బాగా కలిసి పోతాయి; విడి విడిగా కనబడవు ! ఉత్తమ భార్యాభర్తలు, ఉత్తమ మిత్రులు – ఇలా పాలూ నీరూ లాగా కలిసిపోతారు. ఆ బంధం ఎంత అందంగా, ఆనందంగా, అద్భుతంగా ఉంటుంది !

హంసకు ఒక ప్రత్యేకమైన శక్తి ఉంది. పాలూ నీరూ కలిసి పోయిన ద్రవం లోంచి – హంస, నీటిని వదిలిపెట్టి, పాలను మాత్రమే వేరు చేసి త్రాగ గలదు! అలాగే, మంచి – చెడు కలిసిపోయి ఉన్నా గాని – వివేకులు, సత్పురుషులు వాటిని వేరుచేసి, మంచిని మాత్రమే గ్రహిస్తారు !

**(75) భక్తి గలుగు కూడు పట్టెడైనను చాలు !**

ఎవరైనా – భక్తి శ్రద్ధలతో, ఆదరంగా, తమ శక్తికి తగినట్లుగా – పెట్టే భోజనం పట్టెడైనా చాలు ! ఆదరం లేకుండా, అహంకారంతో, ఆడంబరం కోసం, అవమానకర ధోరణిలో – పంచ భక్ష్య పరమాన్నాలు (షడ్రసోపేతమైన విందులు) పెట్టినా కూడ – ఎవరికీ లాభం లేదు !

ఆహారమే కాదు – దానం అయినా, సహాయం అయినా కూడ అంతే. పుచ్చుకునే వారి ఆత్మాభిమానం ( **Self-esteem** ) దెబ్బ తినకుండా ఇచ్చేవారే గొప్పవారు!

**(76) గుణ యుతునకు మేలు గోరంత జేసిన –**
**(77) కొండ యౌను వాని గుణము చేత !**

' కృతజ్ఞత ' అనే సుగుణం కలవారికి – కొద్దిగా మేలు చేసినా – దానినే కొండంతగా భావించి, ఎప్పుడూ గుర్తుంచుకుంటారు ! ' ఫలానా వారు నాకు ఈ సహాయం చేశారు ' అని నలుగురికీ తెలియ జెబుతూంటారు ! తిరిగి సహాయం చేసే అవకాశం వస్తే, వదులుకోరు ! ఇది మంచి గుణాలు కలవారి లక్షణం !

### (78) నేల నున్న రాయి నెత్తి కెత్తిన యట్లు !

అవసరం లేని బరువు నెత్తి కెత్తుకోవటం ఎంత అవివేకం ? త్రోవలో పడియున్న బండరాయిని ఎత్తి, నెత్తిన మోస్తూ నడవటం అంత అవసరమా? అదేమి తెలివి !

ఒక లక్ష్యం కోసం ఒక మార్గంలో పయనించేవారు – చుట్టు ప్రక్కల కనిపించే వింతలు, విశేషాలతో ఆకర్షితులై – కొంత సమయాన్ని, శ్రమను వాటికై వినియోగించటం కూడ – అంతే అవివేకం ! ఎందుకంటే, లక్ష్యం చేరుకోవటం ఆలస్యం అవుతుంది . ఈ లోపల పరిస్థితులు మారితే, అసలు చేరుకోలేకనే పోవచ్చు గూడ !

### (79) నిజము లాడ రాదు నీచుతోను !

' సత్యం వద !' అన్నారు. అంటే ' నిజమునే పలుకుము ' అని అర్థం.

కాని, దుర్మార్గులు, నీచులు అయినవారితో – నిజం చెప్పటం కూడ ప్రమాదకరమే! ఎందుకంటే – వారికి తెలిసిన విషయాలతో – వారు ఇతరులకు హాని తలపెట్టే అవకాశాలే ఎక్కువ !

సజ్జనుల యొక్క – ప్రాణ, విత్త, మానాదుల రక్షణ కోసం – అబద్ధం చెప్పినా తప్పు కాదు – అని మహాభారత వచనం !

### (80) అనువు గాని చోట నధికుల మనరాదు !

మనకు అనుకూలంగా లేనిచోట – ' నేనే గొప్ప ' అన్నట్లు ప్రవర్తించటం – పనికిరాదు !

మనవారు, మనతో సమానమైన ఆసక్తులు గలవారు ఉండి, మనకు అనుకూలంగా ఉండేచోట – కాస్త చనువుగా, ఆధిక్యత ( **Dominating**) గా

ఉన్నా – అంత పరవా లేదు ! కాని మనకు స్థానబలం లేనిచోట – మన ఆధిక్యాన్ని, అహంకారాన్ని ( **Superiority Complex, and Arrogance** ) ప్రదర్శించ కూడదు ! పేచీలు ( **Ego Clashes** ) వస్తాయి !

### (81) బలిమి లేని వేళ  పంతంబు సెల్లదు !

తనకు బలం లేని సమయంలో – పంతాలు, పట్టింపులకు పోరాదు. పోయినా, తన మాట చెల్లదు; తన ఆట సాగదు !

బలం రెండు రకాలు – స్వంత బలం, స్థాన బలం !

ఉదా: జ్వరం, విరేచనాలు మొ. జబ్బులు తగ్గిన వెంటనే, సహజంగానే స్వంత బలం కొంత తగ్గుతుంది. ఆ సమయంలో, కొన్ని బరువు పనులను, కొంత కాలం పాటు నిలిపివెయ్యాలి. విశ్రాంతి ( **Rest** ) తీసుకోవలసిన సమయంలో – శ్రమ ( **Strain** ) పనికిరాదు !

ఉదా: మొసలి, నీటిలో ఉండగా – ఏనుగును కూడ లెక్క జేయనంత బలం! కాని, అదే మొసలి, ఒడ్డుకి వచ్చాక – కుక్కను చూసినా తగ్గి ఉండాల్సిందే ! ఎందుకంటే – మొసలికి నేల అనేది, స్థానబలం లేని చోటు కదా మరి !

### (82) నిలువ దగని చోట  నిలువ నిందలు వచ్చు !

ఉండరాని చోట ఉంటే – పడరాని మాటలే పడాల్సి వస్తుంది !

ఉదా: తాటి చెట్టు క్రింద నిలబడి, పాలు త్రాగుతున్నా గాని, తాటి–కల్లు త్రాగుతున్నారనే భావిస్తారు ! మంచి పిల్లలు గనుక – చెడు పనులు చేసేవారితో కలిసి తిరుగుతూంటే – వీరినీ చెడ్డవారిగానే భావిస్తారు !

ఉదా: పెళ్ళి అయిన స్త్రీలు – భర్తకు దూరంగా, ఎక్కువ కాలం తమ పుట్టినింట్లోనే ఉన్నా గానీ – వారిని తేలికగానే చూస్తారు ! చుట్టాల ఇంట్లో గాని, బయట విడిగా గానీ ఉంటే – ఇంక చెప్పేదేముంది ?!

### (83) నెలవు దప్పు చోట  నేర్పరి కొఱ గాడు !

ఎవరి స్థానంలో వాళ్ళుండాలి ! చోటు గాని చోట ఉంటే – ఎంత తెలివీ పనికి రాదు ! ఎంత నేర్పు ఉన్నా గానీ రాణించరు !

ఉదా: కొంగల మధ్యనున్న హంస వలె ! పామరుల సభలోనున్న పండిత ప్రకాండుని వలె ! మూర్ఖుల గుంపులోనున్న వివేకి వలె !

ఉదా: పడవ ప్రయాణంలో ప్రమాదం ఎదురైనప్పుడు – ' ఈత వచ్చా, రాదా?' అన్నదే ముఖ్యం గాని – ఎంత పాండిత్యం ఉంది; ఎంత బాగా సంగీతం పాడతాడు; ఎంత బాగా కుస్తీ పడతాడు ! – అన్నవి ఆ చోట ఎందుకూ పనికి రావు !

' స్థానభ్రష్టా న శోభన్తే – దన్తాః కేశాః నఖాః నరాః !' అంటే – పళ్ళు (దంతాలు), వెంట్రుకలు, గోళ్ళు, మనుష్యులు తమ తమ స్థానాలనుంచి ఊడితే ( జరిగితే ) శోభించవు ! ఇదివరకు ఎంతో అందంగా ఉన్నాయని మెచ్చుకున్న వారే ఇప్పుడు ఈసడించుకుంటారు !

### (84) ఎగరవేయు పండు ఎందాక నిల్చురా !

పైకి ఎగరవేసే పండు, బంతి మొ. వస్తువులు – ఎంతసేపు పైనే ఉంటాయి ?! కొంత సేపటికి క్రింద పడవలసిందే గదా ! లేని భేషజాలకు పోతే – ఆ స్థాయిలో ఎక్కువ సేపు నిలబడటం – చాలా కష్టం !

ఉదా: పేదవారు, మధ్య తరగతివారు – తాము ధనవంతులవలె కనబడాలని, డబ్బుని ధారాళంగా ఖర్చు పెడుతూంటే – ఎంత కాలమని నిభాయించ గలరు?! అలాగే – చదువులో గట్టిదనం ( **Real Standard** ) లేకపోతే – పండిత వేషం వేసుకుని – ఎంత కాలమని చలాయించ గలరు ఎవరైనా !

### (85) చేతగాని పనుల జేయ రాదు !

తన శక్తికి మించిన పనులను చేయ బోరాదు ! అవసరమైతే, ఇతరుల సహకారంతో చేయవచ్చు; చేయించవచ్చు ! ఎత్త లేని బరువును ఎత్తబోయి, క్రింద పడినా, పడవేసినా కూడ వస్తు నష్టం జరుగుతుంది; తిట్లు, చీవాట్లు తప్పవు !

ఉదా: నడుము నొప్పి, మెడ నెప్పి ఉన్నవారు – బరువులను ఎత్తేందుకు – తప్పనిసరి అయితే తప్ప – మొదటగా తయారు కాకూడదు. అలా చేస్తే – ఎక్కువ కాలం, ఎక్కువ బాధను భరిస్తూ – తక్కువ పనులను మాత్రమే చేయగల స్థితి వస్తుంది !

### (86) సొమ్ము లేని చోట శోధ యేల ?!

ధనమైనా గాని, ఏ వస్తువైనా గాని – అది లేని చోట వెదికితే – ఏం దొరుకుతుంది?! పోయిన వస్తువును కూడ – అది ‘ పడ్డ చోటే వెతుక్కోవాలి!’ అని సూక్తి !

ఉదా: ఆడ పిల్లల కాలి అందెలు – ఇంట్లో గనుక పడిపోయి ఉంటే – బడిలో ఎంత వెదికినా దొరుకుతాయా !

అలాగే – ‘ మన ఏవ మనుష్యాణాం కారణం సుఖ–దుఃఖయోః !’ అని సూక్తి. అంటే – సుఖమైనా, దుఃఖమైనా మనస్సులోనే కలుగుతాయి ! సుఖం, ఆనందం కోసం ప్రతివారూ ప్రయత్నిస్తూంటారు. అవి బయట ఎక్కడో లేవు. మనసులోనే ఒక గదిలో ఉన్నాయి ! సంతృప్తి చెందటం, స్థిమితంగా ఉండటం – అనే తలుపులు తెరిస్తే – ఆనందం అనే సుగంధం మనసు అంతటా వ్యాపిస్తుంది!

మన లోపలే దొరికే ఆనందం కోసం, – బాహ్య వస్తువులలోను, బాహ్య పరిస్థితులలోను – బయట వెదికితే దొరుకుతుందా, మన పిచ్చి గాని !

### (87) భాండ శుద్ధి లేని పాక మేల !

ఆహారం వండుకోవాలంటే – వంట పదార్థాలే కాదు, వంట పాత్రలు కూడ – శుచిగా, శుభ్రంగా ఉండాలి ! ఏది శుచిగా లేకపోయినా గాని, వంట విషతుల్య మవుతుంది !

మనవారు పూర్వకాలం నుంచీ పాటిస్తున్న అంట్లూ–ఎంగిళ్ళూ, మడి–దడి, గృహస్థ–బహిష్ఠ ధర్మాలు, మొ. ఆచార సంప్రదాయాలు అన్నీ కూడ, – అత్యుత్తమ స్థాయి శుచీ శుభ్రాలే ( **High Level of Hygiene** ) ! ఎంత మేరకు పాటిస్తే – మనకే అంత మంచిది ! మనం పాటించలేక పోయినా – కనీసం విమర్శించ కూడదు !

పూజలూ, ప్రార్థనలు మొ. వాటితో భగవత్ ప్రసాదం పొందాలన్నా కూడ – మనసు అనే పాత్ర అవసరం ! అందుకే పాత్రశుద్ధి, అంటే – చిత్తశుద్ధి ఉండాలని మనవారు చెప్పారు !

### (88) విడువ వలయు నూరు విశ్రాంతి గాకున్న !

తను ఉన్న ఊరు – విశ్రాంతిగా, మనశ్శాంతికరంగా లేకుంటే – ఆ ఊరిని వదిలి పెట్టాలి ! వాతావరణం, పరిసరాలను మార్చుకుంటే – మనశ్శాంతి కొంత మెరుగ్గా ఉంటుంది గదా !

ఇంకొక అర్థం: మనశ్శాంతికి భంగం కలిగేటట్లయితే –నూరు పనులనైనా సరే విడిచి పెట్టాలి ! అవసరాన్ని మించి తెచ్చి పెట్టుకున్న, శ్రమకరమైన అధిక కల్పాలను తగ్గించుకుని – సుఖ సంతోషాలతో జీవించండని ఈ ఉపదేశం!

ఎవరైతే శ్రమజీవులో – అవసరాన్ని మించి ఎక్కువగా కష్ట పడుతూంటారో – వారికే ఈ సూక్తి అవసరం, ఉపయోగం !

### (89) కొయ్య దుంగ దెచ్చి చెక్కితే గుణి యవదె ?!

చెట్టు మొద్దును తెచ్చి, చక్కగా చెక్కితే – కోరిన రూపం ధరించదా?!

కల్లా కపటం లేని – స్వచ్ఛమైన మల్లెపూవులవంటి మనస్సు కలిగిన – బాల బాలికలను, సరిగా తీర్చి దిద్దితే – వారు చక్కని వ్యక్తిత్వ సౌందర్యం గలవారు తప్పక అవుతారు ! తమ తల్లిదండ్రులకూ, భారత దేశమాతకూ గర్వ కారణ మవుతారు !

### (90) పచ్చి కాయ దెచ్చి పడవేయ ఫలమౌనె ?!

పచ్చి పిందెలని తెచ్చి, పండవేయాలని చూస్తే – అవి పండుతాయా, క్షీణించి పోతాయి గాని !

మామిడి, సపోటా ఏవైనా గాని – పిందెలను దోర కాయలుగా మారనివ్వాలి; వాటిని ముదర నివ్వాలి; అప్పుడు పండవేస్తే – తియ్యగా, ఆరోగ్యకరంగా పండటం ఖాయం ! ఆత్రుత పడకుండా, తగిన సమయాన్ని యివ్వాలి ! ( **We should allow reasonable Time** ! )

ఉదా: వేసవికాలం సెలవలలో – ఆత్రం పడి, రాబోయే పై తరగతి పుస్తకాలను చదివిస్తూంటారు ! అంతకన్న, అయిపోయిన తరగతి వరకు – ముఖ్యమైన సబ్జెక్టులలో సందేహాలు తీరిపోయేటట్లుగా – పునశ్చరణ, అభ్యాసం ( **Revision & Drilling** ) చేయిస్తే, భవిష్యత్తులో – తత్తరపాటు లేకుండా, ఎంతో హాయిగా ( **Tension-free** ) గా చదువుకోగలరు; – ప్రతిభావంతులైన విద్యార్థులు ( **Merit Students** ) గా, అవగలరు గదా !

### (91) భానుడుండ దివ్వె బట్టి వెదకు రీతి !

సూర్య ప్రకాశం ఉన్న సమయంలో – దీపమును, కాగడాను ( **Torch** ) ని వెలిగించి, చేతబట్టి వెదకబూనటం –ఎంత హాస్యాస్పదంగా, నగుబాటుగా ఉంటుంది !

మన మేలు మిక్కిలిగా కోరేవారు – తాతా మామ్మలు, అమ్మా నాన్నలు, గురువులు ఉపాధ్యాయులు ! వీరి మమత, విజ్ఞానం, వివేకం, లోకానుభవం – మొ. వాటితో కూడిన ఆదేశాలు, ఉపదేశాలు – సూర్యకాంతి వంటివి ! తక్కినవారి సలహాలు, సూచనలు – రంగు రంగుల దీపాల వంటివి ! సూర్యకాంతి ఉండగా, దీపాలవంక చూడటం ఏం తెలివి తేటలు ?!

అలాగే – మన భారతీయ సంస్కృతి, ఋషుల వాఙ్మయం, ప్రాచీన సాహిత్యం – పగటి వెలుగు లాంటివి ! ఎట్టి ఖర్చు, శ్రమ, పక్షపాతం లేకుండానే – ప్రపంచంలోని అందరికీ సమానంగా అందేవిధంగా వెదజల్ల బడ్డాయి ! ‘ సర్వే జనాః సుఖినో భవన్తు !’ అనే ఆదర్శాన్ని త్రికరణశుద్ధిగా నమ్మి, ఆచరించిన జాతి మనది ! శాంతి, సౌభాగ్యాలతో అలరారే జీవన విధానం కోసం – మనం ఏ ఇతర జాతి, సంస్కృతుల వైపు చూడనక్కర లేదు !

### (92) వెన్న చేతబట్టి వివరంబు దెలియక –

### (93) ఘృతము గోరునట్టి యతని భంగి !

వెన్నను కరగబెడితే నెయ్యి వస్తుంది. ఆ విషయం తెలియక, ‘ అయ్యో ! నా దగ్గర వెన్న మాత్రమే ఉంది. నాకేమో నెయ్యి కావాలి. ఎట్లాగబ్బా !’ అని నేతి కోసం అప్పుకై పొరుగింటికి పోవటం ఎంత అవివేకం ?!

ఉదా: మన దేశంలో సమృద్ధిగా దొరికే ఇనప ఖనిజాన్ని విదేశాలకు ఎగుమతి చేసి, దానితో తయారు చేసిన ఇనపచువ్వలు, పలకలను మళ్ళీ దిగుమతి చేసుకోవటం అనేది – వెన్నను చౌకగా యిచ్చి, నెయ్యిని ఎక్కువ వెలకు కొనుక్కోవటం వంటిదే !

మనకు కావాల్సిన సమస్త విషయాలు – వైయక్తిక, కౌటుంబిక, సామాజిక, జాతీయ, మానవీయ, ధార్మిక, ఆధ్యాత్మిక, మోక్షప్రద – ( **Personality, Family, Social, National, Human, Religious, Philosophical,**

**Salvation** ) – మొ. విషయాలన్నీ, వేదవ్యాస మహర్షి విరచితమైన – ‘ పంచమ వేదము ’ అయినట్టిన్నీ, మరియు ‘భగవద్గీత’కు పుట్టినిల్లు అయినట్టిన్నీ – ‘ మహాభారతం ’ లోనే ఉన్నాయి ! ఇందులో లేని అంశాలు, ఉపదేశాలు ఇంకెక్కడా లేవు ! ఈ మహాభారతం అనే వెన్న మన దగ్గరనే ఉంది ! ఇంకేం కావాలి !

కాబట్టి, పాశ్చాత్య సంస్కృతి, సాహిత్యాలవైపు మార్గదర్శనం కోసం చూడటం – మనకు ఎంత అనవసరమో గ్రహించుదాం !

## (94) ముక్కు వంక జూచి ముకురంబు దూరుట !

అద్దంలో ( సమతల దర్పణంలో, **Plane Mirror** ) లో, తన ముక్కు వంకరగా కనిపిస్తోంటే – దానికై అద్దాన్ని తప్పు పడితే ఏం లాభం ?!

ముఖ ప్రతిబింబంపై మచ్చలు కనిపిస్తే – అవి అద్దం మీదివైనా కావచ్చు; ముఖం మీదివైనా కావచ్చు ! అద్దాన్ని శుభ్రం చేసినా కూడ ఇంకా కనిపిస్తూంటే – అప్పుడు మన ముఖాన్నే శుభ్రం చేసుకోవాల్సి ఉంటుంది !

నిజంగా మన మేలు కోరేవారు ఎవరంటే – అద్దం వలె, ఉన్నవి ఉన్నట్లుగా – మనలోని లోపాలను ఎత్తి చూపేవారే !

ఉపాధ్యాయులు అద్దం వంటివారే ! పరీక్షలలో వారు ఇచ్చే మార్కులు – మన కృషికి, మన నిజమైన స్థాయికి ( **Real Standard** ) కి తగినట్లుగా ఉంటాయే తప్ప – మన ఆశలకి, ఊహలకి తగినట్లుగా కాదు. మన కలలు సాకారం అవ్వాలంటే – ప్రణాళిక, కృషి, దీక్ష అవసరం !

## (95) పంట చేను విడిచి పరిగె యేరిన యట్లు !

బాగా పండిన వరి చేలను వదిలిపెట్టి, అక్కడక్కడా రాలిన ధాన్యపు గింజలను ఏరుకోవటం ఎంత తెలివి తక్కువ ?!

ప్రామాణిక గ్రంథాలు ( **Standard Texts and Literary Works** ), – పైన 58, 59వ సూక్తులలో చెప్పినట్టి ‘ మంచి పుస్తకాలు ’ – వరి చేల వంటివి ! వార్తా పత్రికలు, టి.వి., ఇంటర్ నెట్, మ్యాగజైన్సు, మొ. వాటిలో వచ్చే – వ్యాపారాత్మక సలహాలు, ఉబుసుపోక ఊసులు ( **Commercial Tips and**

**Time-pass Gossips** ) – ఇవి రాలిన గింజల వంటివి ! వాటిని వదిలి, వీటి వెంట పరుగులు పెట్టటం కూడ – అంతే తెలివి తక్కువ !

**(96) పరు లెన్నగ బ్రతుకువాడు ప్రాజ్ఞుడు వేమా !**

ఇతరులు మెచ్చుకునేటట్లు బ్రతికేవారే బుద్ధిమంతులు !

నలుగురూ – అంటే, పండితులు – పామరులు, ధనికులు – పేదలు మొ. అన్ని రకాల జనమూ – మెచ్చుకుంటేనే, అభిమానిస్తేనే – అది గొప్ప జీవితానికి గుర్తింపు !

విశేషంగా దాన–ధర్మాలు చేసేవారిని – సామాన్య జనులు మెచ్చుకుంటారు ! దానబుద్ధి ( త్యాగశీలం ) పెరగాలంటే – లోభమును, స్వార్థబుద్ధిని తగ్గించుకుంటూ ఉండాలి ! ధర్మబుద్ధి పెరగాలంటే మాత్రం – మొట్ట మొదటగా ఉండవలసిన లక్షణాలు – భూతదయ, పరోపకారములే !

**(97) పరుల కుపకరించి ప్రబలు వేమ !**

పరులకు ఉపకారం చేసినవారు వృద్ధిలోకి వస్తారు ! మనకు కలిగినంతలోనే – నలుగురికీ సహాయం చేసే ఉదార బుద్ధితో ఉంటే – లోకులూ మెచ్చుకుంటారు; దేవుడూ అనుగ్రహిస్తాడు !

' సకల శాస్త్రాల సారమూ రెండు ముక్కల్లో చెబుతాను ' అని, వేదవ్యాస మహర్షి చెప్పిన దేమిటంటే – ' పరోపకారః పుణ్యాయ, పాపాయ పరపీడనం!' అని. అంటే అర్థం: ' పరోపకారం వల్ల పుణ్యం వస్తుంది ; పరపీడన వల్ల, అనగా, ఇతరుల మనస్సుకు కష్టం కలిగించటం వల్ల, పాపం వస్తుంది ' అని!

**(98) దాన మీని వాడు ధన్యుండు కాడయా !**

దానము ఇవ్వనివాడు ధన్యుడు కాలేడు. ' ముందు బాగా సంపాదించాక, అప్పుడు దాన ధర్మాల సంగతి చూసుకోవచ్చులే !' అనే దృక్పథం సరి కాదు ! ఆకలి వేసినపుడు – వంట పూర్తి అయ్యే దాక ఆగకుండా – ఉన్నదేదో వేసుకుని తింటాము గదా ! అలాగే, వచ్చే సంపాదన లోంచే – ఎంతో కొంత యివ్వటం గొప్ప సుగుణం.

' నా నికర ఆదాయంలోంచి ప్రతి నెలా కొంత శాతం – దానధర్మాల క్రింద

కేటాయిస్తాను, వినియోగిస్తాను !' అనే నియమం ప్రతి భారతీయుడూ పెట్టుకుంటే, దేశ ప్రజల జీవన స్థితి గతులు ఎంతగా బాగుపడతాయి !

**(99) ఇందు నీని వాని కెందును గలుగదు !**

ఈ లోకంలో ఎవరికీ ఏమీ యివ్వని వారికి – ఏ లోకంలోనూ ఏమీ దొరకదు!

' చేసుకున్నంత వారికి చేసుకున్నంత మహదేవ !' అని సామెత ! మన బ్యాంకు అకౌంటులో – మనం జమ చేస్తూ వచ్చిన మొత్తాలను బట్టే – మనం తీసుకోగల మొత్తం ఆధారపడి ఉంటుంది గదా ! అలాగే, దేవుని బ్యాంకు లోని మన అకౌంటులో – మనం జమ చేసుకునే పుణ్య పాపాలను బట్టే – మనకు లభించే సుఖ–దుఃఖాలు ఉంటాయి !

**(100) మరువంగా వలదు మేలు మహిలో వేమా !**

ఈ భూమి మీద–ఎవరైనా మనకు చేసిన మేలును – మనం మరిచి పోకూడదు!

' కృతజ్ఞత ' – అంటే, ఇతరులు తనకు చేసిన మేలును గుర్తుంచుకోవటం; వారికి ఏవిధంగా తిరిగి సహాయం చేయగలమా అనే దృష్టితో ఉండటం ! ఈ కృతజ్ఞత అనేది చాలా గొప్ప సుగుణం.

అయితే, తాను ఇతరులకు చేసిన మేలును మరచిపోకుండా, మాటి మాటికీ తలచుకోవటం, గుర్తు చేయటం – అనేది పనికిరాదు !

' కృతజ్ఞత ' కు సరిగ్గా వ్యతిరేకమైనది – ' కృతఘ్నత ' – అంటే, ఇతరులు తనకు చేసిన మేలును మరచిపోవటం; ప్రత్యుపకారం అనే ఊసే ఎత్తక పోవటం! ఈ కృతఘ్నత అనేది చాలా నీచమైన దుర్గుణం.

**(101) జ్ఞాన మమరి యుండ సత్య ముండు !**

జ్ఞానం కలిగినవారిలో సత్యం కూడా ఉంటుంది.

శాశ్వత మైనదే, మార్పు లేనిదే – ' సత్యం ' ! అట్టి సత్యాన్ని తెలుసుకోవటమే నిజమైన ' జ్ఞానం ' ! జ్ఞానం ఉన్నవారిలో – నైతిక సాంస్కృతిక విలువలు, మనస్సంస్కారం, శాంతి, ఆనందం ఉంటాయి !

' జ్ఞానం ' వేరు – ' విజ్ఞానం ' వేరు ! విజ్ఞానం అంటే – బాహ్యంగా ఉన్న విషయాలకు సంబంధించిన పరిజ్ఞానం. ఎంతటి విజ్ఞాన శాస్త్రవేత్తలకైనా –

విడిగా జ్ఞానసాధన చేయనిదే – జ్ఞానం కలగదు ! అంటే, నైతిక, సాంస్కృతిక విలువలు, మనస్సంస్కారం–వారికి (విజ్ఞానశాస్త్రవేత్తలకు) ఉండి తీరాలని లేదు.

విజ్ఞానం అనేది కాలేజీలలో చదివే సైన్సు, ఇతర శాస్త్రాల వల్ల వస్తుంది. జ్ఞానమేమో – పురాణాది ఆర్ష సాహిత్యం ( మహర్షుల గ్రంథాల ) వల్ల వస్తుంది. కాబట్టి, జ్ఞాన– విజ్ఞానాలు రెండూ ఉన్నవారి వలన – తమకు, దేశానికి, ప్రజలకు బాగా మేలు జరుగుతుంది !

## (102) దాన ధర్మములును దయయు సత్యము నీతి !

భారతీయులకు సహజంగా ఉండే ( ఉండవలసిన ) సుగుణాలు – దానం, ధర్మం, భూతదయ, సత్యం, నీతిగా నిజాయతీగా బ్రతకటం ! ' భౌతిక సుఖాలకన్న ఆధ్యాత్మిక సంపదే మిన్న !' – అనే దృక్పథంతో సంతృప్తిగా, సుఖశాంతులతో జీవించటం !

దానం అంటే – ఉన్నవారు లేనివారికి చేసే సహాయం ! దేవుడు కూడా – లేనివారికి సహాయం చేస్తాండమని – మనకు కొంచెం అధికంగా యిస్తూంటాడు ! మనం గనుక – ఇతరులకు దానం, సహాయం చేయకపోతే – దేవునికి విశ్వాస ఘాతకం ( నమ్మక ద్రోహం ) చేసినట్లే ! ఆయన భవిష్యత్తులో మనకు మిగులు ( **Surplus** ) అనేది లేకుండా చేస్తాడు !

ధర్మం అంటే – ఏది పరులకు హితమును ( మేలును ) కలిగిస్తుందో, అదే ధర్మం ! ' ఇతరులు ఏ పని చేస్తే, నీ మనసుకు కష్టం కలుగుతుందో – ఆ పనిని నీవు ఇతరులకు చేయకుండా ఉండటమే – అన్ని ధర్మాలలోకీ గొప్ప ధర్మం ! ' మహాభారతంలోని ఈ వ్యాసవచనం – ధర్మ స్వరూపాన్ని తెలియజేసే సూక్ష్మ సూత్రం !

## (103) కులము కన్న మిగుల గుణమె ప్రధానంబు !

ఒక వ్యక్తి ఏ కులంలో జన్మించాడు అనేదానికన్న, అతడు ఎట్టి గుణాలు కలవాడన్నదే ప్రధానం ! ఉదా: ధార్మికుల యింట్లో పుట్టి, అధర్మం చేసేవారి కన్న – లౌకికుల యింట్లో పుట్టి, ధర్మంగా ఉండేవారు – నిజంగా గొప్పవారే!

ఒక విద్యార్థి ఏ కాలేజీలో చదివాడు అనేదానికన్న, అతడు విద్యను ఎంత క్షుణ్ణంగా, అర్థవంతంగా నేర్చుకున్నాడు అన్నదే ముఖ్యం ! అతని ప్రతిభ అంతా

– అతని కృషి మీద, చదువు యొక్క చక్కని తీరు ( **Quality of Study**) మీదనే ఆధారపడి ఉంటుంది !

జాతి, మతం, కులం, వంశం అనేవి కూడా – అనుకూల వాతావరణాన్ని (**Favourable Environment** ) ని అందించేవే గాని – అవియే సరాసరి గొప్పదనాన్ని యివ్వలేవు! వ్యక్తిత్వ వికాసం ( **Personality Development)** కావాలంటే – శ్రద్ధ, కృషి, పట్టుదల వంటి సుగుణాలు (**Good Qualities**) కావాల్సిందే !

ఉదా: ఒక డాక్టరుగారి పిల్లలకు మెడిసిన్ చదవటానికి కావలసిన అనుకూల వాతావరణం, మిగిలిన పిల్లల కన్న ఎక్కువగా ఉంటుంది గదా ! అలాగే, లాయరుగారి పిల్లలూ, ఉపాధ్యాయుల పిల్లలూ కూడా ఆయా విషయాల్లో రాణించే అవకాశం ఎక్కువే ! కాని, వీరు శ్రద్ధగా చదువు నేర్చుకోకపోతే, మిగిలిన పిల్లలలో ఎక్కువ కృషి, దీక్ష కలిగిన వారెవరైనా, వీరికంటె రాణిస్తారు గదా !

**(104) కానివాని తోటి కలసి వర్తించెనా –**
**(105) హాని వచ్చు నెంత వాని కైన !**

చెడు బుద్ధులు, చెడు అలవాట్లు గలవారితో – స్నేహం చేసినా, వారితో కలిసి మెలిసి తిరిగినా – ఎంత మంచివారికైనా గాని – చెడ్డ పేరు, నష్టం, హాని కలుగుతాయి !

ఉదా: ఇనుముతో స్నేహం చేసిన పాపానికి – ఇనప చువ్వతోబాటు అగ్నికి కూడ – సమ్మెట పోట్లు తప్పవు గదా ! దీనినే ' సహవాస దోషం ' అంటారు! అందుకే, సహ–విద్యార్థులతో సావాసం చేయాలంటే – తన అభిరుచులకు, ఆదర్శాలకు తగిన మంచి గుణాలు కలిగినవారినే ఎంచుకుని, వారితోనే బలమైన స్నేహం చేయాలి !

**(106) ఇరుగు పొరుగువారి కెనయు సంపద జూచి –**
**(107) తమకు లేదటన్న ధర్మ మేమి ?!**

మనకు తెలిసినవారికి ఉన్న సంపదలను, భోగభాగ్యాలను చూసి – ' వారికి ఉన్నదే ' అని అసూయ పడితే ఏం లాభం? – ' మనకు లేదే ' అని బాధ పడటం ఏం ధర్మం ?

ఎవరి అభివృద్ధికి – వారి వారి భౌతిక, మానసిక, దైవిక కృషియే కారణం ! కృషి చేసే విషయంలో – మనకన్న ఎక్కువ కృషి చేస్తున్న వారితో పోల్చుకోవాలి, పోటీ పడాలి ! అప్పుడు మనకు ఉన్న కృషిలోపం మొ. బలహీనతలు (**Deficiencies and Weaknesses)** తెలుస్తాయి ! వాటిని అధిగమిస్తున్నకొద్దీ, ఉన్నత శిఖరాలు అందుకుంటాం !

ఫలాలు, భోగాల విషయంలో మాత్రం – మనకన్న తక్కువ స్థాయిలోనున్న వారితో పోల్చుకోవాలి ! అప్పుడు – వారికి లేని, మనకు ఉన్న – అదృష్టఫల విషయాలు ( **Plus Points and Strengths** ) కనిపిస్తాయి ! అప్పుడు అసూయ కలగదు. మనస్తాపం, అశాంతి అసలే ఉండవు ! దేవునికి ధన్యవాదాలు అర్పిస్తూ – శాంతి, ఆనందాలతో జీవించ గలం !

ఉదా: ' నా కళ్ళు వాళ్ళ కళ్ళంత అందంగా లేవు ' అని బాధ పడుతూ కూర్చోకుండా – కళ్ళు అసలే కనిపించని గ్రుడ్డివారితోనో, కంటి బాధలు ఉన్నవారితోనో తలచుకుని, పోల్చుకుని – ' నా కళ్ళు ఆరోగ్యంగా ఉన్నాయి; నేను ఈ ప్రకృతిలోని అందాలన్నిటినీ ఆస్వాదించ గలుగుతున్నందులకు, నేను అదృష్టవంతురాలిని; దేవునికి ధన్యవాదాలు !' – అని భావించేవారి ఆనందానికి అంతరాయం ఉంటుందా ?!

### (108) మచ్చరమే తన్ను జెరుచు మహిలో వేమా !

మచ్చరము అంటే – మాత్సర్యం, అంటే అసూయ. ఇతరులు తనకంటె ఎక్కువ – ధనధాన్యాలను గాని, భోగభాగ్యాలను గాని, సుఖసంతోషాలను గాని – పొందుతూంటే, చూసి ఓర్వలేనితనం ! ఇది అరిషడ్వర్గంలోని ఒక దుర్గుణం !

అసూయ వల్ల, మనిషి నిలువెల్ల ఉడికి పోతూంటాడు. బుద్ధి సరిగా పనిచేయదు. అందువల్ల, తన పనులే చెడిపోతాయి ! తను ఇంకా తక్కువ స్థాయిలోనికి పడిపోతాడు !

### (109) ఆడి తప్పువార లభిమాన హీనులు !

ఆడి, తప్పటం అంటే – మాట యిచ్చి, నెరవేర్చక పోవటం ! వాగ్దాన భంగం చేసేవారు అంటే, ఇచ్చిన మాట తప్పేవారు – ఆత్మాభిమానం లేనివారి క్రిందే లెక్క ! ఆత్మగౌరవం ( **Self Respect** ) లేనివారిని, యితరులు మటుకు ఏం గౌరవిస్తారు ?!

మాట యిచ్చే ముందే – ఉచితానుచితాలు, ధర్మాధర్మాలు, సాధ్యాసాధ్యాలు – ఆలోచించుకోవాలి ! ఒకసారి మాట యిచ్చాక, త్రికరణశుద్ధిగా ( మనసా, వాచా, కర్మణా ) పాటించాలి ! ఉదా: రామాంజనేయ యుద్ధం (యయాతి చరిత్ర ) , కృష్ణార్జున యుద్ధం ( గయోపాఖ్యానం ) – ఈ ధర్మసూక్ష్మం మీదనే జరిగాయి ! ఆశ పెట్టి, ' లేదు పొమ్మనే ' వారిని – లోకం హీనంగా చూస్తుంది!

**(110) పరు నిందం జేయువాడు భ్రష్టుడు వేమా !**

ఇతరులను నిందించే గుణం గలవారు ఈ లోకం దృష్టిలో అల్పులు, హీనులు, భ్రష్టులు ! జనులు వీరిని తేలికగా చూస్తారు; గౌరవం యివ్వరు.

ఆత్మ శ్లాఘ, పర నింద – ఈ రెండూ పనికిరావు ! తనను తాను పొగడ రాదు; ఇతరులను తెగడ రాదు – అంటే, నిందించ రాదు. ఒక వ్యక్తి యొక్క లోపాలను ఎత్తి చూపాలంటే – ఇంకెవరూ లేనప్పుడు ఆ వ్యక్తితో మాత్రమే చెప్పాలి. అదే ఒకరి మంచిని ప్రకటించాలంటే – వారి సమక్షంలో చేయటం మంచిదే; కాని, వారి పరోక్షంలో చేసిన ప్రశంస ఇంకా ప్రభావశీల మైనది !

అలాగే, కొంతమంది ఒక బృందంగా ఏర్పడి – విజయం సాధించినప్పుడు, ఇతరుల కృషికి గుర్తింపు నివ్వటం – ఓటమి పొందినప్పుడు, తాము నైతిక బాధ్యతను వహించటం – ఈ రెండూ కూడ మంచి నాయకత్వ లక్షణాలు ! ఇవి ఉన్నవారు – ఉద్యోగ, వ్యాపార, సామాజిక వర్గాలలో, స్వచ్ఛంద సేవాసంస్థా కార్య కలాపాలలో – మంచి అభివృద్ధి లోనికి వస్తారు !

ఈ రోజులలో – తమను గురించి తాము చెప్పుకోకపోతే, బయటివారు చెబుతారా ?! కాబట్టి – అతి గొప్పలకు పోకుండా, ఆత్మ విశ్వాసంతో – తమ కృషి గురించి, తాము సాధించిన ఫలితాలను గురించి, – తాము చెప్పుకోవటం తప్పు కాదు !

**(111) తన మది కపటము విడచిన –**
**(112) తన కెవ్వడు కపటి లేడు ధరలో వేమా !**

తన మనస్సులో కపటాన్ని – మోసపు బుద్ధిని – వదిలిపెడితే, ప్రపంచంలో ఎవ్వరూ కూడ, తనపట్ల కపటంగా ఉండరు !

ఋజు వర్తనులు – అంటే నిష్కపటంగా ఉండేవారు – అందరితో హాయిగా

కలిసిపోయి, నిర్మలంగా, ప్రశాంతంగా ఉండగలరు ! వారిని – శత్రువులు గూడ లోలోపల గౌరవిస్తారు !

మన మహర్షులు, తాపసులు, బుద్ధుడు, జినుడు, శంకరాచార్య, రామానుజాచార్య, మధ్వాచార్య, రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, రమణ మహర్షి, గాంధీ – వంటి మహాత్ములు అనేకులు – సాత్త్వికులు, సత్యాత్ములు, అహింసావాదులు, లోకసంగ్రహకర్ములు, కాపట్య రహితులే ! మన భారతీయులకు నిత్య ప్రాతః స్మరణీయులే !

ఇతర దేశాలలో కూడా చూసినట్లైతే – ఏసు క్రీస్తు, మహమ్మద్ ప్రవక్త, మొ. అనేకమంది మహా ప్రవక్తలు, శక–పురుషులు కూడ ఇట్టివారే !

### (113) శాంత బుద్ధి నుండ  సమకూరు సుఖంబు !

శాంతిగా ఉంటేనే సుఖం కలుగుతుంది. ‘ శాంతము లేక సౌఖ్యము లేదు ! ’ అని త్యాగరాజ కీర్తన ! అసలు – ‘ సుఖం ’ అంటే – శాంతిగా ఉండటమే !

మరి, ‘ శాంతి ’ అంటే ? అది ఒక మానసిక స్థితి. లోభ–మోహాలు, రాగ–ద్వేషాలు, కోరికలు–భయాలు, ఆవేశ–కావేషాలు, ఆరాట–పోరాటాలు, ఉరుకులు–పరుగులు, విసుగు–అలసట – ఇవేమీ లేని ఒక ఆనందమయ స్థితి !

మన భారతీయ మహర్షుల గ్రంథ రాశి ( ఆర్ష సాహిత్యం ) అంతా కూడ – ‘శాంతి–విద్య’యే ! వేదాంతములైన ఉపనిషత్తులు, యోగవాసిష్ఠం, రామాయణం, భారతం, భాగవతం, భగవద్గీత, పద్దెనిమిది పురాణాలు – ఇట్లా ఏ గ్రంథం చూసినా – శాంతిని ఎవరు ఎట్లా పొందవచ్చునో తెలిపేదే!

### (114) పురుష డబలుడైన  బుత్రు లబలులురా !

పురుషులు బలహీనులుగా ఉంటే, వారి పిల్లలు కూడ బలహీనులయ్యే అవకాశాలే ఎక్కువ ! కాబట్టి, బాలురు – విద్యార్థి దశలో ‘ బ్రహ్మచర్యము ’ను పాటించటం ద్వారా, బల సంచయం చేసుకోవాలి ! అంటే – బాలికలతో, సహ–విద్యార్థినులతో సాన్నిహిత్యం, అతి చనువు ( **Intimacy** ) పెంచుకోరాదు! అలా చేస్తే గనుక, సంపూర్ణంగా వికాసం చెందలేరు !

ఒక చెట్టు ' విరియ బూసింది ' అన్నా, ' విరగ కాసింది ' అన్నా – మంచి విత్తనం, మంచి నేల, మంచి పోషణ – ఈ మూడూ ముఖ్యమే ! అయినా గాని, ఆ చెట్టు యొక్క ఆంతరిక, మౌలిక బలం ( **Inner Intrinsic Strength** ) – విత్తనం యొక్క బలం ( **Seed - Quality** ) మీదనే ఆధారపడి యుంటుంది గదా !

అలాగే, పిల్లల అభివృద్ధి కూడ – తండ్రి మీద, తల్లి మీద, వారి పెంపకం మీద ( పెంచే విధానం, పోషణ ) – ఈ మూడింటి మీద ఆధారపడి ఉంటుంది! ' పోషణ ' అంటే – కేవలం శారీరకమైనదే కాదు; మానసిక పోషణ ఇంకా ముఖ్యం ! పిల్లలు, తమకు యిష్టమైన వాటితో బాటుగా – అమ్మా నాన్నలు పెట్టినవి తింటూ, వారు చెప్పినట్లు వింటూ, పాటిస్తూ ఉంటే గనుక – ఎంతో చక్కగా పెరుగుతారు. అంటే – బలంగా, ఆరోగ్యంగా, కళగా, అందంగా – పెరుగుతారు !

## (115) గుణవతి యగు యువతి గృహము చక్కగ నుండు !

సుగుణవంతురాలైన ఇల్లాలు ఉన్న ఇల్లు, ఆడ పిల్లలు ఉన్న ఇల్లు – ఎంతో కళగా, ఎంతో శోభగా ఉంటుంది !

ఆడపిల్లలు, స్త్రీలు – బంగారు నగలు ఉన్నా లేకపోయినా – సుగుణాలు ఉంటే, రాణిస్తారు! తమ ఇంటిని, ఇంట్లోనివారిని – చక్కగా తీర్చి దిద్దుకుంటారు!

స్త్రీలకు సహజంగానే ఆకర్షణీయమైన రూపం ఇచ్చాడు దేవుడు. అందుకే, సందర్భానికి తగినట్లుగా, సభ్యతగా ( **Decent and Dignified** ) గా అలంకరించుకోవటం ఆడవారి జన్మ హక్కు ! ఇంటితో పాటు ఒంటిని గూడ సముచితంగా, ఆరోగ్యంగా నిర్వహించుకోవటంలో – వారి కళాత్మక దృష్టి, ఉత్తమ అభిరుచులు వ్యక్తం అవుతాయి !

డబ్బు, బట్టలు, నగలు మొ. అన్నీ కూడ దేహానికి మాత్రం అందాన్ని పెంచగలవు. విద్య, వినయం మొ. సుగుణాలు వాక్కుకి, మనస్సుకి అందాన్నిస్తాయి ! దేహ–సౌందర్యం కన్న వాక్–సౌందర్యం, అంతకన్న మనఃసౌందర్యం – నలుగురిలో ఎక్కువ గుర్తింపునీ, మర్యాదనూ, గౌరవనీయతనూ ( **Appreciation and Respectfulness** ) తెస్తుంది !

## (116) ఇక్కడ తగు గాక   నక్కడ తగ దిట్లు !

ఇక్కడ ఎట్లా ఉన్నా చెల్లి పోతుంది. అక్కడ మాత్రం అట్లా కుదరదు !

ఆడ పిల్లల విషయంలో – వారికి పెళ్ళి అయ్యేవరకు, పుట్టింటితో మాత్రమే సంబంధం ఉంటుంది. పెళ్ళి అయ్యాక, అత్తవారింటితో అనుబంధమే ప్రధానమౌతుంది ! ఇక్కడ పుట్టినింటిలో, అమ్మ దగ్గర గారాబం వల్ల – గృహకృత్యాలు నేర్చుకోకుండా, పనులు చేసే అలవాటు పడకుండా పెరిగినా గాని – చెల్లిపోతుంది !

కాని, పెళ్ళి అయి, తానే ఒక ఇంటిని నడిపే బాధ్యత వచ్చాక, ఇక్కడ సాగినట్లు అక్కడ సాగదు గదా ! సాగించుకోవాలని ప్రయత్నిస్తే, ఇల్లంతా అస్తవ్యస్తమే ! అందుకే, చదువుతో బాటుగా – ఇంటిని నడిపే నైపుణ్యాలు – వంటా వార్పు, మొక్కల పెంపకం, గృహాలంకరణ, దుస్తుల సౌందర్యం, ఆరోగ్య రక్షణం, ఆదాయం–ఖర్చుల సమతౌల్యం ( **Prioritising and Budgeting** ) మొ. ఎన్నో అంశాలు – చదువు పూర్తి అయ్యే లోపలే నేర్చుకున్నవారు – జీవితంలో అన్ని విధాలా రాణిస్తారు !

తను, తన భర్త కలిసి ఉన్న ప్రదేశమే – ‘ తన యిల్లు ’ అవుతుంది ! ఆ యింటికి మహారాణి తానే ! తన యిల్లు అనే తోటలో ‘ పిల్లలు ’ అనే – పూల మొక్కలూ, పళ్ళ చెట్లూ – పుట్టుకు వస్తాయి !

ఆ పిల్లలను – ఆరోగ్యంగా, బలంగా, అందంగా, విజ్ఞానయుతులుగా, సచ్ఛీలవంతులుగా, మాతృభాషాభిమానులుగా, భారతీయ సంస్కృతీ వారసులుగా – పెంచటం అనేది తల్లిదండ్రులకు గొప్ప బాధ్యతే ! అదంత తేలిక కాదు ! అప్పుడు అక్కడ నేర్పటానికి అవసరమయ్యే నైపుణ్యాలను – ఇప్పుడే ఇక్కడే నేర్చుకున్నవారు – వివేకవంతులు గదా !

## (117) పరమ సాధ్వి చూడ   పరుల నంటదు సుమీ !

సాధ్వి అంటే – ‘ సాధు స్వభావం గలది ’ అని సామాన్యార్థం; ‘ పతివ్రత ’ అని ముఖ్యార్థం. ఉత్తమస్త్రీలు పరాయివారితో అనుచిత పరిచయం పెంచుకోరు! పరపురుషులకు చనువు యివ్వకుండా, తమ మర్యాదను (**Dignity**) ని కాపాడుకుంటారు !

సాధు స్వభావం అంటే – మర్యాదగా, మృదువుగా, హితంగా, మితంగా, సత్యంగా, కపటం లేకుండా, అవతలవారి మనస్సుకు కష్టం కలిగించకుండా – ప్రవర్తించే స్వభావం ! అంటే – **Pleasing and Helpful Attitude** !

ఇక, ‘ పతివ్రత ’ అంటే – తమ ఇద్దరి దేహాలూ ( భర్తదీ, తనదీ ) వేర్వేరుగా ఉన్నా, – ‘ మనసా, వాచా, కర్మణా ’ తామిద్దరం ఒకటే – అనే భావం గల భార్య ! భర్త చంద్రుడు ఆయితే భార్య వెన్నెల అన్నమాట ! గంగా, యమునా నదులు చెరోవైపు నుంచి వచ్చి, త్రివేణీ సంగమం ( ప్రయాగ ) లో కలిసి ప్రవహించటం మొదలు పెట్టాక – కాశీ దగ్గర ఉన్న ఆ మహానదిలో – ‘ ఇది గంగ, ఇది యమున ’ అని వేరుగా చూపలేనంతగా కలిసి పోవడం అన్న మాట ! భార్యాభర్తలలో ఈ స్ఫూర్తి ఏ ఒక్కరిలోనున్నా, జీవిత భాగస్వామి యొక్క గుణాలు, ప్రవర్తన అంత గొప్పగా లేనప్పటికీ గూడా – వీరి ఆనందానికి అవధులు ఉండవు !

వివాహ వ్యవస్థను గూర్చి, భార్యాభర్తల సంబంధాన్ని గూర్చి, అందులోని మాధుర్యాన్ని గురించి – మన భారతీయ సంస్కృతి అందించిన ఇంత గొప్ప ఆదర్శాన్ని – ప్రపంచంలోని ఇంకే దేశమూ, మతమూ, సంస్కృతీ కూడా – కనీసం ఊహించను కూడా లేదు ! దీనియొక్క స్ఫూర్తిని – వేల సంవత్సరాలుగా, లక్షల మంది స్త్రీలు ఆచరణలో పెట్టబట్టే – ప్రపంచం మొత్తం మీద, ‘ భారత మహిళ ’ అత్యంత గౌరవనీయ స్థానం ఈనాటికీ పొందుతూనే ఉన్నది !

**(118) ఆనుకూల్యము గల యంగన గలిగిన –**
**(119) సతికి పతికి పరమ సౌఖ్య మమురు !**

భార్య అనుకూలవతిగా ఉన్నట్లయితే, ఆ భార్యాభర్తల అదృష్టమే అదృష్టం ! వారి సౌఖ్యమే సౌఖ్యం !

‘ అనుకూలంగా ఉండటం ’ అంటే – ఉచితానుచితాలు చూడకుండా – చెప్పినదానికల్లా – అడ్డంగానో, నిలువుగానో – తలాడించటం కాదు ! తమ వ్యక్తిగత ఇష్టాయిష్టాలకు ప్రాధాన్యం యివ్వకుండా – ధర్మానికి, మానవతా దృష్టికి, పరోపకారానికి, తమ కుటుంబానికి శ్రేయస్కరమైన విషయాలను – సక్రమంగా, బాధ్యతాయుతంగా నిర్వర్తించటం ! అవసరమయితే, జీవిత–భాగస్వామికి నచ్చజెప్పటం !

విద్యా, ఉద్యోగ, వ్యాపారాదులలోనూ, బయటి ప్రపంచంతో వ్యవహరించటం లోనూ – తమ కుటుంబ సభ్యులకు కలిగే – శారీరక మానసిక శ్రమనూ, తాపాన్నీ (**Strain, Stress and Tensions**)ని పోగొట్టి, వారి ఆయురారోగ్యాలకు భంగం కలగకుండా చూసుకునే బాధ్యత – ప్రధానంగా ఇల్లాలిదే, గృహిణిదే !

అందుకే, భోజన భాజనాది సౌకర్యాలను సమకూర్చుతూ, ఇంటిని శాంతిధామంగా ఉంచే పవిత్ర బాధ్యత స్త్రీలదే – అని భారతీయ సంస్కృతిలోని ప్రధానాంశాలలో ఒకటైన ' పాతివ్రత్య ధర్మం ' తెలియజేస్తుంది !

ఒకవేళ భర్తకు – సంప్రదాయాల పట్ల, ఉన్నత విలువల పట్ల ఆదరం లేకపోయినా కూడా, తమ పిల్లలను మాత్రం – ఉత్తమ నైతిక, సామాజిక, జాతీయ, సాంస్కృతిక విలువలు గలవారిగా, నలుగురూ మెచ్చే ఆణిముత్యాలుగా – తీర్చి దిద్దటం కూడా మాతృమూర్తుల మహత్తర కర్తవ్యమే!

**(120) మతము లెన్ని యైన సతముగా నుండవు –**
**(121) సతముగాను యుండు జగతి నొకటి !**

ఏ మతములైనా శాశ్వతముగా నుండవు. జగత్తులో శాశ్వతంగా ఉండేది ఒకే ఒక్కటి – అదే, పరమాత్మ చైతన్యం !

ఈ సృష్టిలో కనిపించే ఏదీ కూడ స్థిరంగా ఉండదు ! ఒకే దేశంలోనయినా, కాలాన్ని అనుసరించి, ఎన్నో మార్పులు వస్తూనే ఉంటాయి. అందుకే, ' యుగ పురుషులు ' అప్పుడప్పుడూ జన్మించి – దేశ కాలాల్ని బట్టి, మారిన పరిస్థితులకు అనుగుణంగా – అవసరమైన మార్పులను ప్రజలకు బోధిస్తూనే ఉంటారు ! వారినే ' ప్రవక్తలు ' అంటారు !

మానవ జాతి ఉద్భవించిన ఈ లక్షల సంవత్సరాలలో, వివిధ ప్రాంతాలలో – ఇప్పటికి ఎన్ని వేల మంది ప్రవక్తలు జన్మించి ఉంటారు ! – భవిష్యత్తులో ఇంకా ఎంత మంది జన్మించ బోతారో !

మన భారత దేశంలో, మహర్షులు ' సనాతన ధర్మం ' అనే పేరిట – ' సర్వే జనాః సుఖినో భవన్తు ! ' అనే సార్వజనీన, సార్వకాలిక, విశాల హిత దృష్టితో – అధికార దాహం లేని, మత సామ్రాజ్య విస్తరణాకాంక్ష లేని బోధనలు – విశుద్ధ జ్ఞాన దానం – చేశారు !

భగవద్గీత వలె – ' స్వధర్మే నిధనం శ్రేయః ' అంటూ – ఎవరి మతాన్ని, ధర్మాన్ని వారు పాటించటమే మంచిదని నొక్కి చెప్పే – విశాల ఉదార హృదయం – ఈ ప్రపంచం మొత్తంలో – ఇంకే జాతికీ, మతానికీ, సంస్కృతికీ – ఇంతగా లేనే లేదని సగర్వంగా చెప్ప వచ్చు !

**(122) తమకు భేదమయిన తత్త్వంబు భేదమా !**
**(123) వాద మేల? దైవ భేద మేల ? !**

వివిధ మతాలూ, సంప్రదాయాలూ పాటించే – భక్తుల మధ్య భేదాభిప్రాయాలు ఉండవచ్చేమో గాని – అన్నిటికీ మూలమైన భగవత్ తత్త్వంలో భేదం ఉండనే ఉండదు ! ఇంక ఈ వాదాలూ, భేదాలూ ఎందుకు ?

భక్త జనులలో – భౌగోళికమైన, వాతావరణ పరమైన, భాషాపరమైన, ప్రాంతీయమైన – జీవన విధానంలోని భేదాలు ఉన్నంతవరకు – వారు పూజించే భగవంతుని సగుణ రూపాలలో కూడా – తేడాలు ఉండటం అత్యంత సహజం!

కోట్ల కోట్ల కోట్ల నక్షత్రాలతో పాటే – వాటిలో ఒక ఇసుక రేణువు అంత ఉన్న సంపూర్ణ భూగోళాన్ని కూడ – ఒకే దేవుడు సృష్టించాడు ! ఆ సృష్టికర్తనే, వివిధ భూ ఖండాలలో, దేశాలలో – ఎవరి సంప్రదాయ పద్ధతులలో వారు – ఆరాధించు కుంటున్నారు !

ఈ సత్యం తెలిసిన వారెవరూ – ' మీ దేవుని కంటె మా దేవుడు గొప్పవాడు' అని గాని – ' మీ మతం కంటె మా మతం గొప్పది ' అని గాని – చెప్పరు! ప్రపంచ జనులందరినీ – తమ ఒక్కరి మతమే పాటించేవారుగానే – మార్చివేయాలనే ఉద్దేశం – ఏ మతం వారికైనా ఉండటం అనేది – ఎంత అసహజం, ఎంత అవాంఛనీయం ?!

**(124) మొదల తన మతము వదలక –**
**(125) తుద నెవ్వరి మతమునైన దూషింపకయున్ !**

ఎవరి మాతృ మతాన్ని వారు వదిలిపెట్ట కూడదు. ఇతరుల యొక్క మతాలను నిందించ కూడదు !

ప్రతి కుటుంబానికీ – వారి తండ్రులూ తాతలూ పాటించిన – మతమూ, సంప్రదాయాలూ ఉంటాయి ! అదే తనకు పరంపరగా, కుటుంబ వారసత్వంగా

( **Inherited Intellectual and Cultural Property Rights** ) గా లభించిన – ‘ మాతృ మతం ’, లేక ‘ స్వధర్మం ’ !

‘ స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః ’ ( భగవద్గీత ) !

‘ ఎవరి స్వధర్మాన్ని వారు పాటించుకుంటూ – పరస్పర గౌరవాభిమానాలతో, ఇతరుల మతములను నిందించకుండా – ఎవ్వరూ అభద్రతాభావం పొందకుండా– అందరూ శాంతియుత సహజీవనం చేసుకుంటూ, అభ్యుదయం పొందండి !’ – అని బోధించే మన భగవద్గీతా ఉపదేశం ఎంత విశ్వ శాంతికరం!

ఆస్తికులు, ధార్మికులు ఏ మతానికి చెందినవారైనా గాని, అందరూ వారిని గౌరవించాల్సిందే ! నాస్తికులు, అధార్మికులు, అవినీతిపరులు, జాతిద్రోహులు మొ.వారు ఏ మతానికి చెందినా గాని, అందరూ వారిని గర్హించాల్సిందే !

కొండ కొన మీద నున్న ఆహ్లాద–భవనం చేరుకోవటానికి – కొండకు నలువైపుల నుంచీ ఎన్నో మార్గాలు ఏర్పడి ఉంటాయి ! తమకు అలవాటు అయిన త్రోవను వదిలి, మధ్యలో ఇంకో త్రోవలోకి మారి, ప్రయాణం చేయటం వలన, గమ్యం చేరటం ఎక్కువ శ్రమకరం, ఎక్కువ ఆలస్యం అవుతుంది గదా ! అలాగే – ఎవరి స్వధర్మ మార్గమే చాలు వారిని ఉద్ధరించటానికి, కొండ మీది గమ్యం చేర్చటానికి ! మతం మార్చుకోవలసిన అగత్యమే లేదు !

అశాశ్వతమైన ‘ అర్థ, కామాది ’ భౌతిక ప్రయోజనాలకోసం – తన ఉనికికే (జన్మకే ) కారణమైన కన్నతల్లినే వదిలిపెట్టటం ఎంత హేయం !

‘ కన్నతల్లి వంటిది కాదె మాతృ మతము ? మార్చుకొన దగునె తన మాత నేర్కైన ?! ’ – (తాతయ్య సూక్తులు).

## (126) సర్వ సురల కన్న సర్వేశ్వరుడు మేలు !

అందరు దేవతల కన్న, అందరికీ ప్రభువైన పరమాత్మ గొప్ప వాడు కదా ! ఆ దేవదేవుణ్ణి ఆశ్రయించటం మేలు గదా !

ఈ భూలోకంలోని ప్రాణులందరివీ పాంచభౌతిక దేహాలు ! – అంటే – పృథివి, జలం, తేజస్సు, వాయువు, ఆకాశం – అనే పంచభూతాలతో నిర్మించ బడ్డాయి! దేవతలు తేజోమయ దేహాలు గలవారు ! వారు ప్రకృతిలోని విభిన్న శక్తులకు

అధిష్ఠాన దైవాలుగా ఉంటూ, వాటిని నియమిస్తూ ఉంటారు ! సకల శక్తులకూ మూలమైన ఆదిశక్తిని ( మాయాశక్తిని ) (**The Mother of all Energies** ) ని నియమించగలవాడు ఆ పరమాత్మయే !

మనం ఏ దేవతను ప్రార్థిస్తే, ఆ దేవత – తన పరిధి, అధీనం లోని అంశాలను మాత్రమే అనుగ్రహించగలదు ! మనం ఆ సర్వేశ్వరుణ్ణే ప్రార్థిస్తే – సర్వ విషయాలలోను సర్వ దేవతల అనుగ్రహం, ఆనుకూల్యం, రక్షణ లభిస్తాయి గదా!

అన్ని మతాలవారు కూడా – దేవుడు సర్వశ్రేష్ఠుడు, సర్వవ్యాపి, సర్వరూపి, సర్వాంతర్యామి, సర్వశక్తిమంతుడు, సృష్టి స్థితి లయ కర్త – అనే చెబుతున్నారు! ‘ సర్వవ్యాపకమైన తత్త్వము ’ ఒకే ఒక్కటి ఉండగలదు ! రెండు సర్వవ్యాపకాలు ఉండే వీలే లేదు గదా ! కాబట్టి, ఎవరు ఏ దేవుడిని ప్రార్థించినా, అవన్నీ ఆ సర్వేశ్వరుడికే చేరుతాయి ! కాబట్టి, కుటుంబ–పరంపరగా వస్తూన్న దైవపూజా విధానాల్ని ఎవ్వరూ మార్చుకో నవసరమే లేదు ! అలా మార్చుకోవాలని చూస్తే – ఆ కుటుంబం లోపలివారితోను, బయటి బంధు మిత్రులతోను, ఆఖరికి తన అంతరంగం లోని వంశ పారంపర్య కణాలు ( **Genes** ) తోనూ కూడా – సామరస్యం దెబ్బ తింటుంది ! అంతరంగ శాంతి భంగ మవుతుంది ! (**Internal Conflict at Sub-Conscious Level is a slow - Poison !**)

## (127) దేవుడొక్క డనుచు దెలియ లేరు !

‘ దేవుడు ఒక్కడే ’ అనే విషయాన్ని సాధారణ జనులు అర్థం చేసుకోలేక పోతున్నారు !

ఒక కుటుంబంలో – అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ళు – ఎంతమంది ఎన్ని విభిన్న లక్షణాలతో ఉన్నా, ఎవరు ఏయే దూర ప్రదేశాలకు వెళ్ళినా – వారందరికీ తల్లి / తండ్రి ఒక్కరే గదా ! వారందరి జన్మకు, పోషణకు, అభివృద్ధికి కారకులు వీరే కదా ! మరి, మానవజాతి లక్షణాలతో ఉన్న మొట్ట మొదటి తల్లిదండ్రులను సృష్టించిన దెవరు ? వారు తమను తామే సృష్టించుకో లేరు గదా ! ఆ సృష్టికర్తయే భగవంతుడు !

అలాగే, ఈ విశ్వకుటుంబంలోని – సహోదర స్థానీయులమైన సమస్త జనులకు, జంగమమైన ( స్వయంగా చలించే ) ప్రాణికోటికి, స్థావరమైన ( స్వయం

చలనము లేని ) జడమైన ప్రకృతికీ కూడా – సృష్టి స్థితి లయాలకు కారణభూతుడైన – దేవుడు ఒక్కడే అనటంలో సందేహ మేముంది ?!

### (128) తన్ను దిప్పువాని తానేల కానడో !

మనిషి – దేవుడు త్రిప్పుతుంటే తాను తిరుగుతూ – తన ముందున్న వాటిని మాత్రమే చూస్తూ – తనను వెనకనుండి నడిపిస్తున్న దేవుని మాత్రం చూడలేక పోతున్నాడు !

మాయాశక్తి నుంచి ప్రాణశక్తి వరకు కలిసి ఉన్న – ఒక చోదక శక్తి ( **Driving Force** ) ప్రసరించి నప్పుడు మాత్రమే నడిచే – మరబొమ్మ యీ దేహం! జగత్తు మొత్తానికే తల్లిదండ్రులైన – ప్రకృతి పురుషులను గుర్తించటమే, పొందటమే – ఈ మానవ జన్మకు సార్థకత ! ఇట్టి బుద్ధి శక్తి – మానవప్రాణికి తప్ప, మరి ఏ యితర ప్రాణికీ లేదు ! కాబట్టి, మానవ జన్మకు పరమ ప్రయోజనం – బుద్ధి సాక్షియైన పరమాత్మను గుర్తించటమే ! ' ఈ జన్మలో కాకపోతే, ఇంకే జన్మలోనూ సాధ్యం కాదు ! ' అన్న స్ఫూర్తితో సాధన చేస్తూండటమే !

### (129) తామెందులోన దిరిగిన –
### (130) దేవుడు తోడగుచు వచ్చు వెంటనె వేమా !

మనం ఎక్కడెక్కడికి వెళ్ళినా – మనతో పాటే దేవుడు కూడ – తోడుగా వస్తూనే ఉంటాడు !

దైవభక్తి అనే సుగుణం గనుక ఉంటే – మనం ఎక్కడికి వెళ్ళినా గానీ – దేవుని అనుగ్రహాన్ని పొంద గలుగుతూనే ఉంటాము ! ఎందుకంటే, దేవుడు సర్వవ్యాపి; ఆయన లేని చోటే లేదు ! కావలసిందల్లా, ఆయనతో మనం ఒక సంబంధాన్ని ( **Connectivity** ) ని ఏర్పరచుకోవటమే ! దానికి భక్తిని మించిన సాధనం, సాధన లేనే లేదు !

ఉదా: మన దగ్గర ఒక సెల్ ఫోన్ ఉంటే – మనం ప్రపంచంలో ఎక్కడ తిరిగినా గానీ – సిగ్నల్సునీ, మెస్సేజస్‌నీ అందుకో గలుగుతూనే ఉంటాము గదా ! అలాగే, భక్తి అనే సాధనం ఉంటే – భగవంతుని కృప యెప్పుడూ అందుబాటులోనే ఉంటుంది !

మరి – భక్తి లేనివారు, నాస్తికులు, చెడ్డవారు, మొ. వారివెంట – దేవుడు వెళ్ళడా ? అంటే – అప్పుడూ వెళుతూనే ఉంటాడు ! వారు ఎప్పుడు తలిస్తే,

ఎప్పుడు పిలిస్తే – అప్పుడు సహాయం చేద్దామని ! ఎందుకంటే – అందరూ ఆయన బిడ్డలే ! అందరియందూ ఆయన సమదృష్టి కలవాడే ! కరుణను సమంగా వర్షించే వాడే ! ఎవరికి తగిన ఆహారం, ఎవరికి తగిన ఔషధం – వారి వారికి ఇస్తూ ఉండేవాడే ! ఆయన సహాయం అందుకోవాలని వీరు ప్రయత్నించాలి – అంతే !

**(131) మంట లోహమందు మాకుల శిలలందు –**
**(132) పటము గోడలందు ప్రతిమలందు –**
**(133) తన్ను దెలుసు కొరకు తగలదా పరమాత్మ !**

పరమాత్మ అన్ని చోట్లా, అన్నిటియందు, అన్నిటిగాను – తానే ఉన్నాడని వేదాలు చెబుతున్నాయి ! పంచ భూతాలలోని జలం, తేజస్సు, వాయువు, ఆకాశములకే ఒక స్థిరమైన రూపం లేదు ! ఏ పాత్రలో ఉంచితే, ఆ పాత్ర ఆకారాన్ని పొందుతాయి ! ఇంక, ఆకాశం కంటె కూడ సుసూక్ష్మం అయిన దైవతత్త్వం ఏ ఒక్క **Rigid Shape** లోనైనా ఉంటుందా ?! అట్టి రసాత్మకమైన పరమాత్మను – మన మనస్సుతోను, పంచ జ్ఞానేంద్రియాలతోను గ్రహించాలంటే – ఒక నామం, ఒక రూపం గల ఒక ప్రతిమను (ప్రతీకను, విగ్రహాన్ని) పాత్రగా చేసుకోవలసినదే గదా !

మట్టి, శిలలు, కొయ్య – బంగారం, కంచు మొ. పంచ లోహాలు – అగ్ని, దీపం మొ. కాంతి రూపాలు – చిత్రపటములు, ఏ చిత్రమూ లేని గోడలు – ఇట్లా భగవత్ స్పృహ కలిగించే ఏ వస్తువులయినా కూడా – ప్రతీకలే, ప్రతిమలే, విగ్రహాలే ! పూజకి, ఆరాధనకి అర్హమైనవే ! ధ్యానానికి ఆలంబనంగా యోగ్యమైనవే !

వస్తువులకే ఇంత శక్తి ఉన్నపుడు – ప్రకృతి రూపాలైన చెట్లూ పుట్టలూ, కొండలూ కోనలూ, తీర్థాలూ నదులూ, సూర్య చంద్ర గ్రహ తారకలూ, పంచ భూతాలూ – ఇలా ఈ అద్భుత సృష్టిలోని ఏదైనా సరే – ఆ సృష్టికర్తయొక్క స్పృహను కలిగించ లేదా ?!

ప్రతి మతమూ దేవుని ఆరాధించమనే చెబుతుంది ! కాబట్టి ప్రతీకోపాసన (విగ్రహారాధన ) లేని మతం ఉండే వీలే లేదు ! ‘ ఈ విగ్రహమే దేవుడు ’ అని బోధిస్తే, అది మూఢ నమ్మకం కావచ్చు ! కాని, ‘ దేవుడు ఈ విగ్రహంలో

కూడా ఉన్నాడు ! ' అని బోధిస్తే, అది వివేక, విజ్ఞానయుతమైన, ఉత్తమస్థాయి (**Rational, Logical and Super-Natural Level**) బోధ అవుతుంది!

' లోకో భిన్న రుచిః ' అన్నట్లుగా, తమ తమ మత పరిధులలోనే – ఎవరి యిష్టాయిష్టములకు తగినట్లుగా వారు, తమ ఇష్ట దైవాన్ని ఎంచుకుని – ఆ దైవంతో అనుబంధం పెంచుకుంటే చాలు ! ఇష్ట దైవాలు వేరు వేరు అయినా, అందరు భక్తులూ పొందే దైవానుగ్రహ లక్షణాలు ఒకే విధంగా ఉంటాయి !

**(134) అందు గలుగు దేవు డిందు లేడె –**
**(135) యిందు నందు గలడు హృదయంబు లెస్సైన !**

అందులోనున్న దేవుడు ఇందులో ఉండలేడా ?! చూడగల శాస్త్రీయ భావన, విశాల హృదయమూ ఉండాలే గాని, దేవుడు ఎక్కడ పడితే అక్కడే ఉన్నాడు !

ఆకాశం అంతటానూ, నక్షత్రాదు లన్నిటిలోనూ వ్యాపించియున్న దైవచైతన్యం భూమి అంతటా వ్యాపించదా ? ఒక దేశంలో ఉంటూ, ఇంకొక దేశంలో ఉండకుండా పోతుందా ?!

**(136) భక్తి లేని పూజ ఫలము లేదు !**

భక్తితో చేసే పూజనే భగవంతుడు స్వీకరిస్తాడు. భక్తి లేకుండా, ఎంత వైభవంగా పూజ చేసినా, దేవుడు మెచ్చడు ! నామ మాత్ర పూజకి ఫలితమూ నామ మాత్రమే !

స్వార్థంతోనూ, కోరికల పరంపర తోనూ – జనం మామూలుగా చేసే పూజలు, ప్రార్థనలు ఉత్తమమైన భక్తి కాదు ! మన పనిని చక్కబెట్టుకోవటానికై – ఇతర వ్యక్తులతో మనం చేసుకునే వ్యవహారాలు, ఒప్పందాల వంటిదే ( **Transactions and Deals** ) వంటిదే అయినా – ఇదీ ఒక రకపు భక్తియే! వాటి ఫలితం చాలా స్వల్పం. అసలు లేనిదాని కంటె నయం కదా !

నిజమైన ' భక్తి ' అంటే – భగవంతుని నామ, రూప, లీలా, గుణ, తత్త్వముల యందు – నిష్కామ పరమ ప్రేమ భావం !

భక్తితో ఒక తులసీదళాన్ని యిచ్చినా ప్రీతితో స్వీకరిస్తాడు దేవుడు ! కాని, అహంకారంతోనూ, ఆడంబరంగానూ పూజలు చేసేవారంటే – దేవునికి ఆప్యాయత లేదు !

**(137) మరియు దధిని ఘృతము, మానులం దనలంబు -**
**(138) చారు సుమము లందు సౌరభంబు -**
**(139) తిలల తైలమట్ల తేజరిల్లు చిదాత్మ !**

పెరుగు అంతటి లోను నెయ్యి వ్యాపించి యున్నట్లుగాను, ఎండిన వృక్షాలలో అగ్ని ఉన్నట్లుగాను, పువ్వులలో సువాసన ఉన్నట్లుగాను, నువ్వులలో నూనె దాగి యున్నట్లు గాను - ఈ జగత్తు అంతటిలోను, పరమాత్మ - చైతన్య స్వరూపంగా - వ్యాపించి యున్నాడు !

**(140) వెదుక వెదుక దొరుకు వేదాంత వేద్యుండు !**

' వేదాంతములు ' అంటే వేదములయొక్క చివరి భాగములయిన ఉపనిషత్తులు! వాటి వల్లనే తెలియదగినవాడు ' వేదాంత వేద్యుడు ' - పరమాత్మ ! ఆ పరమాత్మ అన్నిచోట్లా ఉన్నాడు. అయినాగాని, ఎంతో కష్టపడి వెదికితేనే దొరుకుతాడు !

అయితే, తనకు బయట ఎంతగా గాలించినా దొరకటం కష్టం ! అది ఎండమావుల వెంట పరుగు లాంటిదే ! తన అంతరంగంలో వెదికితేనే - బుద్ధి స్థాయిని దాటి లోపలికి వెళితేనే - పరమాత్మ దర్శనం అయ్యేది ! - అని ఉపనిషత్తులు ఉద్ఘోషిస్తున్నాయి !

భక్తిశ్రద్ధలతో, శాస్త్రీయ మార్గంలో, సద్గురువు యొక్క మార్గ నిర్దేశనంలో - నిరంతర సాధన చేసేవారికే, భగవత్ తత్త్వం అవగత మవుతుంది !

**(141) హృదయ మందు నున్న యీశుని దెలియరో !**

అన్ని ప్రాణుల హృదయములందు ( బుద్ధి గుహల యందు ) ఈశ్వరుడు (పరమాత్మ) వెలుగుతూ ఉంటాడు ! ' ఈశ్వరః సర్వ భూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి ' - అని భగవద్గీతా వచనం !

మొత్తం 84 లక్షల రకాల జీవరాశులలో - కేవలం మానవ జాతి ప్రాణులకు మాత్రమే - బుద్ధి శక్తిని పూర్ణంగా అనుగ్రహించాడు ఆ దేవుడు ! అంతర్వాణి రూపంలో - మనకు ఉచితానుచిత బోధ చేస్తూండేది కూడ ఆ దేవుడే ! ' అంత దగ్గరగానున్న దేవునికోసం - బయట ఎక్కడెక్కడో వెదికే బదులుగా - మీ హృదయంలోనే ఉన్న దేవుని తెలుసుకునే ప్రయత్నం చేయండి జనులారా ! ' అని వేమన ఉపదేశం !

### (142) సకలాకారు డనంతుడు -
### (143) సకలాత్మల యందు సర్వ సాక్షియు దానై !

ఆ పరమాత్మ ( పరబ్రహ్మ ) స్వతహాగా ఏ గుణమూ లేనివాడు; ఆకాశం వలె ఏ ఆకారమూ లేనివాడు ! అయినా, అన్ని ఆకారాలూ ఆయనవే ! ఆయన అనంతుడు. అన్ని ప్రాణుల మనో బుద్ధులకు సాక్షిగాను, సర్వసాక్షి గానూ వెలుగొందు తున్నాడు ! ఆయన జ్ఞాన జ్యోతి స్వరూపుడు !

### (144) అఖిల జనుల కెల్ల నానందమే సాక్షి !

ప్రతి ప్రాణి చేసే ప్రతి ప్రయత్నమూ కూడ ఆనందం కోసమే గదా ! దుఃఖం రావాలని ఎవరూ కోరుకోరు; ప్రయత్నించరు గదా !

ప్రతివారూ ఎక్కడెక్కడ తిరిగినా - విశ్రాంతి కోసం, తమ నిజ స్థానానికే తిరిగి రావాలని - ప్రయత్నిస్తూనే ఉంటారు గదా !

పై రెండు విషయాలను బట్టి తెలిసే దేమంటే -ఆనందమే మన నిజ స్థానం! మన నిజమైన సహజ స్థితి ! అందుకోసమే మనందరి ప్రతి ప్రయత్నమూను!

అయితే, ఆనందం పొందటానికై, ఒక్కొక్కరు ఒక్కొక్క రకంగా ప్రయత్నిస్తూంటారు!

చాలామంది, సుఖం కలుగుతుంది అనే ఉద్దేశంతో - దుఃఖప్రదమైన విషయాల వెంట పరుగులు పెడుతూ ఉంటారు ! ఉదా: ఐస్ క్రీములు, చాక్లెట్లు ఎక్కువగా తినే పిల్లలకు - తిన్న సుఖం కొద్ది సేపే ఉంటుంది - కాని, టాన్సిల్సు, పుప్పి పళ్ళు వంటి - రోగ బాధలు మాత్రం చాలా కాలం ఉంటాయి గదా !

అయితే, నోరు కట్టేసుకుని బ్రతకాల్సిందేనా? జీవితంలో మనకు ఇష్టమైన వాటిని వదులుకోవాల్సిందేనా? అంటే - అక్కర లేదు ! ' ఎక్కువగా ' తినటం మంచిది కాదన్నాము గాని, అసలే వద్దన లేదు గదా ! ఒక సారి అపథ్యం చేస్తే, ఆ వెంటనే ఒక వారం రోజులు, లేదా కనీసం మూడు రోజులపాటు పథ్యంగా ఉంటే, అపథ్య దోషం చాలావరకు పరిసి పోతుంది ! తన ఆరోగ్యం మీద పడుతున్న ప్రభావాన్ని గమనించుకుంటూ, మళ్ళీ ఎంజాయ్ చేయవచ్చు !

## (145) దుఃఖ స్పర్శ లేని సుఖమన్న మోక్షమే !

మామూలుగా – సుఖాలకు ముందు, వెనుక, మధ్యలలోను దుఃఖం ఎంతో కొంత ఉంటూనే ఉంటుంది. కాని, దుఃఖం అసలు ఏమాత్రమూ తగలని ఏకైక సుఖం – మోక్షమే ! ' మోక్షం ' అంటే – అఖండమైన, శాశ్వతమైన ఆనందసాగర – స్వరూపంగా ఉండిపోవడమే !

భారతీయ సంస్కృతి ప్రకారం – మానవ జీవిత పరమార్థం – నాలుగు లక్ష్యాలను సాధించటమే. ధర్మ, అర్థ, కామ, మోక్షములనే ఈ నాలుగు జీవిత లక్ష్యాలనే – ' చతుర్విధ పురుషార్థాలు ' అంటారు !

' అర్థం ' అంటే ధనమును సంపాదించటం – ' కామం ' అంటే కోరికలను తీర్చుకునే ప్రయత్నం చేయటం. ఈ రెండు పనులనూ ప్రపంచంలోని అందరూ – ఎవరూ చెప్పనక్కర లేకుండానే – సహజంగానే చేస్తూంటారు !

కాని, మన భారతీయ సంస్కృతి యొక్క వైశిష్ట్యం (ప్రత్యేకమైన గొప్పదనం) ఏమిటంటే – ధర్మానికి అన్నిటికన్నా ప్రాధాన్యం ఇవ్వటం ! ' అర్థ, కామాలను కూడా ధర్మబద్ధంగానే పొందాలి ' అని ఉపదేశించటం ! ఇలా చేయటం వల్లనే – వ్యక్తిగత ఉన్నతితో బాటు, సమాజంలో సామరస్యం, శాంతియుత సహజీవనం వెల్లి విరుస్తాయి !

## (146) ఆశ విడక గాని పాశ ముక్తుడు గాడు !

ఆశను విడిచి పెడితేనే గాని, పాశములనుంచి ( బంధముల నుంచి, కట్టు త్రాళ్ళ నుంచి ) బయట పడలేరు మానవులు !

రాగము, ద్వేషము ( తీవ్రమైన ఇష్టం, అయిష్టం ) అనే భావాలు మనసులో కలుగుతూ ఉంటే – అవే పాశములై మనుష్యులను బంధిస్తూ ఉంటాయి !

మనసును ఆరు దుర్గుణాలు ( అరి షడ్వర్గం ) అప్రయత్నంగానే ఆక్రమిస్తూ ఉంటాయి ! కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు – అనేవే ఆ ఆరు. వీటి వల్లనే రాగ–ద్వేషాలు కలుగుతూ ఉంటాయి !

జ్ఞానంతో మోహాన్ని, స్వార్థ త్యాగంతో లోభాన్ని ( ఆశను ) జయిస్తే – అప్పుడు మిగిలిన శత్రువులు ఏమీ చేయలేరు. ఇక సంపూర్ణ ఆనందమూ, స్వాతంత్ర్యమూ, మోక్షమే !

## (147) నిర్మలునకు గలుగు ముక్తి నిజముగ వేమా !

నిర్మలమైన మనస్సు గలవారికి – అంటే, మనస్సును కామ క్రోధాది అరి–షడ్వర్గ రహితంగా ఉంచుకుంటూ – జ్ఞానగంగలో స్నానం చేసేవారికి – ముక్తి (మోక్షం ) తప్పకుండా కలుగుతుంది !

మనిషి ఏ పని చేయాలన్నా–మూడే ఉపకరణాలు ( సాధనాలు, **Implements**) – మనో వాక్ కాయములు ! ఈ మూడూ పరిశుద్ధంగా ఉంటే – ' త్రికరణ శుద్ధి ' ఉన్నట్లు ! త్రికరణ శుద్ధి గలవారు అంటే – మనసా, వాచా, కర్మణా (చేతలలో గూడ ) – నిజాయతీ, సత్యం, పరహితం కలిగినవారు !

శరీరం ( కాయం ) శుద్ధి అవ్వాలంటే, జలస్నానం అవసరం. వాక్కు శుద్ధి అవ్వాలంటే, దైవ–స్తోత్ర పారాయణాదులు, సత్య హిత భాషణం అవసరం. ఇక మనస్సు శుద్ధి అవ్వాలంటే – దైవ–శరణాగతి, ప్రార్థనా–భావన, సద్గ్రంథ పఠనం ద్వారా అరి–షడ్వర్గ నియంత్రణ, ఉదార విశాల భావాలు, పరోపకార పరాయణత్వం – యమ నియమాది యోగ విధానాల ద్వారా, ధ్యాన సమాధులు – మొ. విషయాలు సతతమూ ఆలోచనలలో, ఆచరణలలో ఉండాలి!

## (148) కప్పురంబు జ్యోతి గలసి నట్లగు ముక్తి !

హారతి కర్పూరాన్ని వెలిగించినపుడు జ్యోతి వస్తుంది. క్రమంగా ఆ కర్పూరం హరించుకుపోతూ, జ్యోతిలో కలిసి పోతూ, చివరికి ' తాను ' అనేది మిగలకుండా పోతుంది !ముక్తి కూడ అంతే ! జీవాత్మ – తన ఉపాధి యొక్క అల్పత్వాన్ని,

పరమాత్మ యొక్క అనంతత్వాన్ని – జ్ఞానజ్యోతి ద్వారా తెలుసుకుంటున్న కొద్దీ – తాను ( తన అహంకారం ) కరిగిపోతూ – ఆ అనంత పరమాత్మలో లీనమై పోతాడు!

## (149) ఏకత్వంబని యెరిగిన –
## (150) శోకములే కల్ల ! ముక్తి సులభము వేమా !

భిన్నత్వంలో ఏకత్వాన్ని దర్శించే వారికి శోకము లుండవు ! మోక్షం సులభంగా కలుగుతుంది !

వేద, వేదాంతాలలోనున్న జ్ఞానగంగను – పురాణ, ఇతిహాసాల ద్వారా – ప్రపంచమంతా ప్రవహింప జేసిన అపర భగీరథుడు – వేదవ్యాస మహర్షి !

వ్యాస మహర్షి యొక్క హృదయాన్ని – బహుజనోపయోగార్థం మూడు స్థాయిలలో ఆవిష్కరించడానికై – త్రిమతాచార్యులు అవతరించారు ! శ్రీ ఆది శంకరాచార్యులు ' అద్వైత ' స్థాయి బోధ చేశారు – శ్రీ రామానుజాచార్యులు ' విశిష్టాద్వైత ' స్థాయి బోధ చేశారు – శ్రీ మధ్వాచార్యులు ' ద్వైత ' స్థాయి బోధ చేశారు !

ఈ సృష్టిలో అందరికీ సాధారణంగా కనబడేది ' భిన్నత్వం, నానాత్వం ' – ఇది ద్వైత స్థాయి ! క్రమంగా – కర్మయోగ, భక్తియోగ, జ్ఞానయోగాల ద్వారా ఆధ్యాత్మిక ప్రగతిని సాధిస్తూ – అద్వైత స్థాయికి చేరుకోవటమే ' కైవల్య మోక్షం' – అనేదే ఉపనిషత్ సిద్ధాంతం – అని శ్రీ శంకరాచార్యులు బోధించారు! 'భిన్నత్వంలో ఏకత్వము' ను చూడటం – అంటే అద్వైత దృష్టే !

యోగి వేమన, తన పద్య సూక్తులలో – అద్వైత సిద్ధాంతాన్నే తేట తెలుగులో బోధించాడు !

భారతీయాంధ్ర బాల–బాలికలమైన మనం – సాంస్కృతిక విజ్ఞానమును సంపాదించి – నైతిక, ధార్మిక విలువలతో, ఆత్మగౌరవంతో కూడిన జీవితాన్ని ఆస్వాదిస్తూ – విశ్వ శ్రేయమునకై పాటుబడదాం !

**సమస్త సన్మంగళాని భవన్తు !**

**సర్వే జనా స్సుఖినో భవన్తు !**

**లోకా స్సమస్తా స్సుఖినో భవన్తు !**

**ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః !!!**

# తెలుగు సూక్తి సుధ

# ప్రథమ బాల శిక్ష - I

## వేమన పద్య రత్నములు ( చిన్నారి పిల్లలకు )

(1) కొండరేడు మామ కొండకూతురు యాలు
కొండ యిల్లు, పసిడి కొండ విల్లు
కొండ వంటి దొరవు కుంటెన నడుతురా
**విశ్వదాభిరామ ! వినుర వేమ !**

(2) పనస తొనల కన్న పంచదారల కన్న
జుంటి తేనె కన్న జున్ను కన్న
చెరుకు రసము కన్న మన తెలుగు తీపిరా (విశ్వ)

(3) అనగ ననగ రాగ మతిశయిల్లుచు నుండు
తినగ తినగ వేము తీపి నుండు
సాధనమున పనులు సమకూరు ధరలోన (విశ్వ)

(4) వినని వానికన్న విన్నవా డధికుండు
విన్నవాని కన్న కన్నవాడు
కన్నవాని కంటె కలయువా డధికుండు (విశ్వ)

(5) గుణవతి యగు యువతి గృహము చక్కగ నుండు
చీకటింట దివ్వె చెలగు రీతి
దేవి యున్న యిల్లు దేవార్చన గృహంబు (విశ్వ)

(6) తల్లిదండ్రులందు దారిద్ర్యయుతులందు
నమ్మిన నిరుపేద నరులయందు
గురువులందు జూడ భయభక్తు లమరిన
నిహము పరము గల్గు నెసగ వేమ !

(7) నిక్కమైన మంచి నీల మొక్కటి చాలు
తళుకు బెళుకు రాళ్ళు తట్టెడేల ?
చదువ పద్య మరయ చాలదా యొకటైన (విశ్వ)

(8) గంగి గోవు పాలు గంటెడైనను చాలు
కడివెడైన నేమి ఖరము పాలు
భక్తి గలుగు కూడు పట్టెడైనను చాలు (విశ్వ)

(9) పొట్లకాయ రాయి పొడిగి త్రాటను గట్ట
లీల తోడ వంక లేక పెరుగు
కుక్క తోక గట్ట చక్కగా వచ్చునా (విశ్వ)

(10) తామసించి సేయ తగదెట్టి కార్యంబు
వేగిరింప నదియు విషమ మగును
పచ్చి కాయ దెచ్చి పడవేయ ఫలమౌనె ? (విశ్వ)

(11) పరుల కుపకరించి పరుసొమ్ము పరునకు
పరగనిచ్చె నేని పరము గలిగె
పరము కన్న నేమి పావనమా సొమ్ము ? (విశ్వ)

(12) పరనారీ దూరగుడై
పరధనముల కాస పడక, పరహిత చారై
పరు లలిగిన తానలుగక
పరు లెన్నగ బ్రతుకువాడు ప్రాజ్ఞుడు వేమా !

(13) తన గుణము తనకు నుండగ
నెనయంగా నొరుని గుణము నెంచును మదిలో
తన గుణము తాను దెలియక
బరు నిందం జేయువాడు భ్రష్టుడు వేమా !

(14) అల్పు డెపుడు బల్కు నాడంబరము గాను
సజ్జనుండు బల్కు చల్ల గాను
కంచు మోగునట్లు కనకంబు మోగునా ? (విశ్వ)

(15) చెప్పు లోని రాయి చెవి లోని జోరీగ
కంటి లోని నలుసు కాలి ముల్లు
నింటి లోని పోరు నింతింత గాదయా (విశ్వ)

(16) మధు రసంబు గోరి మక్షికంబులు జేరి
చొచ్చి వెడల లేక జొక్కినట్లు
మునిగి వెడల లేదు మోహాంబురాశిలో (విశ్వ)

(17) ఒడ్డు పొడుగు గలిగి గడ్డంబు పొడుగైన
దాన గుణము లేక దాత యగునె ?
యెనుము గొప్పదైన యేనుగు బోలునా (విశ్వ)

(18) కుక్క గోవు గాదు కుందేలు పులి గాదు
దోమ గజము గాదు దొడ్డదైన
లోభి దాత గాడు లోకంబు లోపల (విశ్వ)

(19) కోతి బట్టి తెచ్చి కొత్త పుట్టము గట్టి
కొండముచ్చు లెల్ల గొలిచినట్లు
నీతిహీను నొద్ద నిర్భాగ్య లుందురు (విశ్వ)

(20) కానివాని తోటి కలసి వర్తించెనా
హాని వచ్చు నెంతవాని కైన
తాటి క్రింద పాలు తాగిన చందమౌ (విశ్వ)

(21) పాల నీడిగింట గ్రోలుచు నుండెనా
మనుజు లెల్ల గూడి మద్య మండ్రు !
నిలువ దగని చోట నిలువ నిందలు వచ్చు (విశ్వ)

(22) వేరు పురుగు జేరి వృక్షంబు జెరుచును
చీడ పురుగు జేరి చెట్టు జెరుచు
కుత్సితుండు చేరి గుణవంతు జెరుచురా ! (విశ్వ)

(23) పట్టు నేర్చు పాము పడగ యోరగ జేసు
చెరుప జూచు వాడు చెలిమి జేసు
చంప దలచు రాజు చనవిచ్చు చుండురా (విశ్వ)

(24) నీళ్ళలోని చేప నెరి మాంస మాశకు
గాలమందు జిక్కి గూలినట్లు
యాశ బుట్టి మనుజు డారీతి జెడిపోవు (విశ్వ)

(25) తవుటి కరయ బోవ తండులంబుల గంప
శ్వాన మాక్రమించు సామ్యమునను
లోభివాని సొమ్ము లోకుల పాలౌను (విశ్వ)

(26) ధనము గూడబెట్టి ధర్మంబు సేయక
తాను దినక లెస్స దాచు గాక !
తేనె నీగ గూర్చి తెరవరి కియ్యదా ? (విశ్వ)

(27) ఎక్కుడైన యాశ లినుమడి యుండగా
తిక్క బట్టి నరుడు తిరుగు చుండు
కుక్క వంటి యాశ కూర్చుండ నివ్వదు (విశ్వ)

(28) నీళ్ళ లోన మొసలి నిగిడి యేనుగు బట్టు
బైట కుక్క చేత భంగ పడును
స్థాన బలిమి కాని తన బలిమి కాదయా (విశ్వ)

(29) చిక్కి యున్న వేళ సింహంబు నైనను
బక్క కుక్క చేరి బాధ సేయు
బలిమి లేని వేళ పంతంబు సెల్లదు (విశ్వ)

(30) అనువు గాని చోట నధికుల మనరాదు
కొంచె ముండు టెల్ల కొదువ గాదు
కొండ యద్దమందు కొంచెమై యుండదా ? (విశ్వ)

(31) యెలుగు తోలు దెచ్చి యెందాక నుతికిన
నలుపు గాక నేల తెలుపు గల్గు ?
కొయ్య బొమ్మ దెచ్చి కొట్టితే గుణి యౌనె ! (విశ్వ)

(32) హీను డెన్ని విద్య లిల నభ్యసించిన
ఘనుడు గాడు హీన జనుడె గాని
పరిమళముల గర్దభము మోయంగ ఘనమౌనె ! (విశ్వ)

(33) దుండగీని కొకడు కొండీడు చెలికాడు
బండ రాజునకును పడుచు మంత్రి
కొండముచ్చునకును కోతియు విందౌను ! (విశ్వ)

(34) ఇచ్చు వానివద్ద నీని వాడుండిన
చచ్చు గాని నీవి సాగనీడు
కల్పతరువు కింద గచ్చ చెట్టున్నట్లు ! (విశ్వ)

(35) గొడ్డుటావు బితుక కుండ గొంపోయిన
పండ్లు నూడ దన్ను, పాలు లేవు
లోభి వాని నడుగ లాభంబు లేదయా ! (విశ్వ)

(36) మేడి పండు జూడ మేలిమై యుండును
పొట్ట విచ్చి చూడ పురుగు లుండు !
బెరుకు వాని మదిని బింక మీలాగురా (విశ్వ)

(37) మిరప గింజ జూడ మీద నల్లగ నుండు
కొరికి చూడ లోన చురుకు మనును
సజ్జనులగు వారి సార మిట్టుల నుండు (విశ్వ)

(38) ఉప్పు కప్పురంబు నొక్క పోలిక నుండు
చూడ జూడ రుచుల జాడ వేరు
పురుషులందు పుణ్య పురుషులు వేరయా (విశ్వ)

(39) దాన ధర్మములును దయయు సత్యము నీతి
వినయ ధైర్య ధుర్య వితరణములు
రాజు పాలిటి కివి రాజయోగంబులు (విశ్వ)

(40) ఓగు బాగెరుగని యొట్టి మూఢ జనంబు
లిల సుధీ జనముల నెంచుటెల్ల
మృగము తోడ కుక్క మొరగిన సామ్యమౌ (విశ్వ)

(41) బడుగు నెరుగ లేని ప్రాభవం బది యేల
ప్రోది యిడని బంధు భూతి యేల
వ్యాధి దెలియ లేని వైద్యుడు మరి యేల ? (విశ్వ)

(42) బొంది యెవరి సొమ్ము పోషింప పలుమారు
ప్రాణ మెవరి సొమ్ము భక్తి సేయ
ధనము యెవరి సొమ్ము ధర్మమే తన సొమ్ము (విశ్వ)

(43) చిత్తశుద్ధి గల్గి చేసిన పుణ్యంబు
కొంచెమైన నదియు కొదువ గాదు
విత్తనంబు మర్రి వృక్షంబునకు నెంత ? (విశ్వ)

(44) ధార్మికునకు గాని ధర్మంబు గనరాదు
కష్టజీవి కెట్లు గానబడును
నీరు జొరక లోతు నిజముగా దెలియదు (విశ్వ)

(45) మర్మ మెరుగ లేక మతముల గల్పించి
యుర్వి దుఃఖు లగుదు రొకరి కొకరు
గాజు యింట కుక్క కళవళ పడు రీతి (విశ్వ)

(46) తేనె తెరల జాడ తేనెటీగ యెరుంగు
సుమ రసంబు జాడ భ్రమర మెరుగు
పరమ యోగి జాడ భక్తుం డెరుంగును (విశ్వ)

(47) వేద విద్య గాదు వీర విద్యయు గాదు
బాధ విద్య గాదు బరువు గాదు
మధుర మైనయట్టి మనసు నిల్పెడి విద్య
యోగ విద్య యెన్న పరగ వేమ !

(48) పసుల వన్నె వేరు పాలేక వర్ణమౌ
పుష్పజాతి వేరు పూజ యొకటి
దర్శనంబు వేరు దైవంబు యొక్కటి (విశ్వ)

(49) కడక నఖిలమునకు నడినాళ మందున్న
వేగుచుక్క వంటి వెలుగు దిక్కు
వెల్గు కన్న దిక్కు వేరెవ్వ రున్నారు ? (విశ్వ)

(50) మరియు దధిని ఘృతము మానులం దనలంబు
చారు సుమము లందు సౌరభంబు
తిలల తైల మట్ల తేజరిల్లు చిదాత్మ ! (విశ్వ)

(51) మంట లోహ మందు మాకుల శిలలందు
పటము గోడ లందు ప్రతిమ లందు
తన్ను దెలుసు కొరకు తగలదా పరమాత్మ ? (విశ్వ)

(52) లేడు లేడనినను లేడు లేనే లేడు
కాడు కాడటన్న కానె కాడు
తోడు తోడనినను తోడనె తోడౌను (విశ్వ)

(53) శైవ వైష్ణవాది షణ్మతంబుల కెల్ల
దేవుడొక్క డనుచు దెలియ లేరు
తమకు భేద మయిన తత్త్వంబు భేదమా ? (విశ్వ)

(54) కుండ కుంభ మండ్రు కొండ పర్వత మండ్రు
యుప్పు లవణ మండ్రు యొకటి కాదె
భాష లింతె వేరు పరత్త్వ మొక్కటి
**విశ్వదాభిరామ ! వినుర వేమ !**

## వేమన పద్య రత్నములు ( విద్యార్థులకు )

(55) వినవలె నెవ్వరు చెప్పిన
వినినంతనె తమక పడక వివరింప వలెన్
విని కని వివరము దెలసిన
మనుజుడు పో నీతిపరుడు మహిలో వేమా !

(56) ధనమే మూలము జగతికి
ధనమే మూలంబు సకల ధర్మంబులకున్
గొనమే మూలము సిరులకు
మనమే మూలంబు ముక్తి మహిమకు వేమా !

(57) కలిగిన మనుజుండు కాముడు సోముడు
మిగుల తేజమునను మెరయుచుండు
విత్తహీను డెంత రిత్తయై పోవును (విశ్వ)

(58) ధనము లేక యున్న ధైర్యంబు నిలువదు
ధైర్య మొదవదేని ధనము లేదు
ధనము ధైర్య మరయ దగు భూమిపతులకు (విశ్వ)

(59) అర్థవంతు సొమ్ము లాసింతు రర్థుల
య్యర్థికీని సొమ్ము వ్యర్థ మౌను
వ్యర్థ మైన సొమ్ము వ్యర్థుల జేరురా ! (విశ్వ)

(60) ధన విహీనుడైన తండ్రి గర్భంబున
భాగ్య పురుషు డొకడు పరగ బుట్టి
బహుళ ధనము గలిగి భద్ర మార్గంబున
పరుల కుపకరించి ప్రబలు వేమ !

(61) పరుల మోసపుచ్చి ధర ధన మార్జించి
కడుపు నింపుకొనుట కాని పద్దు
ఋణము సేయు మనుజు డెక్కువ కెక్కునా ! (విశ్వ)

(62) దాన మడుగు వాడు ధరలోన నధముండు
దాన మడుగ డేని దైవసముడు
దానమీని వాడు ధన్యుండు కాడయా ! (విశ్వ)

(63) కలిమి నాడు నరుడు కానడు మదమున
లేమి నాడు మొదలె లేదు పెట్ట
కలిమి లేమి లేని కాలంబు కలుగునా (విశ్వ)

(64) తాము బలిమి బెట్ట, తమకు తామే కలుగు
నడుగ నిడిన, తాము నడుగ గలుగు
నిందు నీని వాని కెందును గలుగదు (విశ్వ)

(65) పూర్వ జన్మ మందు పుణ్యంబు సేయని
పాపి ధనము కాశ పడుట యెల్ల
విత్త మరచి, కోయ, వెదకిన చందంబు ! (విశ్వ)

(66) భాగ్య హీనునకును పరుసవేది దొరుక
నదియు నిల్వ దపుడు వదలు గాక
వాన తోడ వచ్చు వడగండ్లు నిల్చునా ? (విశ్వ)

(67) మొదట నాస బెట్టి తుద 'లేదు పొమ్మ'న
పరమ లోభులైన పాపులకును
వారి యుసురు దాకి వగ చెడి పోవరా ? (విశ్వ)

(68) సకల విద్య జూచి సంతోష పడవచ్చు
చెయ్యి సాచి కాసు నియ్య లేడు !
చెలగి యొరుల కైతె చెప్ప వచ్చును గాని
తాము జేయ లేరు ధరను వేమ !

(69) నీచుల వినుతులు సేయుచు
యాచకమున దిరిగి తిరిగి యలసుట కంటెన్
యేచిన నింద్రియ పశువుల
గాచిన వాడిందు నందు ఘనుడగు వేమా !

(70) ఎంత భూమి దిరిగి యే పాటు బడుచున్న
నంటనీక ప్రాప్తి వెంట దిరుగు
భూమి క్రొత్తయైన భోక్తలు క్రొత్తలా ? (విశ్వ)

(71) తనకు ప్రాప్తి లేక దాత లివ్వ రటంచు
దోష బుద్ధి చేత దూరుటెల్ల
ముక్కు వంక జూచి ముకురంబు దూరుట ! (విశ్వ)

(72) ఒల్ల నన్న బోదు, యొలె నన్నగా రాదు
తొల్లి జేయునట్టి ధూర్తు ఫలము
యుల్ల మందు వగవ కుండుట యోగ్యంబు (విశ్వ)

(73) చెడ్డవాని మిగుల జెరుచును దైవంబు
అడ్డ పడడు వాని కాపదైన
చెడిన చేను జూచి యొడయడు మెచ్చునా (విశ్వ)

(74) పుణ్యము గలవాని పుష్ఠంబు పుండైతె
వసుధ లోన చాల వార్త కెక్కు
పేదవాని యింట పెండ్లైన నెరుగరు (విశ్వ)

(75) కనులు పోవు వాడు కాళ్ళు పోయిన వాడు
ఉభయు లరయ గూడి యుండినట్లు
పేద పేద గూడి పెనగొని యుండును (విశ్వ)

(76) తనకు జేయు మేలు దా దెలియగ నేర్చు
నెలమి తోడ కుక్క యెరుక భువిని
తనకు జేయు మేలు దా దెలియగ లేని
మనుజు డెంత ఖలుడు మహిని వేమ !

(77) తల్లి దండ్రి మీద దయ లేని పుత్రుండు
పుట్ట నేమి వాడు గిట్ట నేమి ?
పుట్ట లోన చెదలు పుట్టవా గిట్టవా ! (విశ్వ)

(78) కన్నులందు మదము గప్పి గానరు గాని
నిరుడు ముందటేడు నిన్న మొన్న
దగ్ధులైన వారు తమకంటె తక్కువా ! (విశ్వ)

(79) బాహ్య విద్య లెల్ల వేశ్యల వంటివి
భ్రమల బెట్టి తేట పడగ నియవు
గుప్త విద్య యొకటి కులకాంత వంటిది (విశ్వ)

(80) పతిని విడువ రాదు పది వేల కైనను
పెట్టి చెప్పరాదు పేదకైన
పతిని దిట్టరాదు సతి రూపవతియైన (విశ్వ)

(81) స్త్రీలు గల్గు చోట చెల్లాటములు గల్గు
స్త్రీలు లేని చోటు చిన్న బోవు
స్త్రీల చేత నరులు చిక్కుచున్నారయా (విశ్వ)

(82) తనదు నృపతి తోడ తన యాయుధము తోడ
నగ్ని తోడ పరుల యాలితోడ
హాస్య మాడుటెల్ల ప్రాణాంతమౌ సుమ్ము (విశ్వ)

(83) హీన నరుల తోడ నింతుల తోడను
పడుచువాండ్ర తోడ ప్రభువు తోడ
ప్రాజ్ఞ జనుల తోడ బ్రహ్మజ్ఞ జనులతో
వైపు దెలసి పలుక వలయు వేమ !

(84) కోపమునను ఘనత కొంచెమై పోవును
కోపమునను మిగుల గోడు జెందు
కోప మడచెనేని కోరిక లీడేరు (విశ్వ)

(85) ఇనుము విరిగె నేని యిను మారు ముమ్మారు
కాచి యతక నేర్చు కమ్మరీడు
మనసు విరిగె నేని మరి యంట నేర్చునా ! (విశ్వ)

(86) ఇంటి యాలు విడిచి యిల జారకాంతల
వెంట దిరుగువాడు వెఱ్రివాడు
పంట చేను విడిచి పరిగె యేరిన యట్లు ! (విశ్వ)

(87) అల్ప సుఖము లెల్ల నాశించి మనుజుండు
బహుళ దుఃఖములను బాధ పడును
పరసుఖంబు నొంది బ్రతుకంగ నేరడు (విశ్వ)

(88) ఇహము నందు బాధ లెన్నైన బడవచ్చు
యముని బాధ లేక నమర వలెను
పరము బాధ లేక బ్రతుకుడీ నరులార ! (విశ్వ)

(89) దీపంబు లేని యింటను
రూపంబుల దెలియలేరు రూఢిగ తమలో
దీపమగు తెలివి గలిగియు
పాపంబుల మరుగు త్రోవ బడుదురు వేమా !

(90) స్వానుభూతి లేక శాస్త్ర వాసనలచే
సంశయంబు చెడదు సాధకునకు
చిత్రదీపమునను జీకటి చెడనట్లు (విశ్వ)

(91) యెరుక గలుగుటకును నే జాతియును నేమి
యెరుక లేక దిరుగ నేమి గలదు ?
యెరుక గలుగు వరకె యీ జాతి ధర్మములు ! (విశ్వ)

(92) సాధు సజ్జనులను సంతరించినవాడు
ప్రజల సంతసంబు పరచువాడు
కదసి శాత్రవులను కరుణ జూచినవాడు
పాదుకొన్న ధర్మ ప్రభువు వేమ !

(93) భూపతి కృప నమ్మి భూమి జెరుచువాడు
ప్రజల యుసురు దాకి పడును పిదప
యెగర వేయు బంతి యెందాక నిల్చురా (విశ్వ)

(94) పెక్కు జనుల జంపి పేదల వధియించి
డొక్క కొరకు నూళ్ళు దొంగిలించి
యెక్కడికిని బోవ నెరిగి యముడు జంపు (విశ్వ)

(95) జనన మరణములకు సరి స్వతంత్రుడు గాడు
మొదల కర్త గాడు తుదను గాడు
నడుమ కర్త ననుట నగుబాటు కాదొకో ? (విశ్వ)

(96) వ్రాత వెంట గాని వరమీడు దైవంబు
సేత కొలది గాని వ్రాత గాదు
వ్రాత కజుడు కర్త సేతకు దా కర్త ! (విశ్వ)

(97) దేవ పూజ సేయ దివ్య భోగము గల్గు
తత్త్వ మెరిగెనేని దైవ సముడె
యేమి లేని నరున కేగతి లేదురా (విశ్వ)

(98) మతము లెన్ని యైన సతముగా నుండవు
సతముగాను యుండు జగతి నొకటి
యంత మదము విడిచి నా బ్రహ్మ మరయుట (విశ్వ)

(99) చెట్టందు విత్తు బుట్టెను
చెట్టును విత్తందె బుట్టె చెలిమి తలిర్పన్
చెట్టును విత్తును రెండును
బుట్టిన విధి దెలియ వలయు భువిలో వేమా !

(100) ఆశ కన్న దుఃఖ మతిశయంబుగ లేదు
చూపు నిలుపకున్న సుఖము లేదు
మనసు నిలుపకున్న మరి ముక్తి లేదయా ! (విశ్వ)

(101) యొడలు బడల జేసి యోగుల మనువారు
మనసు కల్మషంబు మాన్ప లేరు !
పుట్ట మీద గొట్ట భుజగంబు చచ్చునా ? (విశ్వ)

(102) మంటి కుండ వంటి మాయ శరీరంబు
చచ్చు నెన్నడైన, చావ దాత్మ !
ఘటము లెన్ని యైన గగనంబు యేకమే (విశ్వ)

(103) తనువు లోన జీవ తత్త్వ మెరుంగక
వేరె కలదటంచు వెదుక నేల ?
భాను దుండ దివ్వె బట్టి వెదుకు రీతి (విశ్వ)

(104) జీవి లోన నుండు స్థిరమును గానక
తిరుగు నస్థిరంబు వరుస నమ్మి !
స్థిరము నస్థిరమును దెలియ జీవికి ముక్తి (విశ్వ)

(105) సకలాకారు డనంతుడు
సకలాత్మలయందు సర్వసాక్షియు దానై
సకలమున నిర్వికారుం
డకలంక స్థితిని బ్రహ్మ మనబడు వేమా !

(106) లోను జూడ జూడ లోకాభిరామంబు
బయలు జూడ జూడ బంధనంబు
తన్ను జూడ జూడ తారక బ్రహ్మంబు (విశ్వ)

(107) గాలి లేని దీపకళిక చందంబున
నలలు సుళ్ళు లేని జలధి రీతి
నిశ్చలాత్మ యెన్న నిర్వికారంబున
నుండెనేని ముక్తి యండ్రు వేమ !

(108) ఏక బ్రహ్మము నిత్యము
వైకల్పిక మైన యట్టి వస్తువు లెల్లన్
యేకత్వంబని యెరిగిన
శోకములే కల్ల ! ముక్తి సులభము వేమా !

ఓమ్ తత్ సత్ !!!

**సూచన : ఈ 108 పద్యములు రాగయుక్తముగా, శ్రావ్యముగా, పిల్లలకు, విద్యార్థులకు పనికివచ్చే వ్యాఖ్యానముతో సహా AUDIO C.D. లుగా - 2 వ పేజీలో యిచ్చిన శ్రీ పప్పు సదాశివ శాస్త్రి గారి అడ్రసులో దొరుకుతాయి !**



రచయిత:
భాగవతుల శ్రీనివాస రావు
సెల్: 9618165402
E-mail:
samanvaya.bharathi@gmail.com

## ఈ పుస్తకం వల్ల పిల్లలకు ప్రయోజనాలు :

1. భారతీయ సంస్కృతి అంటే ఇదీ - అనే దృక్పథం !
2. తెలుగువారిగా మన కనీస ధర్మాలు తెలియటం !
3. మాతృభాష తెలుగు పలుకులలోని తియ్యదనం !
4. యోగి వేమన హృదయం నీతి బోధల సారం!
   150 వేమన సూక్తులు (తాత్పర్యంతో)
   108 వేమన పద్యాలు
5. నైతిక, సాంస్కృతిక, మానవీయతా వికాసం !
6. ఉత్తమ వ్యక్తిత్వ లక్షణాలు !
7. వివేకం, విచక్షణ, శక్తి యుక్తులు !
8. లోక రీతి, వ్యవహార నీతి!
9. సందర్భోచిత వ్యాఖ్యా కౌశలం....



**Parents and Teachers get the ability to clarify children's doubts on cultural matters.**



